ఈ నెలలో...

కథలు (మాస పత్రిక)

4. నేర తరంగాలు—పి. చంద్రశేఖర అజాద్
14. చిల్లర దొంగలు—తిరుమలశ్రీ
32. రక్తాభిషేకం—ఎమ్. వి. వి. సత్యనారాయణ
51. బందిపోట్లు—కాశీభట్ల భానుమూర్తి
66. చెరపకురా చెడేవు—కృష్ణచైతన్య
80. దొంగలొస్తారు జాగ్రత్త—బి. రాజేశ్వరి
95. పతనం—తాయి
108. చిత్రమైన కోరిక—ప్రతాప రవిశంకర్
118. ముష్టివాడు-దొంగనోట్లు—సరసి
138. టోకెన్—బోడపాటి
146. సమాధిరాయి—కాశీభట్ల భానుమూర్తి
186. గుడ్డి దర్బారు (సీరియల్)—వసుంధర

నవలలు (సప్లిమెంట్)

3. అలీబాబా 40 దొంగలు— అజీజ్
61. దేశద్రోహులు—ప్రతాప రవిశంకర్
107. విదేశీయులు-విగ్రహాలు — టెంపోరావ్
146. వనభోజనాలు—బి. రాజేశ్వరి
180. కళ్యాణ దుర్గం (సీరియల్)—బొమ్మిడి అప్పారావు

ఇవిగాక — క్రైమ్‌లో తమాషాలు, ముఖచిత్ర వ్యాఖ్యల పోటీ, మీ తీర్పు ఏమిటి, అపరాధ పరిశోధన పోటీ, మరెన్నో ఆకర్షణలు!!!

చంద్రశేఖర అజాద్

నేర తరంగాలు

రాజారావుకు ఈ నడుమ కాలంలో భార్య మొహం చూస్తుంటే భరించలేని అసహ్యం కలుగుతోంది.

సరిగ్గా పదిహేను సంవత్సరాల క్రితం రాజారావు రమను వివాహం చేసుకొన్నాడు.

రమ అనాకారి కాదు! అలాగని గొప్ప అందగత్తె

కూడా కాదు. ఆమె ఎలా వున్నా అప్పట్లో రాజారావుకు ఆమె దేవతలా కనపడింది.

రమ ఆరో తరగతి మాత్రమే చదివి ఇంక చదవ నంటూ మొండికేసి మానేసింది. ఆమెకు చీరలన్నా, సినిమా లన్నా చాలా యిష్టం.

భర్త అంటే ప్రత్యక్ష దైవమని ఆమె అభిప్రాయం. అందుకే ఉదయం లేవగానే ఆయన కాళ్ళకు నమస్కరించి, మంగళసూత్రం కళ్ళ కద్దుకొని గాని ఏ పనీ చేసేదికాదు. రాజారావుకు కావలసినవి అమర్చి పెట్టడంలోనే అంతులేని ఆనందాన్ని అనుభవిస్తుండేది.

రాజారావు పెళ్ళిచేసుకునే నాటికి అతని దగ్గర ఏమీ లేదు. ఏదో ఒక వ్యాపారం చెయ్యాలని నిర్ణయించు కుంటున్న దశ అది. మొదట వ్యాపారం కాఫీపొడి అమ్మ కంతో మొద లయింది. రాజారావు కష్టజీవి. తను అను కున్నది సాధించాలనే తపన కలవాడు. తన పరిసరాల్ని, వ్యక్తుల్ని పరిశీలించటం, వ్యాపార మెళకువల్ని గ్రహించు టలో చురుకుగా వుండటంతో అనతికాలంలో వ్యాపారం వృద్ధి చెందింది. కాగా తన గమ్యం చేరుకోవటానికి— పెద్ద వ్యాపారంలోకి ఎగబ్రాకాల్సిన అవసరం ఏర్పడింది.

సిగరెట్ కూడా త్రాగని రాజారావు వ్యాపార నిర్వ హణలో దాంతోపాటు 'మందు' కూడా సేవించాల్సి వచ్చింది. చాలా సందర్భాలలో కంట్రోల్ చేసుకొన్నా అత్యవసర పరిస్థితుల్లో మాత్రం తప్పలేదు. ఆ విధంగా రాజారావు నాగరిక సమాజంలోకి తొలి అడుగు వేశాడు. అప్పుడే డబ్బుంటే ఈ సమాజంలో ఏమేం సుఖాలు కొనుక్కోవచ్చో మరింతగా అనుభవంలోకి వచ్చింది.

అయినా రాజారావు వ్యాపారాన్ని నిర్లక్ష్యం చెయ్యలేదు.

తనను రెండు భాగాలుగా విభజించుకున్నాడు. ఓ రాజారావు వ్యాపారి. వ్యాపారంలో వున్నంతవరకూ అతను చాలా ప్రిక్టు. రెండో రాజారావు వ్యాపారంలో లేనప్పుడు ఆధునికంగా జీవితాన్ని విచ్చలవిడిగా అనుభవించాలనే ఆరాటం చెందేవాడు.

రమకు ఈ విషయాలు బొత్తిగా తెలియనని కాదు. ఆమెకు క్రొత్తలో ప్రపంచమంతా ప్రళయమొచ్చి కొట్టుకు పోయినట్లనిపించింది. వంటరిగా కూర్చుని ఏడ్చేపింది. కన పడని దేవత లందరికీ మ్రొక్కుకుంది. అయినా రాజారావులో మార్పులేదు సరికదా ఎక్కువయింది.

తర్వాత రమ అలాంటి వాటిని పట్టించుకోలేదు. పైపెచ్చు ఆమె చూసే సినిమాల సందేశం ఆమె తలకు బాగా ఎక్కింది. అందుకే రమ తన చేతుల్తో స్వయంగా భర్తకు మందు అందించేది. భర్త ఎవరైనా అమ్మాయిని ఇంటికి తెచ్చినా ఏమనేది కాదు.

"ఆయనకుండాలి గాని, ఆయన సుఖాన్ని నే నెందుకు కాదనాలి" అని సరిపెట్టుకునేది.

తాను మాత్రం వచ్చిన సినిమాలు చూట్టంలోనూ, చీరలు కట్టుకోవటంలోనూ తృప్తి వెతుక్కోగలిగింది. అందుకు పిల్లలు పుట్టకపోవడం ఓ కారణం అయితే, రాజారావు బంధువుల్ని దగ్గరకు చేరనీయక పోవటం మరో కారణం.

రాజారావు వ్యాపారం మూడు పువ్వులూ ఆరు కాయలుగా వృద్ధిచెందింది. ఆర్థికంగా ఏ ఇబ్బందులూ దరిచేరని స్థాయికి రాజారావు చేరుకోగల్గాడు. దాంతోపాటు వ్యసనాలూ ఆ స్థాయికి ఎదిగాయి.

అదే సమయంలో రమలో మళ్ళీ మార్పు రాసాగింది.

అందుకు సినిమాలు, ఆమె చదివే సాహిత్యం, ఇరుగు పొరుగు ఎవరైనా కారణం కావచ్చు. ఆమెలో మార్పు మెల్ల మెల్లగా మొదలయి ఆమెను పూర్తిగా మార్చేసింది.

రాజారావు త్రాగుడు విషయంలో పట్టించుకోకున్నా, ఆడపిల్లల్ని ఇంటికి తీసుకొచ్చే విషయంలో ఆ రోజు మొదటిసారిగా అభ్యంతరం చెప్పింది.

"ఇకనుండి ఈ ఇంటికి మరో ఆడది రావటం నా కిష్టం లేదు."

రాజారావు ఈ మాటలు విని ఆశ్చర్యంతో, కోపంతో ఊగిపోయాడు. ఆ చూపులకే శక్తి వుంటే రమను కాల్చి బూడిద చేసేవి. అంత తీక్షణంగా చూస్తూ,

"ఇది నీ బాబుగాడి ఇల్లా" అన్నాడు.

"నా బాబుగాడి ఇల్లెలా అవుతుంది. నా బాబుగాడి ఇల్లయితే ఇంత ధైర్యంగా తీసుకురాగలరా?" నిలదీసింది.

రాజారావు కోపం కట్టలు త్రెంచుకొంది.

"నా ఇష్టం. పిచ్చిగా వాక్క పడుండు."

"మీరు బయట లక్ష తిరగండి. నా కనవసరం. ఇంట్లో మరో ఆడది గడప త్రొక్కితే నేను సహించను."

"నువ్వేంటే బోడి. నా ఇష్టం వచ్చినట్లు చేస్తా. ఉంటే వుండు లేకపోతే పో" అరిచాడు.

"పోటానికి కాదు వచ్చింది. మీ ఇష్టం ఇంట్లో కాదనే నే చెబుతుంది."

"నిన్ను చంపేస్తా" మీదికొస్తూ అన్నాడు.

"చంపండి" రమ గట్టిగా అంది.

విసురుగా లేచింది చెయ్యి. మరుక్షణం దూరంగా పడింది రమ. ప్రపంచమంతా గిర్రున తిరిగినట్లయింది. తనకు తెలియకుండానే భోరున ఏడ్చేసింది. ఆ పడిన శబ్దా

వికి ప్రక్కింటివారు హడావుడిగా వచ్చి రాజారావును రమను చూసి ప్రక్కకు తప్పుకున్నారు.

రాజారావు ఆవేశం దిగసాగింది. క్రిందపడ్డ రమ కళ్ళలో గెలిచాననే ఆత్మవిశ్వాసం తడితడిగా కనిపించింది. రాజారావు ఆ రోజు విపరీతంగా తాగేశాడు. రమలో మార్పు అతనికో గొప్ప షాక్. ఆమె రూపం కళ్ళముందు బ్రహ్మరాక్షసిలా పెరిగిపోసాగింది. ఆ స్థితిలో తనను ప్రక్కింటివారు చూడటంతో మరీ కుంచించుకుపోయాడు.

రాజారావుకు రమకు నడుమ ఘర్షణలకు నాంది ఆ సంఘటన. అటు తర్వాత అవి సర్వ సామాన్యం అయ్యాయ్. రాజారావు జనంలో భయంకరుడుగా ప్రచారం అయ్యాడు. రమపట్ల సానుభూతి అపారంగా పెరిగింది.

2

రాజారావు కిప్పుడు రమనుండి విడిపోవాలనే ఆరాటం ఎక్కువయింది. అయితే అందుకు ఎన్నో ప్రతిబంధకా లున్నాయి.

రమ విడాకులకు ఏ మాత్రం అంగీకరించటం లేదు. తనతో పలికినా, పలకకున్నా, ఇంటికి వచ్చినా, రాకున్నా పట్టించుకోవటం మానేసింది.

రాజారావుకో సర్కిల్ వుంది. సంగీతం మీద, సాహిత్యం మీద అభిరుచి వుంది. ఆయన మిత్రుల్లో కొందరు మర్యాదస్తులు. అందుకే రాజారావు కఠినమైన నిర్ణయాలు తీసుకోలేక పోతున్నాడు. పూర్తిగా కాకున్నా కొంతమేర కయినా అతను సమాజానికి దడుస్తాడు.

కాగా ఏ రకంగా బయటపడాలి? ఆయన మస్తిష్కం అనేక మార్గాల్ని వెతికింది. రమను మానసికంగా హింసించటానికి అనేక మార్గాలను వెతికాడు. రమ కూడా

తక్కువ తినలేదు. వెరసి రాజారావు ప్రయోగాలు తనకే ఎదురు తిరిగాయి.

చివరిగా రాజారావు రమను ఈ లోకంలోనుండి పంపే మార్గం కోసం అన్వేషించటం ప్రారంభించాడు.

ప్రపంచం దృష్టిలో తాను దుర్మార్గుడుగా వున్నాడు. ఈ సమయంలో నిజంగా రమ ఆత్మహత్య చేసుకున్నా హత్య చేశాడని తననే అంటారు. పత్రికల నిండా రాస్తారు కూడా. కాబట్టి చాలా జాగ్రత్తగా ఆలోచించాలి. రమను వదిలించుకోవాలి! తను ఉరికంబం ఎక్కకుండా, పరువు పోకుండా బయటపడాలి! ఎలా?

అనేక మార్గాలు తట్టినా ఏవీ ఆయన్ని సంతృప్తి పరచ లేక పోయాయ్. ప్రతి దాంట్లోనూ ఎక్కడో లోప ముంటుంది. ఇలా వుండగా రాజారావుని పత్రికలో పడ్డ ఓ వార్త ఆకర్షించింది.

"గ్యాస్ స్టవ్ ప్రమాదంలో ఇరువురి మృతి."

రాజారావు మనస్సులో ఓ ప్లాను తయారయిపోయింది. రమకు మతిమరుపు ఎక్కువ. చాలాసార్లు గ్యాస్ స్టవ్ కట్టెయ్యకపోవటంతో గ్యాస్ లీక్ అయి వాసన వేస్తుంటే రమతో మాట్లాడేవారు గుర్తించి చెబితే కట్టేసేది. వాళ్ళంతా చాలాసార్లు అన్నారు కూడా.

"రమగారూ ఇలా మర్చిపోతే చాలా కష్టం — ప్రమాదాలు జరిగిపోతాయి" అంటూ.

రాజారావు ప్లాను రూపొందించుకున్నాక తొందరపడ లేదు. అదీ ప్లానులో భాగమే.

3

రాజారావులో మార్పు రమకు ఆశ్చర్యం కలిగించింది. ఇప్పుడు రమతో ఎంతో ఆప్యాయంగా మాట్లాడుతున్నాడు.

దాదాపు త్రాగటం మానేసాడు. ఆడవాళ్ళను కన్నెత్తి చూడటం లేదు. రమ ఆనందానికి అంతులేదు దేవుడిమీద మరింత విశ్వాసం పెరిగిపోయింది. రాజారావులో ఈ మార్పును చుట్టుప్రక్కల వారు గమనించకపోలేదు.

నెలరోజుల్లో ఆ విధంగా వాతావరణంలో మార్పు తీసుకొచ్చేక తన నిర్ణయాన్ని అమలుచేయటానికుపక్రమించాడు.

రాజారావు భోంచేసి ఆ రాత్రికి ఊరు వెళతాడు. వెళ్ళేటప్పుడు వంటింటి కిటికీలన్నీ బంధించి వుంటాయి. గ్యాస్ లీక్ చేసి వెళతాడు. రమ పడుకుంటుంది. తెల్లవారిగాని లేక అంతకు ముందే గదిలోకి వెళ్ళి లైటు వేస్తుంది. అప్పటికే గదినిండా అలుముకుని వున్న గ్యాస్ ఒక్కసారిగా భగ్గుమంటుంది. ఆ తర్వాత రమ....వికృతంగా ... !

జనం ఎవ్వరికీ అనుమానం రాదు. తను మరుసటిరోజు వస్తాడు గుండెలు పగిలేలా ఏడుస్తాడు. ప్రమాదవశాత్తు మరణించిందని పత్రికలు రాస్తాయి. తనను హంతకుడిగా ఎవరూ నిరూపించలేరు. హాయిగా తను కోరిన ఆడది.... సుఖాలు....

అనుకున్నట్లుగానే రాత్రి తొమ్మిది గంటలకు భోజనాలయ్యాక కిటికీ తలుపులు మూసే వున్నాయ్. వంటగది తలుపు మూసి రమ వచ్చింది. బెడ్ రూంలోకి వచ్చారిద్దరూ. సూట్ కేసులో బట్టలు సర్దుతోంది రమ.

"బాత్ రూమ్ కెళ్ళొస్తా" అంటూ రాజారావు బయట కొచ్చాడు. చప్పుడు చేయకుండా వంటగది తలుపు తెరిచి గ్యాస్ లీక్ చేసి, తలుపు మూసేశాడు. గదిలోకి వచ్చాడు. అప్పటికి బట్టలు సర్దటం పూర్తయింది. బట్టలు మార్చుకుని "రెడీనా" అంటూ వచ్చాడు.

"ఆ" అంది రమ.

సూట్ కేస్ అందుకొన్నాడు. ప్రేమగా చూస్తోంది రమ. దగ్గరకు లాక్కొని బలంగా ముద్దు పెట్టుకొన్నాడు.

"ఎల్లుండి వస్తారుగా" సిగ్గుపడుతూ అంది.

"తప్పకుండా."

"భోజనం చేసి వుంచుతా."

"అలాగే."

రాజారావు బయటకొచ్చాడు. నాలుగడుగులు వేశాక రిక్షా వచ్చి ఆగింది సూట్ కేస్ అందులో వుంచి ఎక్కాడు. రిక్షా కదిలింది.

రమ తలుపు మూసి పడక గదిలోకి వెళ్ళింది.

ఓ వార పత్రిక అందుకొని ప్రక్కమీద పడుకొంది.

4

రాజారావు లాడ్జింగ్‌లో స్నానంచేసి కూర్చున్నాడు. మనస్సంతా ప్రశాంతంగా వుంది. తాను అప్పుడే వచ్చి మూడు గంటలు దాటింది. తెల్లవారటానికి ఇంకా అయిదు గంటలు. ఆ తర్వాత....!?

రమ పిపినారి మనస్తత్వాన్ని కొన్ని విషయాల్లో ప్రదర్శిస్తుంటుంది. తమ ఇద్దరికోసం పనిమనిషి దండగంటూ మాన్పించేసింది. అలాగే యింటి రహస్యాలు బయట పొక్కకూడదనేది కూడా వుంది. అది కూడా తనకు సహకరించింది. లేకుంటే ప్లాన్ బెడిసికొట్టడానికి అవకాశాలున్నాయ్. గది చల్లగా వుంది. రాజారావు ఆలోచనలు గతంలోకి పరుగెడుతున్నాయ్....

రాజారావు సూట్ కేస్‌లో నుండి టేప్‌రికార్డర్ బయటకు తీసి ఆన్ చేశాడు సిగరెట్ వెలిగించి పొగ గాల్లోకి వదిలాడు. పాటలు వస్తున్నాయ్. సిగరెట్ అయిపోయింది. అష్ట్రేలో కుక్కాడు.

అప్పుడు వినిపించింది ఆ పాట: గుండె లోతుల్లోకి పయనించే పాట. అంతరాంతరాల్లోకి చొచ్చుకుపోయే పాట. పండు వెన్నెల్ని, పసిపిల్లల అమాయకత్వపు అందాల్ని ముందుంచే పాట.

బ్రతుకులోని తియ్యదనాన్ని, చిన్ననాటి అనుభూతుల్ని తట్టి లేపే ఆ పాట మధురంగా వినిపిస్తోంది.

రాజారావును ఆ పాట కదిలించింది. నిలదీసింది. చిన్ననాటి పేదరికం, కష్టపడి పైకి రావటం, రమతో జీవితం, సో కాల్డ్ లైఫ్‌కు అలవాటుపడటం, చివరకు హంతకుడుగా మారా లనుకోవటం యివన్నీ రీలులా గిర్రున తిరిగాయ్.

రాజారావు కృంగిపోయాడు.

క్షణిక సుఖాలకోసం తన జీవితభాగస్వామిని చంపటమా?

ఎంత దారుణం! ఎంత పతనం!

"నో" నోట్లోంచి వచ్చాయా మాటలు అప్రయత్నంగా.

"రమ చావకూడదు."

గబ గబ లేచాడు. బట్టలన్నీ సూట్ కేస్‌లో కుక్కాడు. టైం రెండుగంట లవుతోంది. ఫోన్ చేశాడు. బస్ రెడీగా వుందని చెప్పారు. గుండె దడదడ లాడుతోంది. రూమ్ తాళంచెవి కౌంటర్‌లో యిచ్చి బిల్ పే చేశాడు. బస్ కాంప్లెక్స్‌కు వచ్చి బస్ అందుకోగల్గాడు. వెంటనే కదిలింది. అయినా అశాంతి తల బ్రద్దలవుతోంది.

"రమను చూడగలడా? ఏమైనా జరిగితే? ఎందుకిలా మారాను? భగవాన్" తల నొక్కుకున్నాడు.

బస్సు వేగంగా పోతోంది? అంతకంటే వేగంగా రాజారావు ఆలోచనలు పరుగెడుతున్నాయ్. సంఘర్షిస్తున్నాయ్.

రాజారావు ఇంటికి చేరుకొనేసరికి అయిదుగంటలు దాటింది. ఆత్రంగా బెల్ మ్రోగించాడు.

రమ మధ్యలో లేచి వెళ్ళివుంటే?

అసలు తలుపు తీస్తుందా?

అదే పనిగా బెల్ నొక్కాడు.

గుండె గుబగుబ లాడ్తోంది.

తలుపు తెరుచుకొంది.

ఎదురుగా....

నిద్ర కళ్ళతో రమ!

"ఏంటి అప్పుడే వచ్చారు" ఆశ్చర్యంగా అంది. రాజారావు మాట్లాడకుండా లోనికి వచ్చాడు. బట్టలు మార్చుకుంటూ అన్నాడు.

"లాడ్జింగ్‌లో పడుకోగానే పీడ కలొచ్చింది. గ్యాస్ స్టవ్ ప్రేలి నువ్వు ..." ఆగిపోయాడు.

"నిజమేనండోయ్. మీ కల నిజమయ్యేదే. నా మతి మరుపు చూడండి. రాత్రి గ్యాస్ కట్టెయ్యలేదు. మీరటు వెళ్ళగానే ప్రక్కయింటి మామ్మగారొచ్చింది. వాళ్ళింటి నిండా చుట్టాలట....వాళ్ళ గ్యాసేమో అయిపోయిందట. మీరెటూ రెండు రోజులదాకా రానన్నారు కదా అని నేనే మనది తీసుకెళ్ళమన్నాను. ఎల్లుండి వాళ్ళదొస్తుంది లెండి. తలుపు తీయగానే ఒకటే వాసన. అలాగే కొంచెంసేపు నిలబడ్డాం. మామ్మగారు బాగా గొడవ చేసింది...." రమ చెప్పుకుపోతోంది.

రాజారావు మాట్లాడలేదు. అతనిలో ఇప్పుడు మరో మనిషి నిద్ర లేచాడు!

పాట తాలూకు ప్రమాదం మెల్లగా కరిగిపోసాగింది! రమ రికార్డ్ చేసిన ఆ పాట ఆ క్షణం ఆమెను కాపాడినా ఆమె కింకా ప్రమాదం తొలగలేదు.

మరే రూపంలో రానుందో!!

☐

చిల్లర దొంగలు



క్రసిగా పళ్ళు నూరాడు వెంకట్రావు.

జెయిల్ నుండి విడుదలయి వచ్చి మూడు రోజులయింది.

బయటకు వచ్చినప్పటి నుంచీ ఆమెకోసం వెదుకుతూనే వున్నాడు ఆమె ఏఏ చోట్లకు రావచ్చునో ఆ యా చోట్లన్నీ గాలిస్తూనే వున్నాడు.

ప్రతీకారము, పగా దేహమంతా దహించి వేస్తూంటే ఆకలిదప్పులు సయితం విస్మరించి ఆమెకోసం అదే పనిగా వెదుకుతూనే వున్నాడు.

ఆర్నెల్ల శిక్ష అనంతరం జెయిల్లోంచి బయట పడగానే అతను చేసిన మొదటి పని—పదునయిన ఆరంగుళాల క_త్తిని కొనడమే!

అతనిలో రగులుతూన్న పగంత పదునుగానూ వుంది ఆ క_త్తి.

అతని పగ తీరా లంటే ఆ క_త్తికి పని చెప్పాలి!

ఆ క_త్తికి పని చెబితే ఆ పగ తీరుతుంది!

ఆరాటంతో, ఆత్రంతో నగరమంతా గాలించాడు వెంక ట్రావు—ఆమె కోసం!

లజ్ కార్నర్....పానగల్ పార్క్....ప్యారిస్.... మెరీనా....తనకు తోచిన ప్రాంతాలన్నీ విసుగు లేకుండా వెతికేసాడు. వెతికి వెతికి విసుగె_త్తిపోయాడు.

ఆమె కనిపించలేదు!

ఆర్నెల్ల నుంచి రాజుకుంటూన్న పగ అది!

ఆరని పగ!

ఆకలయినప్పుడు ఏదో గతికా ననిపిస్తూన్నా—అతని కళ్ళు మాత్రం ఆమెకోసం వెతుకుతూనే వున్నాయి.

వెంకట్రావులో సహనం రోజు రోజుకీ హరించి పోతోంది—ఆమె కనిపించక పోయినట్లయితే, ఆమె బదులు ఎవరో ఒకర్ని క_త్తితో పొడిచి చంపేయాలన్నంత కోపమూ, కసీ పెరిగిపోతున్నాయి!

అంతవరకూ తానొక చిల్లర దొంగ మాత్రమే!

కాని, యిప్పుడు హంతకుడిగా మారబోతున్నాడు.

అందుకు కారణం ఎవరు?

ఆమే!

తన కష్టాన్ని తేరగా, ఘరానాగా దోచుకోవడమే కాక, తనను జెయిల్కి కూడా పంపించింది!

ఆఫ్టరాల్ ఒక ఆడపిల్ల చేతిలో చిత్తుగా ఓడిపోవడం— అతని అహంపైన దెబ్బతీసింది.

తన మిత్రవర్గమంతా తన ధైర్యసాహసాలను ఎంతో మెచ్చుకుంటుంది. అటువంటిది ఓ ఆడపిల్ల తన ప్రగతికి ప్రతిబంధకంగా నిలుచోవడమే కాక, తన పతనానికి కూడా నాంది పలకడం సహించరానిది!

ఎన్నో చిల్లర దొంగతనాలు చేసాడు తాను తన ముప్ప య్యేళ్ళ జీవితంలో.

కాని, పదేళ్ళ వృత్తి అనుభవం—ఆ యువతి ముందు చిత్తుగా వోడిపోయింది!

తలచుకుంటేనే వొళ్ళంతా ఆవేశంతో వూగిపోతోంది అతనికి.

అందుకే, యెలాగైనా ఆమెను పట్టుకోవాలి. ఎత్తైన, వొత్తైన ఆమె వక్షంలో మెత్తని కత్తిని దింపాలి. మరే ఆడదీ తనతో చెలగాటా లాడకుండా బాగా బుద్ధి చెప్పాలి....అని ఆరాటపడుతున్నా డతను.

జేబులోంచి కత్తిని తీసి కసిగా పెదాలకు ఆనించు కున్నాడు వెంకట్రావ్.

మళ్ళీ కత్తి జేబులో పెట్టేసుకున్నాడు. అడుగులు వేస్తున్నాడు.

ముసలి సూర్యుణ్ణి చూసి హేళనగా అరుస్తూ గోల చేస్తున్నాయి సముద్ర కెరటాలు.

బీచ్ లో జనం అంతకంతకూ పెరుగుతున్నారు.

చేరువలో వున్న మహాలక్ష్మి గుళ్ళోంచి గంటలు, మంత్రాలు వినిపిస్తున్నాయి.

ఇసుకలో ఒకచోట చతికిలబడ్డాడు వెంకట్రావు.

తీక్షణమయిన అతని కళ్ళు జనంలో 'ఆమె' కోసం

వెదుకుతూనే వున్నాయి.

కొంతసేపటికి అలల గోల పడలేక కాటోలు ఇల నుండి పారిపోయాడు సూర్యుడు.

ఓ అరగంట తరువాత లేచి నిలుచున్నాడు వెంకట్రావు.

మహాలక్ష్మి గుడి దగ్గర భక్తుల గుంపు పెరిగింది.

గుడివైపు నడిచాడు వెంకట్రావు.

గుడి దగ్గర రంగు రంగుల పట్టుచీరెలతో, వొంటిపైన నగలతో, చేతులలో పళ్ళాలతో సందడిగా వున్నారు అతివలు.

గుంపుల మధ్య చకచకా తిరిగాడు వెంకట్రావు.

అతని చేతులు చురుగ్గా పనిచేశాయి.

ఓ పావుగంటలో అయిదు కాసుల చంద్రహారం ఒకటి ఓ స్త్రీ మెళ్ళోంచి వెంకట్రావు జేబులోకి వచ్చేసింది.

గుంపులకు దూరంగా జరిగాడు అతను. గబగబా అడుగులు వేస్తూ బస్టాపు వైపు నడిచాడు.

జెయిల్ నుంచి బయటపడ్డాక అదే మొదటి ప్రయత్నం!

ఆ మూడు రోజుల నుంచీ 'ఆమె' కోసం వెదకడంలో పడి వృత్తిధ్యాసే లేకుండాపోయింది.

అప్రయత్నంగా తలత్రిప్పి గుడివైపు చూసాడు అతను కలకలం ఏమైనా రేగిందేమోనని.

హారం పోగొట్టుకున్న స్త్రీ ఆ విషయం యింకా గుర్తించి నట్టులేదు.

కాని—

వెంకట్రావు చూపులు హఠాత్తుగా ఓ యువతి పైన పడ్డాయి.

చిన్నగా వులిక్కిపడ్డా డతను.

ఆమె!

కంగారుగా బస్టాపు వైపే వస్తోంది.

వెదకబోయిన తీగె కాళ్ళకు చుట్టుకోబోతోంది.

మూడు రోజులుగా కళ్ళలో వత్తులు వేసుకుని వెదుకుతూంటే కనిపించని ఆమె—అక్కడ హఠాత్తుగా దర్శనమిచ్చేసరికి అతనిలోని పగ నాగుబాములా బుసలు కొట్టింది.

ఆమె చేరువగా వచ్చింది.

అతనికి కొద్ది దూరంలో నిలుచుంది.

ఆమె వంక పరీక్షగా చూసాడు అతను.

దాదాపు పాతికేళ్ళుంటాయి ఆమెకు. సన్నగా, పొడవుగా వుంది. తెల్లగా, అందంగా, ఆకర్షణీయంగా వుండే రూపం. మెళ్లో ముత్యాలదండ, చెవులకు జుంకీలు.... వొత్తైన వాలుజడ....

ఆమె ముఖంలోకి పరిశీలనగా చూసాడు.

చక్రాలవంటి ఆ నల్లని కళ్ళు .... కొంటెగా నవ్వే కన్నులు....చిలిపి పెదాలు....ఆమె గుర్తే తనకు.

క్రూరంగా, కసిగా ఆమె కళ్ళలోకి చూసాడు అతను.

జేబులోంచి కత్తితీసి చిన్నగా ముద్దు పెట్టుకున్నాడు.

బస్ రావడంతో—ఫ్రంట్ నుండి ఎక్కి లేడీస్ సీటులో కూర్చుంది ఆమె.

వెనుక నుంచి యెక్కిన వెంకట్రావు ఆమెకు సమీపంలోనే జంట్స్ సీటులో కూర్చున్నాడు. అతని చూపులు ఆమె మీదే వున్నాయి.

టెర్మినస్ వరకు టికెట్ తీసుకున్నాడు అతను.

ఎక్కేవాళ్ళు యెక్కుతున్నారు.దిగేవాళ్ళు దిగుతున్నారు.

ఆమె తన దృష్టి నుండి జారిపోకుండా జాగ్రత్త పడుతున్నాడు అతను.

సైదాపేటలో బస్సు దిగిందామె.

ఆమె వెనకే వెంకట్రావు దిగాడు.

బస్టాపు నుంచి వెనక్కి నడక ప్రారంభించింది ఆమె.

ఎత్తైన పిరుదులు అందంగా కదులుతూంటే....నల్లని వాలుజడ పిరుదలమీద నర్తన చేస్తూంటే....ఆమె నడక ఓ నాట్యంలా అనిపించింది వెంకట్రావుకు.

పురుషుల్ని పిచ్చివాళ్ళను చేసే ఆమె అందానికి మరో సారయితే దాసోహమనేవాడే అతను. కాని, రగులుతూన్న పగ అతన్ని నిలవనివ్వడం లేదు. సౌందర్యారాధనకు తావు యివ్వడంలేదు.

కార్పొరేషన్ హాస్పిటల్ దగ్గర ఆగిందామె.

అక్కడ వున్న పబ్లిక్ టెలిఫోన్ బూత్‌లో ప్రవేశించింది.

ఆమె బయటకు వచ్చేంతవరకు ఎదురుగావున్న పేవ్‌మెంట్ మీదే అసహనంగా నిలుచున్నాడు అతను. గ్లాస్ డోర్‌లోంచి ఆమె కనిపిస్తోనే వుంది.

ఓ పది నిమిషాల తరువాత బూత్‌లోంచి బయటకు వచ్చిందామె.

జనంలో కలిసిపోయి మార్కెట్ వైపు తాపీగా నడక ప్రారంభించింది.

మళ్ళీ ఆమె ననుసరించా డతను.

మధ్య మధ్య ఆగి, పేవ్‌మెంటు ప్రక్కనున్న షో కేసులలోకి చూస్తోంది ఆమె.

ఆమె నిదానం చూస్తూంటే అతనికి అసహనం పెరిగి పోతోంది.

అక్కడికక్కడే ఆమె గుండెల్లో కత్తి దించాలన్నంత వుక్రోషంగా వుంది.

కాని, అందువల్ల తన కసి తీరదు!

ఆమెతో మాట్లాడాలి. తాను ఎవరో....ఎందుకు చంప బోతున్నాడో....తెలియజెప్పాలి. భయంతో ఆమె ప్రాణ భిక్ష కోసం ప్రతిమాలుతూంటే—ఆమె కన్నీళ్ళతో తనకు జరిగిన అవమానాన్ని కడిగివేసుకోవాలి.

ఆ తరువాత మెత్తగా కత్తిని ఆమె వక్షంలోకి దించాలి.

తన కక్ష తీర్చుకోవాలి!

ఆమె రైల్వేస్టేషన్‌కి ఎదుట వున్న సందులోకి నడిచింది.

ఆ సందులో మధ్యగా వున్న ఓ చిన్న పాత యింటి ముందు ఆగింది.

ఆ ఇంటికి తాళం వుంది.

హ్యాండ్‌బ్యాగ్ లోంచి తాళపు చెవి తీసింది. తాళం తెరిచి లోపల ప్రవేశించింది. తలుపులు దగ్గరగా మూసింది.

ఓ నిముషం తర్వాత పిల్లిలా ఆ యింట్లో ప్రవేశించాడు వెంకట్రావు.

తలుపులు లోపల గడియపెట్టేసాడు.

బాత్‌రూంలో ముఖం కడుక్కుని తుడుచుకుంటూ వస్తూన్న ఆమె—కంటెదుట ప్రత్యక్షమైన వెంకట్రావును చూసి చిన్నగా వులిక్కిపడింది.

అతని చేతిలో కత్తి వుంది.

అతని కళ్ళలో క్రౌర్యం వుంది.

కళ్ళు విస్ఫులింగాల్లా వున్నాయి.

జుట్టు చెదిరి, బట్టలు మాసి భీకరంగా వుంది ఆకారం.

"హలో!" అంటూ పలకరించిం దామె మంద హాసంతో.

ఆమెలో భయానికి బదులు, పెదవుల పైన చిరునవ్వు చూసేసరికి వొళ్ళు మండింది అతనికి.

"వంచకీ! నేను గుర్తున్నాను కదూ?" అన్నాడు.

ఆమె పెదవుల మీది చిరునవ్వు చెదరలేదు. ఆమె బెదరలేదు.

"నిన్నెలా మరిచిపోతాను? అలా కూర్చో" అంటూ కుర్చీ చూపించి, తాను మోడా మీద కూర్చుంది.

ఆ గదంతా కలయజూసా డతను.

ఆమె అతన్నే చూస్తోంది.

అతన్ని చూస్తూంటే ఆమె మనసు గతంలోకి జారి పోయింది.

2

జలజ చితికిన కుటుంబం నుంచి వచ్చింది. ట్వెంటీస్‌లో వున్న ఆమెది అందమయిన రూపం. చదువు టెన్త్‌తోటే ఆగిపోయింది. ముసలితల్లి తప్ప ఎవరూ లేరు ఆమెకు. టైపు నేర్చుకుని వుద్యోగం కోసం చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ఎక్కడికి వెళ్ళినా ఆమె అందమే అవరోధంగా నిలిచేది.

చివరకు కడుపు నింపుకోవడం కోసం తప్పుదారి త్రొక్కక తప్పలేదు ఆమె. అలాగని జలజ వ్యభిచరించేది కాదు. దొంగతనమూ చేసేది కాదు. ఓ క్రొత్త పద్ధతిని కనిపెట్టింది.

కేవలం తెలివితేటలను, సమయస్ఫూర్తినీ, తెగువనూ మిళాయించి బ్రతుకు తెరువుకు బాటలు వేసుకునేది.

అవినీతిపరులను వ్యాపారవస్తువులుగా చేసుకునేది.

అలాగని ఆమె బ్లాక్‌మెయిలరూ కాదు.

ఆమె 'విక్టిమ్స్' - పిక్‌పాకెట్సూ, చిల్లర దొంగలూను.

రద్దీగా వున్న షాపులన్నా, ప్రాంతాలన్నా జలజకు ఎంతో ఇష్టం. అటువంటిచోట్లలోనే తన విక్టిమ్స్ దొరుకుతూ వుంటారు ఆమెకు. అక్కడ సి.ఐ.డి. పని చేసేది. ఆమె కళ్ళు జేబు దొంగల కోసమూ, నగల దొంగల కోసమూ వెతికేవి.

అట్టి పరిస్థితులలోనే ఆరు నెలల క్రితం వెంకట్రావు తటస్థపడ్డాడు ఆమెకు.

అవి దీపావళి రోజులు కావడంతో ఏ షాపు చూసినా జనంతో కిటకిటలాడుతూ వుండి వీధులన్నీ రద్దీగా వున్నాయి.

లజ్ కార్నర్‌లో వున్న 'లాక్స్ అండ్ లాక్స్' షాప్సీ షాపులో ఏదో బేరం చేస్తూన్న జలజ చూపులు చురుకుగా కస్టమర్స్ అందరినీ కనిపెడుతూనే వున్నాయి.

అప్పుడే పడ్డాయి ఆమె చూపులు వెంకట్రావు మీద.

ఆమె అరుణాధరాలపైన సన్నగా చిరునవ్వు వెలిసి మాయ మయింది.

షాపులోంచి బయటకు జారుకుంటూన్న వెంకట్రావు వెనుకే తానూ బయటకు నడిచిందామె.

వెంకట్రావు రోడ్డు దాటి అవతలివయిపు పేవ్‌మెంట్ మీదకు చేరుకున్నాడు. హడావుడిగా జమ్మి బిల్డింగ్స్ దెస నడక సాగించాడు.

జలజ కూడా రోడ్డు దాటింది. పేవ్‌మెంటు మీదికి ఎక్కకుండా రోడ్డు పైనుంచే అతన్ని దాటి వెళ్ళింది. తరువాత పేవ్‌మెంటు మీదకు ఎక్కి అతనికి డ్యాష్ ఇచ్చింది.

ఇద్దరూ 'సారీ!' చెప్పుకున్నారు.

ఆమెను దాటి రెండడుగులు వేసాడతను, బస్టాపు వైపు.

హఠాత్తుగా మెళ్ళో రెండు చేతులూ పెట్టుకుని అరిచిం దామె - "దొంగ! దొంగ!" అంటూ.

"పారిపోతున్నాడు, పట్టుకోండి!" అంటూ వెంకట్రావు వైపు చూపించింది.

ఎదురు చూడని ఆ సంఘటనకు బిత్తరపోయాడు అతను. తెలివి తెచ్చుకుని పరుగెత్తబోయాడు.

కాని క్షణంలో అతన్ని పట్టేసారు జనం.

"నాకేం తెలియదు....నన్ను విడిచిపెట్టండి" అంటూ గింజుకున్నాడు.

"నాకు డ్యాష్ ఇచ్చి నా మెళ్ళో గొలుసు లాక్కుని పారిపోతున్నాడు" అంది జలజ తొణక్కుండా.

అతను లేదంటున్నా వినకుండా జేబులు వెదికి, బంగారు గొలుసును బయటకు తీశారు జనం.

"అదే!" అంటూ చటుక్కున గొలుసు అందుకుని కళ్ళకు అద్దుకుని మెళ్ళో వేసుకుంది జలజ.

నిర్ఘాంతపోయాడు వెంకట్రావు!

అది ఆమె గొలుసు కాదని ఎలుగెత్తి చాటాలనుకున్నాడు. కాని ఎవరిదని చెబుతాడు!

అతను తేరుకునేలోపునే తలో చేయీ, కాలూ పడ్డాయి అతని మీద.

ఆ సందడిలో చల్లగా అక్కడి నుంచి జారుకుంది జలజ.

అదీ ఆమే 'మాడస్ ఆపరేండి!'

వెంకట్రావును వోపిక వున్నంతవరకు చితగ్గొట్టి ఆనక

పోలీసులకు అప్పగించారు జనం.

వెంకట్రావు ఇంటిని సోదా చేసిన పోలీసులకు అంతకు ముందు అతను దొంగిలించిన వస్తువులు కొన్ని దొరికాయి. అందుకే కంప్లెయింట్ యివ్వడానికి జలజ కనిపించక పోయినా, దొరికిన దొంగవస్తువుల ఆధారంగా అతనిమీద కేసు పెట్టారు పోలీసులు. ఫలితంగా ఆరు మాసాల జైలు శిక్ష పడింది అతనికి.

కోర్ట్ రూమ్ నుంచి బయటకు వస్తూ మనసులోనే శపథం చేసాడు వెంకట్రావు - జైల్లో నుంచి తిరిగిరాగానే ఆమెను చంపెయ్యాలని!

ఆ తరువాత దినపత్రికలో చదివింది జలజ తన విక్టిమ్‌కి ఆర్నెల్లు శిక్ష పడినట్లు.

జలజ హాబీ, వృత్తీ అవే!

దొంగలు ప్రజల్ని చాటుగా దోచుకుంటే ఆమె దొంగల్నే పురావాగా దోచుకుంటూ వుంటుంది!....

3

ఆ వుదంతమంతా యిప్పుడు మదిలో మెదలడంతో అప్పుడే ఆర్నెల్లు అయిపోయిందా!? అనుకుంది జలజ.

సమయానికి తల్లి వూర్లో లేదు. అదీ ఒకందుకు మంచిదే అయిందనుకుంది.

"నువ్వింకా నిలుచునే వున్నావ్!" అందామె అతనితో.

పళ్ళు కొరికా డతను.

"నిన్నిప్పుడు చంపడాని కొచ్చాను!" అన్నాడు కఠినంగా.

కిల కిలా నవ్విందామె.

"చంపడానికి నువ్వు సిద్ధంగా వున్నా, చావడానికి నేను సిద్ధంగా వుండొద్దూ?" అంది కొంటెగా చూస్తూ.

ఆమె రూపమే కాక చూపులు కూడా అతనిలో కలవ రాన్ని రేపుతున్నాయి.

"వంచకీ! ఈ రోజు కోసమే ఆరు నెలలుగా వేచి వున్నాను. ఇవాల్టితో నీ ఆయువు మూడింది!" అన్నాడతను కోపంగా.

"చంపదలచుకున్నావు, బాగానే వుంది. కనీసం కారణ మైనా చెప్పొచ్చుగా!" మళ్ళీ నవ్వింధామె.

ఆమె నవ్వు అతనికి వళ్ళు మండిస్తోంది.

తనను చూపి ఆమె బెదిరిపోయి, భయంతో వొణికి పోతూ, ప్రాణభిక్ష కోరినట్లయితే అతనికి ఆనందంగా వుండేది. కాని ఆమె అందుకు వ్యతిరేకంగా తన పలుకుల్ని పసిపిల్లల ముద్దు మాటలుగా జమకట్టి నవ్వుతోంది.

"కూర్చోవడానిక్కూడా ధైర్యం లేనివాడివి - నన్నేం హత్య చేస్తావ్?" నవ్విందామె.

పళ్ళు కొరుకుతూ ఆమె ఎదుట కూర్చున్నాడు అతను.

"అలసిపోయినట్టు కనిపిస్తున్నావ్ - కాస్త కాఫీ పెట్టి తెమ్మంటావా?" ప్రశ్నించిందామె.

"అందులో విషం ఏదయినా కలిపి నన్ను వొదిలించు కుందామనా?" అన్నాడు తీక్షణంగా.

పకపక నవ్విందామె.

"నువ్వింత పిరికివాడి వనుకోలేదు!" అంది.

"షటప్!" అరిచా డతను.

"పోనీ ఇదైనా చెప్పు. నన్ను చంపాలని ఎందు కను కుంటున్నావ్? అందువల్ల నీకు వొరిగేదేమిటి?" తాపీగా ప్రశ్నించిందామె.

"తెలియకే అడుగుతున్నావా?....ఆరోజు నన్ను అవమా నించావ్. పల్లిగ్గా నన్ను దోచుకున్నావ్. నీ మూలంగానే

జీవితంలో మొదటిసారిగా జైలుకు వెళ్ళడం జరిగింది!"

అతని స్వరంలోని తీవ్రతకు భయపడడానికి బదులు, విస్మయంగా చూసింది జలజ.

"నువ్వు చెబుతూన్నది వింటూంటే ఆశ్చర్యంగా వుంది నాకు" అందామె. "నువ్వు ప్రజల్ని చాటుగా దోచుకుంటే—నేను నిన్ను పబ్లిక్‌గా దోచుకున్నాను....ఇక అవమానమూ, శిక్షా అంటావా—అవి మన వృత్తిలో వుండే రిస్కులు. వాటిలో దిగేటప్పుడే తెలుసుకోవాలి మనం, అందులో దిగబడిపోతామని!....నువ్వు చేసిన పనే నేనూ చేసాను. కాకుంటే మన పద్ధతులు మాత్రం వేరు. అంతే! ఇందులో నామీద నువ్వు ఇంతగా పగబట్టవలసిన అవసరమేమిటో బోధ పడడం లేదు."

ఆమె వాదనకు ఆశ్చర్యంగా చూసాడు వెంకట్రావు. అతనికి తెలియకుండానే ఆమె అందంతోపాటు, ధైర్యము, తెలివితేటలూ అతన్ని యే మూల నుంచో ఆకట్టుకుంటున్నాయి.

"నాన్సెన్స్. నీతో వాదించడానికి రాలేదు నేను. నిన్ను చంపడానికి వచ్చాను" అన్నాడు కటువుగా.

"ఛీ, ఏం మగాడివి నువ్వు? అందమైన ఆడపిల్లలతో మాట్లాడవలసిన మాటలేనా యివి?" అందామె చిరునవ్వుతో.

అంతలో యెవరో తలుపు కొట్టడంతో ఆగిపోయి అదోలా చూసాడు.

"ఎవరది?" అన్నాడు ఆమెతో మెల్లగా.

"పాల మనిషి అయివుంటాడు" అందామె లేస్తూ.

"ఆగు!" ఆజ్ఞాపించాడతను. "వచ్చింది నిజంగా పాల మనిషే నంటావా?" అడిగాడు అనుమానంగా.

"ఇది పాలవాడు వచ్చే సమయం."

ఆలోచనలో పడ్డాడతను.

ఆమె అతన్నే చూస్తోంది.

"అమ్మా! పాలు!...." అన్న కేక వినిపించింది బయట నుంచి.

"ఆల్‌రైట్. తలుపు కొద్దిగా తెరిచి పాలు పోయించుకో. నేను నీ వెనుకే నిలుచుంటాను. ఏ మాత్రం ట్రిక్ చేయ బోయినా కత్తి నీ వెన్నులో దిగుతుంది. గుర్తుంచుకో!" అన్నాడు వెంకట్రావు హెచ్చరిస్తూ.

ఆశ్చర్యంగా చూపిందామె.

"నన్ను పబ్లిక్‌గా చంపే ధైర్యం నీకుందా!...." అంది.

అతను జవాబు ఇవ్వకుండా ఆమె వంక తీక్షణంగా చూసాడు.

జలజ గిన్నె తీసుకువెళ్ళి, తలుపు వోరగా తెరిచి పాలు పోయించుకుంది.

అతను తలుపు వెనకే నిలుచున్నాడు.

పాలు పోయించుకుని తలుపులు మూసేసింది జలజ. అలా చేస్తూంటే ఆమె పమిట జారిపోయింది.

ఆమె వదనంలో ఎటువంటి తొట్రుపాటూ కనిపించక పోయేసరికి, ఆమె ధైర్యానికి, గుండె నిబ్బరానికి విస్తు పోయాడతను.

పమిట సరిచేసుకొంటూ వోరగా అతని వంక చూపిం దామె.

పాల గిన్నె క్రింద పెట్టబోతూ ఆగి, అడిగింది అతన్ని—"కాఫీ త్రాగాలనిపించడం లేదూ నీకు?" అంటూ.

ఆమె రూపం, చూపులు పిచ్చెక్కిస్తూంటే అతని మదిలో కొత్త ఆలోచనలు రేగుతున్నాయి.

"కాఫీ కంటె యెక్కువే త్రాగా లనిపిస్తోంది నాకు" అన్నాడు.

విస్మయంతో చూసిందామె.

"నిన్ను చంపేముందు నీ అధరామృతం త్రాగాలని వుంది" అన్నాడు మళ్ళీ.

"అయితే పైత్యం తల కెక్కినట్టే!" అందామె కిల కిలా నవ్వుతూ.

"కమాన్!" అన్నా డతను అడుగు ముందుకు వేస్తూ.

"ఆగు! వొంటిమీద చేయివేస్తే వొంటికి మంచిది కాదు" అందామె.

"ఎవరి వొంటికి?"

"ఇద్దరి వొంటికీను!"

కోపంగా చూసా డతను.

"నువ్వు కాదన్నావంటే నా పట్టుదల ఎక్కువవు తోంది....మళ్ళీ మాట్లాడితే నీ అందాన్ని కూడా అనుభ విస్తాను" అన్నాడు.

మందహాసం చేసిందామె.

"తనను చంపబోయేవాడికి ఏ స్త్రీ గాని తన తనువు అప్పగిస్తుందని ఎలా అనుకున్నావ్?" అంది.

"బలవంతంగా అనుభవిస్తాను!"

"గొప్ప మగాడివే!...."

అదే సమయంలో—

ఎవరో తలుపు కొట్టారు.

"మళ్ళీ ఎవడు తగులడ్డాడు?" విసుగ్గా అన్నాడు వెంక ట్రావు ఆగిపోయి.

నవ్వింది జలజ.

"దేవుడు!" అంది.

తలుపులు దబ దబ బాదా రెవరో.

"మళ్ళీ ఎవ డొచ్చాడో?"

"నీళ్ళమనిషయి వుంటుంది."

"ఇందాక పాలమనిషి అన్నావు. ఇప్పుడు నీళ్ళమనిషి అంటున్నావు. వేళాకోళ మాడుతున్నావా....?" గద్దించా డతను.

"నేను నిజమే చెబుతున్నాను. బహుశా నగరంలోని నీటి ఎద్దడిని గురించి నీకు తెలియదేమో! నీళ్ళు తీసుకు రావడానికి డబ్బిచ్చి మనిషిని పెట్టుకున్నాం ఈ వీధిలోని వాళ్ళందరమూ" అందామె.

ఆమె పలుకులకు సందిగ్ధంలో పడిపోయా డతను.

"అనుమానంగా వుంటే—పోనీ, నువ్వే వెళ్ళి తెరు తలుపులు" అందామె మందహాసంతో.

ఒకసారి ఆమెవంక తీక్షణంగా చూసి, వెళ్ళి గడియ తీసాడు వెంకట్రావు.

తలుపులు భళ్ళున తెరుచుకున్నాయి.

గుమ్మంలో ప్రత్యక్షమైన వ్యక్తుల్ని చూసి ప్రక్కలో బాంబు ప్రేలినట్టు అదిరిపడ్డాడు వెంకట్రావ్.

"హ్యాండ్సప్! కత్తి క్రింద పడేసి చేతులు పైకెత్తు!" గర్జించాడు పోలీస్ ఇన్స్పెక్టర్.

ఇన్స్పెక్టర్ చేతిలో పిస్టల్ చూడగానే వెంకట్రావు చేతిలోని కత్తి అప్రయత్నంగా నేలకు జారిపోయింది. చేతులు పైకెత్తా డతను.

ఇన్స్పెక్టరూ, అతని వెనుకే యిద్దరు కానిస్టేబిల్సూ యింట్లో జొరబడ్డారు.

క్రింద పడిన కత్తిని స్వాధీనపరచుకొని అతని చేతులకు బేడీలు వేసారు పోలీసులు.

"థాంక్స్, ఇన్‌స్పెక్టగారూ! సమయానికి దేవుడిలా వచ్చి నన్ను రక్షించారు" అంటూ ఇన్‌స్పెక్టర్‌కి ఎదురు వెళ్ళి నమస్కరించింది జలజ.

"కంట్రోల్ రూం నుంచి మెసేజ్ అందగానే బయలుదేరినా యిల్లు కనుక్కోవడంలో కొద్దిగా జాప్యం జరిగింది" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

"వీడెవడో పాత కేడీలా వున్నాడు?"

"ఇతను పాత కేడీయే. ఆర్నెల్ల క్రితం లజ్‌లో నా గోల్డ్ చెయిన్ దొంగిలించి పట్టుబడ్డాడు. నా మూలంగా ఆర్నెల్లు శిక్ష పడిందట. ఈ మధ్యే విడుదలయి వచ్చినట్లున్నాడు. నన్ను చంపి తన పగ తీర్చుకోవాలనుకున్నాడుట" చెప్పుకుపోయింది జలజ.

"ఇలియట్స్ బీచ్ నుండి నన్ను వెంబడిస్తున్నాడు. ఇతనిదగ్గర కత్తి చూడడంతో భయంవేసి పబ్లిక్ బూత్ నుండి కంట్రోల్‌రూమ్‌కి ఫోన్ చేశాను....ఇంటికి రాగానే నాతోబాటే యింట్లో చొరబడ్డా డితను. రాగానే నా మెళ్లోని చంద్రహారం లాక్కుని మీరు వచ్చేటప్పటికి నా మానం అపహరించడానికి సయితం సిద్ధపడ్డాడు...."

"అబద్ధం!" అరిచాడు వెంకట్రావు. "ఈవిడ దగ్గర ఏ హారమూ తీసుకోలేదు నేను."

"ఇన్‌స్పెక్టర్‌గారూ! ఇతని జేబులు వెదికితే నిజం వెల్లడవుతుంది" అని ఆమె అనడంతో, ఇన్‌స్పెక్టర్ అతని జేబులు సోదాచేశాడు.

వెంకట్రావు మహాలక్ష్మి గుడిదగ్గర దొంగలించిన చంద్రహారం బయటపడింది.

"అదే నా హారం! చూసారా, మీ కళ్ళే కప్పాలను కున్నాడు!" అందామె.

ఇన్‌స్పెక్టర్ చేతిలోంచి హారాన్ని అందుకొని మెడలో పెట్టుకుంది.

నిశ్చేష్టుడయ్యాడు వెంకట్రావు.

ఆమె ఎంతకైనా తగిన ఆడది!

మరోసారి తనను బోల్తా కొట్టించింది!

చావు తప్పించుకున్నదే కాక తనను పోలీసులకు అప్ప గించింది. తనది కాని హారాన్ని సునాయాసంగా తన పరం చేసుకుంది!

ఏదో అనబోయాడతను.

"నోర్మూసుకుని పోలీస్‌స్టేషన్‌కి పద" అంటూ మెడ పైన చేయివేసి గెంటుకు పోయారు పోలీసులు.

"రేపు వుదయం ఓసారి పోలీస్‌స్టేషన్‌కి వచ్చి స్టేట్‌మెంట్ యిచ్చి వెళ్ళమ్మా" అన్నాడు ఇన్‌స్పెక్టర్ జలజతో.

"అలాగే సార్! సమయానికి వచ్చి నా మాన, ప్రాణాలు కాపాడారు. మీ కెంతో రుణపడి వున్నాను" అంది జలజ ఇన్‌స్పెక్టర్‌కి నమస్కరిస్తూ.

పోలీసుల వెంట వెళుతూ తల త్రిప్పి, కసిగా వుక్రోషంగా ఆమెవంక చూసాడు వెంకట్రావు.

మందహాసం చేసిందామె.

'మహాలక్ష్మి గుడిదగ్గర నువ్వు హారం కొట్టెయ్యడం నేను చూసానులే!' అన్న భావం వుంది ఆ నవ్వులో.

ఆమె కన్నులలో కవ్వింపు వుంది.

నిస్సహాయంగా నిట్టూర్చి, యేదో గొణుక్కుంటూ పోలీస్ జీప్ ఎక్కాడు అతను. ▫

రక్తాభిషేకం

ఎమ్.వి.వి. సత్యనారాయణ

నగరానికి ఒకప్రక్కగా లంకంత ఓ భవనం. రాత్రి పది గంట లయినా యింకా భవనంలో దీపాలు వెలుగు తోన్నాయి.

"అమ్మా! రెడీయేనా!" అరిచాడు పదేళ్ళ కిషోర్.

"ఆఁ!" అంది వరలక్ష్మి బెడ్ క్రింద దూరబోతూ.

కిషోర్ పరుగెత్తుకు వచ్చి ఆమెను తాకనే తాకాడు.

నరసింగరావు చప్పట్లు కొట్టి, "మీ అమ్మ పేషంటురా. దాగుడుమూతలు ఆమెతో ఏం ఆడతావు? నాతో ఆడు" అన్నాడు.

వరలక్ష్మి మూతి తిప్పి "మీకు షుగర్ లేదా?" అంది.

"షుగర్....బలే...." కిషోర్ గెంతులు వేశాడు.

"ఒరేయ్ అల్లరి! క్రింది వాటాలో వాళ్ళు నిద్ర పోతున్నారు" అంది వరలక్ష్మి.

"వాళ్ళెవరమ్మా—కొత్తవాళ్ళు" అన్నాడు కిషోర్.

"మంచివాళ్ళేరా! నువు చూడలేదు కానీ....ఇద్దరూ భార్యాభర్తలు. లాడ్జిలో దిగాలంటే భయం వేసిందట. ఒక్క రాత్రికి! మన యిల్లు యేమీ కరగిపోదు" అంది వరలక్ష్మి.

"పిల్లలున్నారా అమ్మా?"

"ఆఁ! నీ వయసువున్న పిల్లలు యిద్దరూ. నీ కంటె పెద్ద అమ్మాయి....మొత్తం ముగ్గురు."

"వాళ్ళను నాకు పరిచయం చెయ్యి"

"అలాగే లేరా!" తల్లి కిషోర్ చెక్కిళ్ళు చిదిమింది.

"డాడీ దాక్కోండి. వచ్చేస్తాను" అన్నాడు కిషోర్.

నరసింగరావు హుషారు తెచ్చుకొని బెడ్ దిగాడు. వరలక్ష్మి భర్తనూ, బయటికి నడవబోతోన్న కొడుకునూ మురిపెంగా చూస్తోంది.

కిషోర్ క్షణంలో వరండా దాటి అవతలి గదిలో దాక్కున్నాడు.

నరసింగరావు మార్గం వెతుక్కుంటున్నాడు. మెట్లమీద

చప్పు డయింది.

"వరం! చూడు, ఎవరో!" అన్నాడు నరసింగరావు ఇనుప బీరువా వెనక్కి చేరుకుంటూ.

వరలక్ష్మి గుమ్మంలోకి నడిచింది. నారాయణరావూ అతడి భార్యా మెట్లు ఎక్కి చివర మెట్టుమీద ఆగారు.

"మీరా, రండి! కొత్తచోటు కదా! నిద్రపట్టడంలేదా?" అంది వరలక్ష్మి.

నారాయణరావు యిబ్బందిగా మొహం పెట్టాడు. అతడి భార్య కోమలి దూకుడుగా వరలక్ష్మిని సమీపించింది.

వరలక్ష్మి చటుక్కున వెనక్కి అడుగువేయబోయింది. అప్పటికే ఆలస్యమైపోయింది. కోమలి పమిట చాటునుండి విసురుగా చెయ్యి తీసింది. చేతిలో కత్తి మిల మిల లాడింది.

'కెవ్వు'మంది వరలక్ష్మి.

అదే సమయానికి, "డాడీ! రెడీయా!" అంటున్నాడు కిషోర్.

నరసింగరావు బీరువా చాటునుండి యివతలికి వచ్చాడు. "వరం ఏమయింది?" అన్నాడు.

వరలక్ష్మి పొట్ట చేత్తో పట్టుకుని ముందుకు వాలుతోంది. బాధగా మూలుగుతోంది. అంత బాధలో కూడా ఆమె కేక పెట్టింది.

"ఏమండీ! పారిపోండి! చంపేస్తున్నారు!"

నరసింగరావు ఒక్క వుదుటున ముందుకుపరుగెత్తాడు. జరుగుతోన్నదేమిటో అతడికి అంతుపట్టలేదు. భార్యను సమీపించాడు. నారాయణరావు గుమ్మం చాటునుండి ముందుకు దూకాడు. నరసింగరావును వెనుకవాటుగా చేతులు విరచి పట్టుకున్నాడు.

కోమలి, వరలక్ష్మి పొట్టలోంచి కత్తిని బయటకు లాగింది. నరసింగరావు కళ్ళు ఆశ్చర్యంతో పెద్దవయాయి. భార్య ముందుకు కూలబడింది. నరసింగరావు బలంగా కాళ్ళతో నేలను తన్నాడు. గాలిలోకి కాళ్లు ఎత్తబోయాడు.

కోమలి కత్తితో దాడి చేసింది. చేతికందినచోట్ల పొడుస్తోంది. నరసింగరావు అరవలేకపోయాడు. నరాలు తోడుకుపోతున్నాయి.

"కి.... షో.... ర్.... పారిపో...." నరసంగరావు వెనక్కి వాలిపోయాడు.

"చూడు....అటుప్రక్క....వాడు కుర్రాడు వుంటాడు" అరచింది కోమలి.

నారాయణరావు అటు పరుగెత్తాడు. గదులు ఒక్కొక్కటే వెతుక్కుంటున్నాడు. వరండా చివరగా బోగన్ విలియాపొదలు అల్లుకుని వుంది. క్రింద నుండి పెరిగిన మొక్క. కిషోర్ ఎక్కడా కనిపించలేదు.

నారాయణరావు పిచ్చిగా వెనక్కి తిరిగి మళ్ళీ గదులు వెతుక్కుంటూ రాసాగాడు.

2

గబ్బర్ కిళ్ళీకొట్టు నీడలో ఆగాడు. సాంబ అతడి దగ్గరలో నిలబడి సిగరెట్ ముట్టించుకున్నాడు. గబ్బర్ ఆకుపచ్చటి చొక్కా జేబులోంచి గుడాకు తీసి కసిగా నమలసాగాడు.

"మనం తప్పించుకున్నట్టు యింకా పోలీసులకు తెలియదు" అన్నాడు గబ్బర్.

"తెలిస్తే మన గొప్పతనం ఏమిటి బాస్?"

గబ్బర్ మందహాసం చేశాడు. ఆకుపచ్చరంగుతో గార పట్టిన పళ్ళు కదులుతున్నాయి.

"మనం మన స్థావరానికి వెళ్ళిపోవాలి" అన్నాడు గబ్బర్.

"వాహనం ఎత్తుకురానా?"

"వూఁ!"

సాంబ తలమీద ముసుగు వేసుకున్నాడు. రోడ్డుమీదకు వచ్చాడు. పార్కింగ్ ప్లేస్‌లో స్కూటర్లు ఆగివున్నాయి. వాటికి అవతల ప్రక్కగా అప్పుడే రాయల్ ఎన్‌ఫీల్డు వచ్చి ఆగి వుంది. దాన్ని తోలుకు వచ్చిన వ్యక్తి స్టాండ్ వేయ బోతున్నాడు. సాంబ అతడి మీద దాడి చేశాడు. చేతితో అతడి నోరు నొక్కిపట్టి మెడనరం అదిమాడు. అతడికి క్షణంలో స్పృహ తప్పింది. అతడిని ప్రక్కకు యీడ్చి గోడకు చేరగిల పెట్టాడు.

గుడాకును యింకా కసిగానే నములుతూ గబ్బర్ ఎన్ ఫీల్డుని అధిరోహించాడు. గబ్బర్ భారీ శరీరం ఎన్‌ఫీల్డు మీద హుందాగా వుంది. సాంబ వెనక సీటుమీద కూర్చు న్నాడు.

ఎన్‌ఫీల్డు సగర్వంగా రోడ్డుమీద వురికింది.

తూర్పు తెల్లవారుతోంది. ఎన్‌ఫీల్డు నగరం పొలిమేరలు దాటుతోంది. న్యూస్‌పేపర్ తీసుకువెళ్ళే వ్యాన్‌ని దాటింది ఎన్‌ఫీల్డు. గాలి రివ్వున చెవులకు కొడుతోంది.

"మన గురించి పోలీసులు ఏమనుకుంటున్నారో! బాస్, పేపర్ తీసుకుందామా!" అన్నాడు సాంబ.

"సాంబా! నీకు బుర్ర చెడిపోయింది. న్యూస్‌పేపర్ వాడు మనమార్గం గురించి పోలీసులకు చెబుతాడు" అన్నాడు గబ్బర్.

"పేపర్ కావాలి బాస్, ఎలా?"

"ప్రక్క గ్రామంలో ఆపుతాను. కొట్లో వాడు పేపర్

యివ్వగానే కొని తెచ్చుకో!"

వ్యాన్‌కి దూరంగా వెళ్ళిపోయింది ఎన్ ఫీల్డు.

ప్రక్క గ్రామంలో చాటుగా ఆపి కూర్చున్నారు. మొదటి కిళ్ళీకొట్టువద్ద న్యూస్‌పేపర్ వ్యాన్ ఆగింది. కిళ్ళీ కొట్టు వ్యక్తిని లేపి వ్యాన్ డ్రయివర్ పేపర్లు లెక్కపెట్టి యిచ్చాడు.

సాంబ ఒకపేపర్ కొనితెచ్చాడు.

అప్పటికి పూర్తిగా తెల్లవారి పోయింది.

పతాక శీర్షిక చదువుతూనే తెల్లబోయాడు సాంబ.

నగరంలో దారుణ హత్యాకాండ: గబ్బర్ పలాయనం!

విశాఖపట్నం: ఏప్రిలు 18.

స్థానిక న్యాయవాదీ, సంఘసేవాకర్త అయిన నరసింగ రావు (35)నూ ఆయన భార్య వరలక్ష్మి (33)నీ రాత్రి ఎవరో దుండగులు దారుణంగా హత్య చేశారు. ఇంట్లో వున్న బీరువా పగలగొట్టి హంతకులు విలువయిన నగలూ, రొక్కమూ ఎత్తుకుపోయారు.

16 వ తేదీ రాత్రి రాజమండ్రి సెంట్రల్ జెయిలు నుండి గబ్బర్‌సింగ్, అతడి అనుచరుడు సాంబ తప్పించుకు పారి పోయారు.

నరసింగరావు దంపతుల దారుణ హత్యల వెనుక గబ్బర్‌సింగ్ హస్తం వున్నట్టు నేరపరిశోధనశాఖ సందేహ పడుతోంది. నరసింగరావు దంపతులకు ఒకే ఒక్క కొడుకు వున్నాడు. అతడి జాడ తెలియరావడం లేదు.

నగరంలో అమిత సంచలనం కలిగించిన యీ హత్యా కాండ గురించి రేపటి ఎడిషన్‌లో సచిత్ర వ్యాసం అందించ గలం—

సాంబ చదవడం ఆపి పళ్ళు పట పట లాడించాడు.

"బాస్! మనం విడుదల అయినట్టు పోలీసు వర్గాలు ప్రకటించాయి" అన్నాడు సాంబ.

గబ్బర్ గారపళ్ళు యికిలించి, "విడుదల కావడం ఏమిటిరా సాంబా! తప్పించుకోవడం! వార్త ఏమిటో చదువు. అది చదివాకే నువు కోపంగా పళ్ళు నూరావు" అన్నాడు.

"మనం నిన్నరాత్రి నరసింగరావు అనే లాయర్‌నూ, అతడి భార్యనూ హత్య చేశామట! నగలూ డబ్బూ ఎత్తుకు పోయామట!"

"వూహుం. ఎవడా నరసింగరావు? ఏమా కథ?"

సాంబ తెలుగులో వున్న వార్త చదివి గబ్బర్‌కి హిందీతో వివరించి చెప్పాడు.

"అయితే యిప్పుడు మనమీద రెండు హత్యలు చేసి నట్లు నేరారోపణ వున్నదన్న మాట! వెరీగుడ్!"

"ఏం గుడ్డు బాస్? ఇప్పటికే మనం డిటెక్టివ్ శిరీష్ గాడివల్ల ఒక కేసులో యిరుక్కుని సెంట్రల్ జెయిలు కూడు తిన్నాం. తరువాత లాయర్ సౌజన్య పట్టుకుని పావురాల కేసులో యిరికించింది."

"తప్పు మాట్లాడక. పావురాలే దిక్కు కేసు."

"ఏదో ఒకటి, వాటిలో మనం నేరస్తులమే. ఒప్పు కుంటాను. కాని ఇప్పుడు ఏమీ నేరం చేయని పరిస్థితు లలో కూడా మనలను నేరస్తులుగా చేయడంలో అర్థం లేదు."

"అవును. అసలు యీ పుకారు ఎలా పుట్టి వుంటుంది?"

"పోలీసు వర్గాలే పుట్టిస్తాయి. ఇంక ఎవరికి అవసరం?"

గబ్బర్ నుదురు చిట్లించాడు "పోలీసు వర్గాలు మన మీద పుకారు లేపవు. మనని పట్టుకోవడం కష్టం. అందు వల్ల నరసింగరావు దంపతుల హత్య విషయంలో ఎవరో సులువుగా దొరికే ప్రొఫెషనల్ హంతకులను విచారణ చేస్తారు. మనమీద నేరం నెట్టి పోలీసులు తమకు సులభ సాధ్యమైన పద్ధతిని వదులుకోరు."

"అంటే ఈ పుకారు పత్రికలవాళ్ళు సృష్టించారా?"

"కాదు. నరసింగరావు దంపతులను హత్య చేసిన వాళ్ళే యీ పుకారును కూడా లేపి వుంటారు."

సాంబ చేతిలోని వార్తాపత్రిక నలిగిపోయింది.

"సాంబా! హంతకులు ఎవరో కూడా నాకు తెలుసు."

"ఎవరు బాస్?"

"మనకి నీతిబోధ చేయడానికి 'శాంతిదూతల ఆశ్రమం' నుండి ఒకడు వచ్చేవాడు. వాడే మనకి ఒక రోజు కన్ను కొట్టాడు. మీవంటి "షోలే" ప్రతినాయకుడు యిలాంటి కటకటాల వెనుక వుండటం ఏం బాగుంటుంది? అన్నాడు. గుర్తుందా?"

"అవును. నారాయణరావ్."

"తరువాత వాడే నాకు లోహపు రంపం అందించాడు"

"నిజమా బాస్?"

"చువ్వలను కోయడానికి నావద్ద రంపం ఎక్కడిదను కున్నావు?"

"రంపం యిచ్చి ఎంతకాల మయింది?"

"పదిహేను రోజులు."

"మరి యింతకాలమూ ఏం చేస్తున్నారు?"

"నారాయణరావు పోలీసుల ఏజెంటు అని అనుమాన పడ్డాను."

"అయితే రంపం ఎలా యిస్తాడు బాస్?"

గబ్బర్ వ్యంగ్యంగా నవ్వాడు.

"పోలీసుల చమత్కారం అదే! మనం తప్పించుకునే వీలు కల్పిస్తారు. జెయిలు గోడ దాటకుండానే పిట్టలను కాల్చినట్టు కాల్చి చంపుతారు."

"అలా ఎందుకు చంపుతారు బాస్?"

"మనం యింకా సుప్రీంకోర్టు యివ్వబోయే తీర్పుకు ఎదురు చూస్తున్నాం. మనకు ఎటూ మరణశిక్ష పడుతుంది. అయితే ఏ నాలుగయిదేళ్ళకో సుప్రీంకోర్టు నోరు విప్పి ఆ మాట చెబుతుంది. అంతవరకూ మనని కాపాడుకో లేక యీరకంగా చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకున్నా తీసుకుంటారు పోలీసులు."

సాంబ అర్థమయిందన్నట్టుగా తలాడించాడు.

మనం జెయిలు నుండి తప్పించుకునే అవకాశంకోసమే నారాయణరావు ఎదురు చూచి వుంటాడు. మనం మొన్న రాత్రి తప్పించుకున్నాం, నిన్న వైజాగ్‌లో గడిపాం. నారాయణరావు మనని వెంబడించి వచ్చివుంటాడు. వైజాగ్‌లో హత్యలు చేసి డబ్బు దోచుకుని నేరం మన మీదకు నెట్టాడు."

"డాంగ్ రాస్కెల్! ఎంత పని చేశాడు?"

"నాలాంటి బందిపోటుతోనే వాడు చెలగాటమాడు తున్నాడు! ఇక మామూలు మనుషులను వాడు పావుల లాగా తిప్పుకుంటాడన్నమాటే కదా!"

"పైగా శాంతి దూతల ఆశ్రమం!"

గబ్బర్ మోటార్‌సైకిలును వెనక్కి త్రిప్పి స్టార్టు చేశాడు.

"ఎక్కడికి బాస్?" అన్నాడు సాంబ.

"నారాయణరావు దగ్గరకు."

"ఎక్కడ వుంటాడని?"

"నిశ్చింతగా యింట్లోనే వుంటాడు. రా, కూర్చో" అరిచాడు గబ్బర్.

3

"అయ్యగారూ! ఆకలి!" చేతులు చాపాడు కుర్రవాడు.

నారాయణరావు వాడి వంక చీదరగా చూశాడు. మసి బారిపోయిన మొహం, సంస్కారం లేని జుత్తూ, మాసిన చొక్కా, నిక్కరూ, దుమ్ముకొట్టుకు పోయిన వాడి కాళ్లు ...

"ఎవడవురా నువ్వు!" అడిగాడు నారాయణరావు.

"దిక్కు లేనివాడిని బాబయ్యా! నాకు ఎవరూ లేరు!" అన్నాడు కుర్రవాడు.

"నీ యాస చూస్తే నువ్వు యిక్కడివాడివి కానట్టు తెలుస్తోంది. ఏ వూరు మీది?"

"విశాఖపట్నం జిల్లా బాబుగారూ!"

నారాయణరావు నుదురు చిట్లించాడు. "మా యింటికే ఎందుకు వచ్చావు?" అన్నాడు.

"లంకంత యిల్లు బాబుగారూ! క్రొత్తగా కట్టించారు. మీ పిల్లలకూ మీకూ పని కుర్రవాడు అవసరం వుంటుందని వచ్చాను బాబుగారూ!"

"నీ పేరు?"

"కిట్టయ్య అంటారండి."

నారాయణరావు తలూపి, "లోపలకి వెళ్ళు అమ్మగారుంటారు" అన్నాడు.

కిట్టయ్య సంబరపడ్డాడు ఇంట్లోకి నడిచాడు.

నారాయణరావు భార్య కోమలి అతడికి ఇంట్లోనే ఒక

చిన్న గది కేటాయించింది. తన పిల్లలవి చిరిగిపోయిన బట్టలు యిచ్చి కట్టుకోమంది. వాడికి రోజంతా యింటి చాకిరీతో సరిపోయేది.

నారాయణరావుకు యిద్దరు కొడుకులూ ఒక కూతురూ వున్నారు. వాళ్ళు కిట్టయ్యను వేధించుకు తినేవాళ్ళు. వాళ్ళకు కావలసినవి అందించడంలో కిట్టయ్యకు వూపిరి సలిపేది కాదు.

కిట్టయ్య ఆ యింట్లో చేరిన రెండో రాత్రే ఒక విచిత్రం జరిగింది. కిట్టయ్య తన ఒంటరితనానికి దిగులుపడి తోటలో ఏడుస్తూ కూర్చున్నాడు. మొక్కల మధ్య నుండి ఎవరో అతడి మీద దూకి నోరు నొక్కారు. కిట్టయ్యను ఎత్తుకుని చీకట్లోంచి నడిచాడు.

రోడ్డుమీద కారు ఆగి వుంది.

కిట్టయ్యను కారులో కుదేశాడు అతడు. కారులో స్టీరింగ్‌వీల్ దగ్గర లావుపాటి వ్యక్తి కూర్చుండి వున్నాడు. కారులో చిన్న దీపం వెలుగుతోంది. లావుపాటి వ్యక్తి ఒంటిన ఆకుపచ్చరంగు చొక్కా వుంది.

"సాంబా!" అన్నాడు ఆకుపచ్చరంగు చొక్కా వేసుకున్న వ్యక్తి.

"బాస్! వీడు నాకు తోటలో దొరికాడు" అన్నాడు సాంబ.

తరువాత కిట్టయ్య పక్కనే కూర్చుంటూ, "పోనివ్వండి బాస్!" అన్నాడు.

కారు కదిలింది.

సాంబ వెనక్కి వాలి రిలాక్సయాడు. కిట్టయ్య నోరు మీద నుండి తన చెయ్యి తప్పించాడు.

పబ్లిక్ టెలిఫోన్‌బూత్ కనిపించగానే కారు ఆపాడు

గబ్బర్‌సింగ్. సాంబ కారు దిగాడు. పబ్లిక్ టెలిఫోన్ బూత్ వైపు కదిలాడు.

"నారాయణరావుకు ఫోన్ చేశాను. వాడి కొడుకును ఎత్తుకుపోతున్నట్టుగా" అన్నాడు తిరిగి వచ్చి.

"సార్! క్షమించండి. నేను నారాయణరావు కొడుకును కాదు" అరిచాడు కిట్టయ్య.

గబ్బర్, సాంబా మొహాలు చూసుకున్నారు.

"ఏంరా, నాటకం ఆడుతున్నావా?" కిట్టయ్య జుత్తుపట్టుకున్నాడు సాంబ.

"నిజం సార్! వాళ్ళ యింట్లో పనిచేసే కుర్రవాడిని."

గబ్బర్ పల్చగా పెరిగిన గడ్డం తడుముకున్నాడు. చటుక్కున కిట్టయ్య మీదపడి జేబులు తడిమాడు. జేబులోంచి పర్సు బయట పడింది. గబ్బర్ పర్సు తెరచి చూశాడు.

పర్సు అరలో ఫోటో కనిపించింది. భార్యాభర్తా ఇద్దరి మధ్య కిట్టయ్య వున్నాడు.

గబ్బర్ గడ్డం తడుముకుంటూ, "నువు నరసింహారావు కొడుకువి. మీ నాన్ననూ, మీ అమ్మనూ నారాయణరావు హత్యచేశాడు. నువు నారాయణరావు యింటి పనికి చేరావు" అంటూ చటుక్కున గుడాకు నోట్లో వేసుకున్నాడు. మెల్లగా నములుతూ "ఎందుకు చేరావ్‌రా బచ్చా?" అన్నాడు.

కిట్టయ్య చటుక్కున పర్సు లాక్కున్నాడు. అతడి మొహంలో విపరీతమయిన తెగింపూ, కరడుకట్టిన కక్షా చోటుచేసుకున్నాయి. గొంతులో ఒక రకమైన పెద్దతనపు హుందా చోటు చేసుకుంది.

"మీ రెవరు?" అన్నాడు కిట్టయ్య.

గబ్బర్ కళ్ళలో ఎర్రటి జీర కదిలింది. చెయ్యెత్తబోయాడు. సాంబ అతడి చేతిమీద మెల్లగా చరచి "అరే!

బిచ్చా! ఆ రోజు రాత్రి అంటే....ఏప్రెల్ 16 నాటి రాత్రి ఏం జరిగిందో చెప్పరా!" అన్నాడు.

కిట్టయ్యకు ఉడుకుబోతుతనం వచ్చింది. "మీరు పోలీసులా?" అన్నాడు.

"కాదు ఈయన గబ్బర్‌సింగ్! షోలే సినిమాలో చూడలేదా? ఇతడి మీదనే ప్రత్యక్షంగా సినిమా తీశారు" అన్నాడు సాంబ.

కిట్టయ్య కళ్ళు పెద్దవి చేసి "అయితే చెబుతాను వినండి. నా అసలు పేరు కిషోర్. ఏప్రెల్ 16 నాటి రాత్రి మా అమ్మా నాన్నలతో దాగుడుమూత లాడుతున్నాను. ఒక గదిలో నేను దాక్కున్నాను. మా అమ్మ ఎవరితోనో మాట్లాడింది. కింద వాటాలో ఆ రాత్రి నారాయణరావూ, అతడి భార్యా వున్నారు" అన్నాడు.

సాంబ కలగచేసుకున్నాడు. "నారాయణరావూ, అతడి భార్యా మీ యింటికి ఎందుకు వచ్చారు?" అన్నాడు.

"వాళ్ళు ఏదో వూరు వెళ్ళాలని విశాఖపట్నం వచ్చారు. తమ దగ్గర డబ్బు ఉన్నదని, లాడ్జిలో దిగాలంటే భయంగా వున్నదనీ చెప్పారు. మా అమ్మ వాళ్ళను ఆ రాత్రి ఇంట్లో వుండటానికి ఒప్పుకుంది."

"వూఁ....చెప్పు. మీ అమ్మ వాళ్ళతో మాట్లాడుతోంది. నువ్వు వేరే గదిలో దాక్కున్నావు. తర్వాత?"

"మా అమ్మ బాధగా 'కెవ్వున' అరచింది. నేను గుమ్మం దగ్గరకు వచ్చి చూశాను. కోమలి కత్తి ఎత్తింది. కత్తిమీద నుండి రక్తం బొట్లు బొట్లుగా కారుతోంది. మా అమ్మ ముందుకు కూలబడిపోయింది. నాకు కాళ్ళు గడగడలాడాయి.

మా అమ్మను చంపింది కోమలి. తరువాత మా నాన్నను

చంపారు. మా అమ్మా, నాన్న వాళ్ళ చేతుల్లోంచి తప్పుకో లేక పోయారు. ఇక నే నెంత? నేను వరండా చివరకు పరుగెత్తాను. బోగన్ విలియా తీగలు పట్టుకుని క్రిందకి దిగి పోయాను.

నారాయణరావు నా కోసం గదులు వెతికినట్టున్నాడు. నేను భయంగా ఇంటికి దూరంగా కాచుక్కూర్చున్నాను. ఏడుపు ముంచుకు వస్తోంది. గంట తర్వాత నారాయణరావూ, అతడి పెళ్ళామూ యింట్లోంచి బయటపడ్డారు.

నారాయణరావు పబ్లిక్ టెలిఫోన్ బూత్‌లోకి వెళ్ళి ఎవరికో ఫోన్ చేసి వచ్చాడు.

'జెయిలులోంచి పారిపోయి మంచి పనే చేశారు. వాళ్ళే మర్డర్స్ చేసినట్టు చెప్పాను' అన్నాడు నారాయణరావు, కోమలితో.

నాకు వాళ్ళు ఎవరి గురించి మాట్లాడుకుంటున్నారో అర్థం కాలేదు. తరువాత వాళ్ళు రోడ్డు ప్రక్కనే ఆగివున్న కారు వద్దకు వెళ్ళారు. ఆ కారు వాళ్ళదే అని నాకు తర్వాత తెలిసింది. నేను చప్పుడు చేయకుండా డిక్కీలో ప్రవేశించాను. కారు ఆ రాత్రికి రాత్రే చాలా దూరం ప్రయాణం చేసింది. ఒక పెంకుటింటి ముందు కారు ఆపాడు నారాయణ రావు. ఆ ఊరు రాజమండ్రే! మర్నాడు తిరిగి తిరిగి ప్రస్తుతం వున్న యిల్లు కొన్నాడు నారాయణరావు. నారాయణరావును బతిమాలి యింట్లో పనివాడిగా చేరాను" అన్నాడు కిట్టయ్యగా నటిస్తోన్న కిషోర్.

గబ్బర్ సాలోచనగా చూశాడు. "అంటే నువ్వు నారాయణరావు దంపతుల మీద పగ తీర్చుకుంటా వన్నమాట" అన్నాడు.

కిషోర్ మాట్లాడలేదు. కొంతసేపు తర్వాత ఏడుపు దిగ మ్రింగుకున్నాడు. అయినా అతడి కళ్ళలోంచి నీళ్ళు కారుతున్నాయి. గబ్బర్ అతడి భుజం తట్టాడు.

"ఆల్ రైట్! నేను నీకు సాయపడతాను. నువు నాకు సాయం చెయ్యి."

"నేనా! ఎలా సార్?"

"చెబుతాను. మీ నాన్నగారిని, అమ్మగారిని హత్య చేసి ఆ నేరం నా మీదకు నెట్టారు నారాయణరావు దంపతులు. వాళ్ళు ఆ నేరం చేసినట్టు చెప్పించాలి. దాన్ని మనం రికార్డు చేయాలి.

కిషోర్ తలూపాడు. "ఎలా చేయాలో చెప్పండి" అన్నాడు.

గబ్బర్‌సింగ్ పథకం విడమరచి చెప్పసాగాడు.

4

కిషోర్ బెడ్ లైట్ వెలుతురులో గది నాలుగు ప్రక్కలా చూశాడు. గదిలో రెండు బెడ్స్ వున్నాయి. వాటి మీద ముగ్గురు పిల్లలు నిద్రపోతున్నారు. ముగ్గురూ నారాయణ రావు పిల్లలు. ఇద్దరు కొడుకులూ, ఒక కూతురు. తలుపు లోపల నుండి మూసి బోల్ట్ పెట్టాడు కిషోర్.

కిషోర్ నైలాన్ త్రాటితో ముగ్గురికీ కాళ్ళూ, చేతులూ కట్టేశాడు. కిటికీ వద్ద టేప్ రికార్డర్ అమర్చి ప్లగ్‌ను స్విచ్ బోర్డుకి తగిలించాడు. మైకును కిటికీలోంచి అవతలికి జారబెట్టాడు.

కొద్ది నిమిషాలు ఆగాడు.

అవతల బెడ్‌రూంలోంచి మాటలు వినిపిస్తున్నాయి.

"పిల్లలు నిద్రపోయారా?" అడిగాడు నారాయణరావు.

"ఊ!" అంది కోమలి.

"కిట్టయ్యగాడు రాత్రి తోటలో వుండగా ఎవరో వచ్చి తీసుకువెళ్ళారు."

"నిన్న రాత్రా?"

"అవును. ఈ రోజు వాడు టేప్ రికార్డర్ తీసుకు వచ్చి యింట్లో పెట్టాడు."

"ఎందుకు?"

"అదే తెలుసుకోవాలి. కిట్టయ్య గదిలోకి వెళ్దాం పద!"

"వాడిని కూడా మర్డర్ చెయ్యాలా?"

"అవును. పూర్తి వివరాలు తెలుసుకున్న తర్వాత."

కోమలి బీరువా తెరచి కత్తి అందుకుని "పద!"అంది.

ఇద్దరూ కిట్టయ్య గదిలోకి వెళ్ళారు. గదిలో కిట్టయ్య లేడు. మంచం మీద చీటీ వుంది.

"హంతకుడా! హంతకీ!

మీ పిల్లల గదిలో వుంటాను అక్కడికి రండి!

—కిట్టయ్య (కిషోర్)!"

నారాయణరావూ, కోమలీ మొహాలు చూసుకున్నారు. హడావుడిగా పిల్లల గది వైపు వచ్చారు. గదికి లోపలి వైపు గడియ పెట్టి వుంది. కోమలి తలుపు బాదింది.

"బెడ్‌రూం కిటికీలోంచి చూడు" అంది భర్తతో.

నారాయణరావు తన బెడ్‌రూంలోంచి కిటికీ వైపు వచ్చాడు. గదిలోకి చూచి తారెత్తిపోయాడు. బెడ్పై మీద పిల్లలు ఏడుస్తున్నారు. పిల్లలను కత్తితో గుచ్చి ఆనందిస్తున్నాడు కిట్టయ్య. పిల్లల కాళ్ళూ, చేతులు కట్టి పడేసి వున్నాయి.

"కిట్టయ్యా! ఒరేయ్!" అరిచాడు నారాయణరావు.

కోమలి యింకా తలుపు బాదుతోంది.

"కిట్టయ్య కాదురా, కిషోర్!"

"కిషోర్! నీకు పుణ్యం వుంటుంది. పిల్లలను ఏమీ చేయక!"

"నీ పెళ్ళాన్ని కూడా నీ ప్రక్కకు రమ్మను."

కోమలిని తన వద్దకు రమ్మని పిలిచాడు నారాయణరావు.

కోమలి గదిలోని దృశ్యం చూచి గుండెలు బాదుకుంది. పిల్లలు పెడబొబ్బలు పెడుతున్నారు.

"నాన్నగారూ, మమ్మల్ని రక్షించండి!" అంటున్నారు నారాయణరావు సంతానం.

"మా అమ్మ, మా నాన్నగారినీ మీ అమ్మా, నాన్నా కలపి చంపారు. మిమ్మల్ని మీ అమ్మా, నాన్నల ఎదుట అలాగే పొడిచి పొడిచి చంపుతాను!" అన్నాడు కిషోర్.

పిల్లలు భయంతో గోలచేయడం మరచిపోయారు.

"చూస్తావేం? పోలీసులకు ఫోన్ చెయ్యి" అరచింది కోమలి.

నారాయణరావు సందేహిస్తూ నిలబడిపోయాడు.

"నీ మొగుడికి తెలుసు. కదిలితే యిక్కడ పిల్లలు చచ్చిపోతారని." కిషోర్ టేప్ రికార్డర్‌లో రికార్డ్ అన్న మీట నొక్కాడు.

"మా నాన్నను ఎందుకు చంపారో, ఎలా చంపారో ఒక్కరొక్కరూ వివరంగా చెప్పండి. మీ పేర్లతో సహా!" అన్నాడు కిషోర్.

నారాయణరావు దంపతులు తాత్సారం చేశారు.

కిషోర్ పిల్లలను కత్తితో మరల గాయపరచాడు.

నారాయణరావుకు గొంతు పెగలింది.

౯

సూపరెన్టెంట్ ఆఫ్ పోలీస్ పేర పాకెట్ వచ్చింది. పాకెట్ తెచ్చిన వ్యక్తిని ఎస్.పి. అడిగాడు—

"ఎవరిచ్చారు ఈ పాకెట్!" అని.

"గబ్బర్‌సింగ్ - సాంబ!"

ఎస్ పి. ఉలిక్కిపడ్డాడు పాకెట్ విప్పాడు. టేప్ రికార్డర్‌లో అమర్చుకునే కాసెట్ అది!

"తమరిని ఈ కాసెట్ వినమని చెప్పాడు గబ్బర్!" అన్నాడు ఆ వ్యక్తి.

"నువ్వెవరు?" అన్నాడు ఎస్.పి.

"దారినపోయే దానయ్యను. నా చేతిలో పది రూపాయలు పెట్టి ఈ ఉపకారం చేయమని కోరాడు గబ్బర్."

ఎస్ పి. తర్వాత కాసెట్టు పెట్టుకుని విన్నాడు. మరల వింటున్నాడు. అతడి నుదురు ముడతలు పడింది.

"అంతా నిజమే చెప్పాను. నన్నూ, నా పిల్లలనూ విడిచిపెట్టు" అంటోంది కోమలి.

తర్వాత తలుపు తెరచిన చప్పు డయింది.

"అబ్బా!" అంది నారాయణరావు గొంతు.

కోమలి కెవ్వున అరచింది. ఎవడో ఆమెమీదకు దూకిన చప్పుడయింది.

"కిషోర్! నన్ను వదలిపెట్టు" ఏడుస్తోంది కోమలి. మరుక్షణంలో ఆమె ఏడుపు గొంతులోనే ఆగిపోయింది. బంతి కిందపడినట్టు చప్పుడయింది.

పిల్లలు కాబోలు భయంకరంగా అరుస్తోన్న కేకలు.

కాసెట్ బీభత్సంగా వుంది. పిల్లల కేకలు ఆగిపోయాయి. స్పృహతప్పిపోయి వుంటారు.

చివర గబ్బర్ మాటలు రికార్డయాయి.

"ఎస్.పి. గారూ! పసివాని పగ చూశారా! అతడి చేతులతో తన తలిదండ్రులను హత్య చేసిన వాళ్ళకు శిక్షలు వేశాడు. చూడాలని ఉంటే 140వ నెంబర్ ఇంటికి రండి. ఆర్యాపురం చివర. బీడీ ఫ్యాక్టరీ వీధి. మా పని ముగిసింది. మా స్థావరానికి వెళ్ళిపోతున్నాం."

గబ్బర్ మాటలు ముగిశాయి. కాసెట్ ఆగిపోయింది.

ఎస్.పి. తన సిబ్బందితో 140వ నెంబర్ యిల్లు చేరుకున్నాడు. గదిలో నారాయణరావూ, కోమలి పడివున్నారు. నారాయణరావు శరీరం తూట్లు పడి వుంది. కోమలి శిరస్సు శరీరం నుండి వేరుపడి వుంది.

అదే సమయానికి విశాఖపట్నంలో తమ ఇంట్లో ప్రవేశించాడు కిషోర్. పర్సు తెరచి గోడకి వారగిలపెట్టాడు.

ఫోటోలో నరసింగరావూ, వరలక్ష్మి నవ్వుతున్నారు.

సంచి దింపుకుని రెండు సీసాలు తీసి వాటిలోంచి రక్తం తీసి ఫోటోల ముందు కుమ్మరించాడు. మోకాళ్ళ వేసి కూర్చున్నాడు. కిటికీవద్ద ఎవరో కదిలారు.

కిషోర్‌కి ఎవరో తెలుసుకోవాలన్న స్పృహ లేదు.

కిటికీ వద్ద నిలబడిన యిద్దరికీ కళ్ళు తడిశాయి.

"బాస్!"

"అవును సాంబా! పసివాడికి సహకరించాం. మన జీవితాలలో మొట్టమొదటి మంచి పని యిదే!"

"అవును బాస్!"

కిటికీ వద్ద నుండి ఇద్దరూ కదిలారు. లోపలకు వెళ్లారు. కిషోర్ తదేకంగా ఫోటోలోకి చూస్తున్నాడు. □

బందిపోట్లు

కాశీభట్ల భానుమూర్తి

"దేశంలో ఎక్కడ ఏ పేపర్లో చూసినా హత్యలు, ఆత్మ హత్యలు, దోపిడీలు, మానభంగాలు గురించిన వార్తలే వుంటాయి. కాని మనకి కేసులు మాత్రం అంతగా రావటం లేదు" అన్నాడు పరిశోధనరావు దిగులుగా.

"నేరాలు ఎలా ఎక్కువవుతున్నాయో, డిటెక్టివ్‌లు, పోలీసులు, కూడా అలా ఎక్కువగానే ఉంటున్నారు కనుక మన దగ్గరకి ఎక్కువగా ఎవరూ రావటం లేదు సార్!" అన్నాడు ఓంకారం బాధగా.

"ఈ రోజుల్లో దేనికయినా పబ్లిసిటీ అవసరం. పబ్లి

పిటీ వుంటే తుప్పుపట్టిపోయిన గుండుసూదినయినా తుపాకి గుండని చెప్పి అమ్మేయవచ్చు. అందుకే మన ఏజన్సీ పేరు మీద నాలుగైదు పత్రికలకి పబ్లిసిటీ ఇద్దామంటే విన్నారు కాదు!" అన్నాడు శ్రీకారం నిష్ఠూరంగా.

ఇంతలో తలుపు చప్పుడయింది. పరిశోధనరావు సీట్లో సర్దుకొని కూర్చొని పాత ఫైలు తిరగేయసాగాడు. ఓంకారం టైపు మిషన్ ముందు కూర్చొని టకటకలాడించసాగాడు. శ్రీకారం లేచివెళ్ళి తలుపు తీసాడు. ఎదురుగా ఇద్దరు వ్యక్తులు కనిపించారు తలుపు తీసిన శ్రీకారానికి.

"రండి! సార్. నా పేరు శ్రీకారం." అన్నాడు శ్రీకారం గొప్పగా.

"ఓ! మిస్టర్ శ్రీకారం. మిమ్మల్ని కలవటం మాకు నిజంగా ఆనందం" అన్నాడు ఆ వచ్చిన వ్యక్తుల్లో ఒకతను.

"రండి, మా బాసుని పరిచయం చేస్తా" అని వారిద్దరిని పరిశోధనరావు దగ్గరికి తీసుకెళ్ళాడు శ్రీకారం.

పరిశోధనరావుని చూస్తూనే ఆ వచ్చిన వ్యక్తుల్లో ఒకరు "ఓ మీరే పరిశోధనరావుగారు గదా! మిమ్మల్ని కలుసుకొందామనే ఇంత దూరం వచ్చాం. చెప్పటం మరిచా నా పేరు వాసు. ఇదిగో ఇతని పేరు శేషు. మేము ప్రయివేట్ డిటెక్టివ్‌లము" అని ఆనందంగా చెప్పాడు వాసు.

వెంటనే ఆ గది సందడితో నిండిపోయింది. పరిచయాలు, స్వదబ్బాలు, పరదబ్బాలు, పరస్పర డబ్బాలు వాయించుకోవటం అయిపోయింది. టిఫిన్‌లు, కాఫీలు ముగించారు.

"ఓ కేసు విషయంగా వైజాగ్ వెళ్తొస్తున్నాం. మధ్యలో మిమ్మల్ని కూడా కలుసుకొని మళ్ళీ మా ఊరు వెళ్ళి

పోదామని వచ్చాము.” అన్నాడు వాసు.

దూరంగా శేషు, ఓంకారం మాట్లాడుకోసాగారు.

“మంచి పని చేసారు. మనం ఒకళ్ళ కొకళ్ళం కలుసు కొని కష్ట సుఖాలు విచారించుకోవాలి. ఆ! ఎలా వుంది మీ ప్రాక్టిస్” అన్నాడు పరిశోధనరావు సిగరెట్టు ముట్టించి.

“ఆ! ఏదో వుంది. మొన్న ‘ఆపదలో అబల’ కేసులో మా చేతి చమురే వదిలింది” అన్నాడు వాసు దిగులుగా.

“కొన్ని కొన్ని అలాంటి కేసులు తప్పవు మనకి. ఇక్కడ మా ప్రాక్టీసు గూడ అంతంతమాత్రమే. అయినా ఈ వృత్తిలో దిగాక తప్పదు గదా” అన్నాడు పరిశోధన రావు.

దూరంగా మాట్లాడుకొంటున్న ఓంకారం శేషుతో “సార్! ఎన్నన్నా చెప్పండి. మీరు వాసుగారి దగ్గర అసి స్టెంటుగా ఉండటం ఏమీ బాగా లేదు. ఇద్దరి పేరుతో సంస్థ ప్రారంభించి మిమ్మల్ని వెనక్కి నొక్కేసారు ఆ వాసు గారు. ఇది అన్యాయం. నాకు ఇక్కడ అలాంటి అన్యా యమే జరిగింది. అందుకే మన అసిస్టెంట్లమందరం ఒక సంఘం పెడదాము. నేను, శ్రీకారం, మీరు, జాన్‌గారు, ఇలా కొంతమందిని కలుపుకొని, నియంతృత్వంగా మనల్ని పాలిస్తున్న మన బాసుల తీటలు, తాటలు వలుద్దాం. మీకు సమ్మతమేనా?” అంటున్నాడు ఓంకారం.

“ఏమిటి, అప్పుడే మా శేషు, మీ ఓంకారం ఫ్రెండ్సై అయిపోయినట్టున్నారే” అన్నాడు వాసు ఆనందంగా పరి శోధనరావుతో.

“నా బొంద! అదేమీ కాదు. మా ఓంకారంగాడు నా మీద ఏవో అభాండాలు చెబుతున్నాడు” అన్నాడు పరి శోధనరావు.

"అయితే మళ్ళీ కలుసుకొందాము మనము. మీ రెప్పు డయినా మా ఊరు రండి" అని పరిశోధనరావుని ఆహ్వా నించి, "శేషు" అని పిలిచాడు వాసు.

"మా బాసు పిలుస్తున్నారు. మీరెప్పుడయినా మా ఊరు రండి. అక్కడ మన సంఘం గురించి మాట్లాడు కొందాం" అని ఓంకారంకి చెప్పి. శ్రీకారం దగ్గర శలవు తీసుకొని వాసుతోపాటు బయటికి నడిచాడు శేషు.

వాసు! శేషు బయటికి వెళ్ళగానే కోపంతో "ఓం కారం, ఏమిటి ఆ శేషుతో మంతనాలు" అన్నాడు పరి శోధనరావు.

"ఏమీ లేదు సార్! ఆ శేషుగారు అన్నారు మా వాసు గారు దైవస్వరూపులు. నన్ను బాగా చూసుకొంటారు అన్నారు. అప్పుడు నేను, మా పరిశోధనరావుగారు సాక్షాత్తు దేవులే, వారి అండన పని చేయటం నా బ్రతుక్కి ఒక గొప్ప వరం అన్నా సార్!" అన్నాడు ఓంకారం.

"అలా అయితే ఫరవాలేదు. పిచ్చి పిచ్చిగా వాగా వేమో అనుకొన్నా: అది సరేగాని వాళ్ళిద్దరు వచ్చేసరికి ఒక్క కేసన్నా వుంటే బావుండేది. అది పరిశోధిస్తూ వారి ముందు గొప్పగా వుండేవాళ్ళం" అన్నాడు పరిశోధనరావు దిగులుగా.

"ఆ! మీరేం దిగులుపడకండి సార్! మీకే కాదు! ఆ వాసుగారికి కూడా కేసుల్లేవు గదా! అందుకే మన తణుకు వచ్చారు. అసలు ఈ డిటెక్టివ్ వృత్తే ఇంతసార్, నెలకి ఓ కేసన్నా రాదు" అని సీరియస్‌గా అపరాధపరిశోధన చదువుకోసాగాడు ఓంకారం.

అపరాధ పరిశోధన పుస్తకం చూడగానే శ్రీకారానికి ఒక ఆలోచన వచ్చింది. "సార్! మనం ప్రకటన ఒకటి

అపరాధ పరిశోధనలో వేయిస్తే" అన్నాడు ఆనందంగా తలుపువేసి వస్తూ.

"ఎలా వేయిస్తే బావుంటుంది?" అన్నాడు ఓంకారం చదవటం ఆపి. పరిశోధనరావు కుతూహలంగా వింటున్నాడు

"అపరాధ పరిశోధన చదివే పాఠకుల్లారా, మీకుగాని, మీకు తెలిసినవారికిగాని ఏవిధమైన బాధలు వచ్చినా అంటే దొంగతనం, హత్యలు, మొదలగునవి అన్నమాట. వెంటనే సంప్రదించండి_పరిశోధనరావు డిటెక్టివ్ ఏజన్సీని, ఫీజు తక్కువ, ఫలితం ఎక్కువ. మా ఎడ్రసు పాత బస్టాండ్, తణుకు అని ఇచ్చి మీ ఫోటో కూడా ఇద్దాం. ఎలా వుంటుంది" అన్నాడు శ్రీకారం సంబరంగా.

"నన్నడిగితే మన ముగ్గురి ఫోటోలు వేయిస్తే బావుంటుంది" అన్నాడు సీరియస్‌గా ఓంకారం పరిశోధనరావుతో.

"ఇంకా నయం తణుకులో వున్న వాళ్ళందరి ఫోటోలు వేయిద్దామనలేదు" అని. శ్రీకారంతో "నువ్వు చెప్పింది బాగానే వుంది, నా ఫోటో వేయించి, నువ్వు చెప్పిన ప్రకటననే కొద్దిగా మార్చి వ్రాయిద్దాం. ఆ సంగతి తరువాత ఆలోచిద్దాం. నేను బయటికి వెళ్ళొస్తా" అని పరిశోధనరావు బయటికి నడవబోతుంటే తలుపు చప్పుడయింది. వెంటనే వెనక్కి వచ్చి సీట్లో సర్దుకొని కూర్చొన్నాడు పరిశోధనరావు.

ఓంకారం అపరాధపరిశోధన పుస్తకం దాచేసి టైపు మిషన్ ముందు కూర్చొని టక టకలాడించసాగాడు.

శ్రీకారం వెళ్ళి తలుపు తీసి ఒక మనిషిని వెంటబెట్టుకొచ్చాడు.

అతనికి సుమారు పాతికేళ్ళుంటాయి. వస్తూనే పరి

శోధనరావుకి, ఓంకారానికి విష్ చేసి పరిశోధనరావు ఎదు రుగా వున్న సీట్లో కూర్చొన్నాడు.

పరిశోధనరావు మందహాసం చేసి, "ఆ! ఎవరు మీరు? మావల్ల మీకేం సహాయం కావాలి?" అన్నాడు.

శ్రీకారం కలం, కాగితం తీసుకొని రెడీగా నిలుచు న్నాడు.

"నా పేరు రవిసార్! నేను ఒక విషయంలో మీ సహాయం కోరి వచ్చాను" అన్నాడు రవి గదంతా పరిశీ లనగా చూస్తూ.

"చెప్పండి. ఏ విషయంలో మీకు మా సహాయం కావాలి? భయపడకండి" అన్నాడు పరిశోధనరావు గంభీరంగా.

"మీ రొక దొంగతనం చేయాలి" అన్నాడు రవి బెదురుగా.

ఆ మాటతో డిటెక్టివ్‌లు ముగ్గురూ అదిరిపడ్డారు.

"మిస్టర్! రవీ! మేం మీ కంటికి దొంగల్లా కనబడు తున్నామా?" అని అరిచాడు ఓంకారం.

"దొంగతనమేనా, హత్య కూడా ఏదయినా చేయాలా మిస్టర్ రవీ!" అన్నాడు తీవ్రంగా శ్రీకారం.

"మిస్టర్ రవీ! నాకు పిచ్చికోపం రాకముందే మీరి క్కడి నుంచి నిష్క్రమించండి లేదా నేనేం చేస్తానో నాకు తెలియదు. గో" అని గొంతు చించుకొని అరిచాడు పరిశోధనరావు.

వీళ్ళ ముగ్గురి అరుపులూ విని రవి తడబడ్డాడు తన మాటల్లో పొరపాటు గ్రహించి, సరిదిద్దుకొనే ఉద్దేశంతో "అది కాదు సార్! మీరు నేను చెప్పేది వినండి, నేను అరుణ ప్రేమించుకొన్నాం" అన్నాడు రవి. దాంతో

ముగ్గురూ చల్లబడ్డారు.

"ప్రేమించండి, మేం ఏం కాదనం" అన్నాడు ఓంకారం.

"అది కాదు సార్! మీరు పూర్తిగా వినటం లేదు. నాకు అరుణని ప్రేమించటం ఇష్టం లేదు" అన్నాడు రవి మళ్ళీ.

"మానేయండి, మేం కాదనం" అన్నాడు శ్రీకారం.

"ఇందులో మేం ఏం చేయాలి? మీ మధ్య అగాధాలు సృష్టించాలా?" అన్నాడు పరిశోధనరావు తీవ్రంగా చూస్తూ.

"అబ్బబ్బ! మీరు పూర్తిగా వినిపించుకోరేం! అరుణా, నేను ఒకే కాలేజీలో చదువుతున్నాం. నేను అరుణ ప్రేమించుకొన్నాం. కాని మా మామయ్య కూతురు సరళని నేను పెళ్ళి చేసుకొంటేగాని అటువైపు ఆస్థి, ఇటువైపు ఆస్థి నాకు రాదు" అన్నాడు రవి.

"అరి నీ అసాధ్యం గూలా. మరి అరుణని ఎందుకు ప్రేమించావు?" అని సందేహంగా అడిగాడు ఓంకారం.

"అది మా బీట్స్ అసోసియేషన్‌వాళ్ళ ప్రోద్బలం మీద ప్రేమించాను. నా తప్పేం లేదు" అన్నాడు రవి.

"బీట్స్ అసోసియేషనా." అన్నాడు శ్రీకారం.

"అవును. మా కేంద్ర కార్యాలయం ఆంజనేయస్వామి గుడి దగ్గర వుంది. అంటే హెడ్డాఫీసన్న మాట. ఇక బ్రాంచీలూ, సీలిమా బుక్ సెంటర్ దగ్గర, పెద్ద పోస్టాఫీసు సందు దగ్గర, సజ్జాపురం దగ్గర వున్నాయి" అన్నాడు రవి వివరంగా.

"మీ కార్యక్రమా లేమిటి?" అన్నాడు పరిశోధనరావు.

"ఏముంది, అందమైన కలర్‌కి బీట్ వేయటమే"

అన్నాడు రవి.

"కలరేమిటి? బీటేమిటి!" చిరాగ్గా అడిగాడు పరిశోధన రావు.

"కలర్లంటే ఆడపిల్లలు సార్, బీట్ అంటే ప్రేమకి నిర్వచనం. ఈ సంగతి కూడా తెలియదా!" అన్నాడు ఓంకారం.

"అలా మా అసోసియేషన్లో అందరూ ఎవర్నో ఒకర్ని ప్రేమించాలి? నేను అరుణని ప్రేమించాను" అన్నాడు రవి.

శ్రీకారం తెల్లబోయి చూస్తూ నిలబడిపోయాడు.

"ఏం? అరుణకి ఆస్థి లేదా?" అన్నాడు ఓంకారం అనుమానంగా.

"ఎందుకు లేదు? వుంది ఆస్థి. వాళ్ళ నాన్న జగన్నాధ రావుగారు మీకు తెలిసే వుంటుంది. కాని నేను అరుణా పెళ్ళి చేసుకొంటే మా అమ్మా, సరళ ఇద్దరూ కలిపి పూరీ ఎక్స్ప్రెస్సు క్రింద తలపెట్టి మరీ చస్తామంటు న్నారు" అన్నారు రవి దిగులుగా.

"ఇంకేం సరళనే పెళ్ళి చేసుకో" అన్నాడు ఓంకారం.

"అరుణకి నేను రాసిన ప్రేమలేఖలు వున్నాయిగా. అవి చూపించి అరుణ నన్ను బెదిరిస్తోంది. తన్ని చేసుకో కుంటే నన్ను రాజమండ్రి సెంట్రలు జైలుకి పంపుతుం దట" అన్నాడు రవి.

"అంటే నీకు సరళకి పెళ్ళి జరిపించాలి. అయిమీన్. అరుణ దగ్గర వున్న ప్రేమలేఖలు నీకు తెచ్చి యివ్వాలి దొంగతనంగా. అంతేనా?" అన్నాడు పరిశోధనరావు గంభీరంగా.

"అవును సార్! ఇప్పటికి మీరు నన్ను అర్థం చేసు

కొన్నారు. ఆ ప్రేమ లేఖలు నాకు తెచ్చి ఇవ్వండి. మీరు కోరిన ఫీజిచ్చుకొంటాను" అన్నాడు రవి

"పదివేలు ఇవ్వ చాలు" అన్నాడు పరిశోధనరావు.

"పదివేలా! అఫ్టార్లు ప్రేమలేఖలు తెచ్చినందుకు" అన్నాడు రవి.

"మిస్టర్ రవి! మీకు చేతకాక మమ్మల్ని నియమించావు. కనుక మేం అడిగిన రేటు ఇచ్చుకోవాలి నువ్వు. అయినా యిందులో ఎంత రిస్కు వుంది. దొంగతనంగా అరుణా వాళ్ళ ఇంటిలో ప్రవేశించి, ఆ లేఖలు తస్కరించాలి కదా?"

"డబ్బు ఎప్పుడు ఇవ్వాలి?" అన్నాడు రవి కుర్చీలోంచి లేస్తూ.

"ఆలస్యం అమృతం విషం అన్నారు పెద్దలు. డబ్బు, అరుణ ఎడ్రస్ ఇచ్చేసి మీరు వెళ్ళి, ఈ రాత్రి సరిగ్గా ఒంటి గంటకి అరుణావాళ్ళ వీధిలో నుంచోండి, మీ ప్రేమలేఖలు మీకు అప్పగిస్తాం" అన్నాడు పరిశోధనరావు కాళ్ళు బారచాపి.

"సరే" అని జేబులోంచి డబ్బు, అరుణా వాళ్ళ ఎడ్రసు ఇచ్చి మరొక్కసారి చెప్పి బయటకి నడిచాడు రవి.

డబ్బు లెక్క పెట్టుకొని జేబులో పెట్టుకొని, ఎడ్రసు ఒక్కసారి చదివి జేబులో పెట్టుకొన్నాడు పరిశోధనరావు.

"అయితే మనమీ రాత్రి దొంగతనం చేయాలా?" అన్నాడు శ్రీకారం.

తలూపాడు పరిశోధనరావు ఆలోచిస్తూ.

"ఏమిటి డిటెక్టివ్‌లు దొంగతనము చేయటమా! పదు గురూ విన్న ఫక్కుమని నవ్వరా! వాసు అండ్ శేషులకి

తెలిపిన యేవగించుకోరా?" అన్నాడు ఓంకారం నాటక ఫక్కీలో.

"వసుదేవు డంతటివాడు గాడిద కాళ్ళు పట్టుకొన్నాడు. 'ఆపదలో అబల' కేసులో వాసు అండ్ శేషులు చిన్న పిల్లల్ని కిడ్నాపు చేసారు. అంతెందుకు-'శవాల్ని మాయం చేస్తాం' కేసులో మీరు శవాలని మాయం చేయలా! అందు కనే ఈ రాత్రి దొంగతనానికి సిద్ధంకండి. సరంజామా రెడీ చేయండి" అని బాత్రూమ్‌లోకి వెళ్ళిపోయాడు పరిశోధన రావు.

ఓంకారం. శ్రీకారం చక చక ఏర్పాట్లు చూడ సాగారు.

2

"ఇదే బాసూ! అరుణావాళ్ళ ఇల్లు" అన్నాడు శ్రీకారం.

"జగన్నాధరావు మంచి ధనవంతుడే" అన్నాడు ఓంకారం ఇంటిని చూస్తూ.

"ఈ ఇంటిని, ఈ ఇంటికి ప్లాను గీసినవాడిని మెచ్చుకో మని కాదు మిమ్మల్ని ఇక్కడికి తీసుకొని వచ్చింది. ఇప్పుడు టైము పన్నెండయింది. ఇంకొక గంటలో ఆ రవిగాడు ఇక్కడ వుంటాడు. మనం తొందరగా పని ముగించు కొని రావాలి. ఆలోచనలకి సమయం లేదు" అన్నాడు పరిశోధనరావు.

ఇంటి వెనకి వైపుకి చేరుకున్నారు ముగ్గురూ. ఆ ప్రదేశం అంతా నిర్మానుష్యంగా వుంది. చీకటిగా కూడా వుంది. ముగ్గురూ ఒకరి తరువాత ఒకరు నెమ్మదిగా పిట్ట గోడ ఎక్కి లోపలికి దూకారు శబ్దం కాకుండా.

అడుగులో అడుగేసుకొంటూ ఇంటి దగ్గరగా వచ్చారు.

గేటు దగ్గర గూర్కా మాత్రం అలా గోడకి చేరబడి నిద్ర పోతున్నాడు.

ముగ్గురూ ఒకరి తరువాత ఒకరు నీళ్ళపైపు సహాయంతో బాల్కనీలోకి ప్రవేశించారు. రవి చెప్పిన ప్రకారం బాల్కనీ కుడివైపు గదే అరుణది. ముగ్గురూ కదలి కుడివైపు గదిలోకి వెళ్ళారు.

ఆ గదిలో ఎవరూ లేరు. ఆనందంతో చకచకా వెతకటం మొదలుపెట్టారు. బీరువా, సూటుకేసులు, పుస్తకాల రాక్, డ్రస్సింగ్ టేబిల్ అన్నీ వెతికారు. ప్రేమలేఖలు కనబడలేదు. ఆఖరికి పరుపు క్రింద కనబడ్డాయి ఆ ప్రేమలేఖలు శ్రీకారానికి.

ఆనందంతో ముగ్గురి మొహాలూ వెలిగిపోయాయి.

"ఎలా కనుకొన్నావు. ఆడవాళ్ళు ప్రేమలేఖలు పరుపు క్రింద దాస్తారని" అన్నాడు పరిశోధనరావు.

"నేను మా కుసుమకి ఏ లెటర్ వ్రాసినా, అది సాధారణంగా పరుపుక్రిందే పెడుతుంది. అలా కనుక్కొన్నా" అన్నాడు శ్రీకారం.

"పెళ్ళయితే ఈ విధంగా కూడా ఉపయోగం ఉందన్న మాట" అన్నాడు ప్రశంసగా పరిశోధనరావు.

ఓంకారం మొహం చిన్నబోయింది. తనకి పెళ్ళవనందుకు. ముగ్గురూ బయటికి రాబోతుంటే ఓంకారానికి అనుమానం వచ్చింది. "ఇంట్లో యెవరూ లేరేమిటి చెప్మా?" అన్నాడు.

"చెప్మాలేదూ, ఉప్మాలేదు, సినిమాకి వెళ్ళుంటారు" అన్నాడు పరిశోధనరావు బాల్కనీలోంచి కిందకి దిగబోతూ.

"ఎవరూ లేకపోతే మరీ మంచిది. అలా వంటింట్లోకి వెళ్ళి యెవన్నా దొరికితే తినవచ్చు, ఆకలి దహించేస్తోంది"

అన్నాడు శ్రీకారం, "ఔ"నన్నాడు ఓంకారం.

పరిశోధనరావుకి కూడా ఆకలిగా వుండటంవల్ల ఇంకా రవి రావటానికి టైముండటం వల్లా వాళ్ళతో కలిసి నెమ్మదిగా అరుణా వాళ్ళ గదిలోంచి వంటింటి వైపు దిగసాగారు.

ఇంతలో "అదుగో" అన్న అరుపు వినిపించింది.

అదిరిపడి ముగ్గురూ మెట్లమీదే ఆగిపోయారు.

"ఇంకెవ్వరూ లేరని చెప్పావుగా జగన్నాధరావూ! అదిగో వాళ్ళెవరు?" అని హుంకరించి, "తెచ్చి వాళ్ళ ముగ్గుర్నీ కూడా కట్టేసి, పైన యింకా యెవరన్నా వున్నారేమో వెతకండిరా" అన్నాడు గబ్బర్‌సింగ్‌లా వున్నవాడు. వాళ్ళు పదిమంది వున్నారు.

డిటెక్టివ్‌లు ముగ్గురూ ఆశ్చర్యంగా చూస్తున్నారు. ఒక మూల జగన్నాధరావుని, అరుణని, జగన్నాధరావు భార్య సరస్వతమ్మని కట్టిపడేసారు.

జగన్నాధరావు వాళ్ళ ఫేమిలీకి కూడా ఆశ్చర్యంగా వుంది. "వీళ్ళెవరురా బాబూ! ఈ పదిమంది బందిపోట్లే అనుకొంటే, మరొక ముగ్గురు దొంగలు వచ్చారు" అని ఆలోచించసాగారు.

ఇంతలో డిటెక్టివ్‌లని కూడా కట్టేసారు దొంగలు.

"ఊఁ—ఇక చెప్పండి, ఎవరు మీరు? దొంగలా, పోలీసులా?" అని అరిచాడు దొంగల నాయకుడు రాందేవ్.

"పోలీసులం కాదు బాబూ, దొంగలమే. ఇల్లు చూసి, యిందులో సొమ్ము బాగా దొరుకుతుందని వచ్చాం,కాని మీ చేతికి దొరికాం. అయినా, మేం ముహూర్తం పెట్టుకొన్న నాడే మీరూ రావాలా! కాస్త ఆగి రావచ్చుగా" అన్నాడు పరిశోధనరావు.

"హుఁ! మేం యీ యింటికి కన్నం వేద్దామని పది రోజుల క్రిందటే అనుకొన్నాం. అట్టే వాగకండి, ఒరే వెతకండిరా యిల్లు, దొరికింది దొరికినట్టు పట్టుకొని రండి" అని తన అనుచరులకి ఆజ్ఞ చేసాడు రాందేవ్.

"ప్రతీచోటా పోటీ ఎక్కువయిపోతోందండి. వ్యాపారంలో పోటీ, రాజకీయాల్లో పోటీ, ఆఖరికి దొంగతనాల్లో కూడా పోటీయేనా!" అన్నాడు జనాంతికంగా ఓంకారం.

"అరె! చుప్! అట్టే వాగావంటే గేటు దగ్గర గూర్ఖాకి పట్టిన గతే నీకు పట్టగలదు" అన్నాడు తీవ్రంగా రాందేవ్.

"అంటే గేటు దగ్గర గూర్ఖా బతికిలేడన్న మాట, చచ్చాడా? ఓరి వీడి అసాధ్యం కూలా, వాడు బ్రతికున్నాడేమో అని మేము భయపడి, వెనకనుంచి చప్పుడు కాకుండా వచ్చాం" అన్నాడు శ్రీకారం.

జగన్నాధరావు ఫేమిలీ ఆశ్చర్యంగా, ఈ రెండు బంది పోటు ముఠాలకేసి చూడసాగారు.

"రవి యీ పాటికి వచ్చి, మనం రాలేదని వెళ్ళిపోయి వుంటాడు. ఎలా యిప్పుడు, రెండవస్తోంది" అన్నాడు పరిశోధనరావు.

ఇంతలో రాందేవ్ అనుచరులు రెండు సూటుకేసులు పట్టుకొచ్చారు. అందులో జగన్నాధరావు వాళ్ళ ఆస్థి అంతా నింపి వుంది. రాందేవ్ మొహం వికసించింది.

"ఆఁ ఇక అందరూ చేతులెత్తి నిలబడండి, నేను దొంగతనం చేసిన ఏ యింటిలోను జనాన్ని చంపకుండా వదిలిపెట్టింది లేదు" అని తుపాకీ తీశాడు రాందేవ్.

"రాందేవ్" అని జగన్నాధరావు వాళ్ళ ఫేమిలి, డిటెక్టివ్‌లు ముగ్గురూ ఒక్కసారే అరిచారు. వాళ్ళకి తెలుసు రాందేవ్ దోపిడీ చేసాక, ఆ యింట్లో యెవర్నీ

ప్రాణాలతో వుంచడని. ఇప్పటిదాకా దొంగతనానికి వచ్చింది ఏ సాధారణ ముఠానో అనుకొంటున్నారు. రాం దేవ్‌ని గూర్చి పేపర్లో వ్రాయటమే కాని, ఫోటో చూడక పోవటం వల్ల, ఒక్కసారే అందరికి భయం వేసింది యెదురుగా వున్నది రాందేవని తెలిసి.

"అవును రాందేవ్‌నే" అని తుపాకీ పేల్చబోతుంటే తలుపులు భళ్ళున తెరుచుకొన్నాయి. ఎదురుగా తుపాకీ పట్టు కొని శశికాంత్, ఆ తరువాత పోలీసులు వచ్చారు.

రాందేవ్, అనుచరులు, జగన్నాధరావు ఫేమిలీ, డిటె క్టివ్‌లు ముగ్గురూ పోలీసుల రాకకి ఆశ్చర్యంతో చూడ సాగారు. వాళ్ళకి సినిమాలో క్లైమాక్సు సన్నివేశం గుర్తు కొచ్చింది.

"మిష్టర్ రాందేవ్? మర్యాదగా లొంగిపో" అన్నాడు ఇన్‌స్పెక్టర్ శశికాంత్. తప్పని పరిస్థితుల్లో రాందేవ్ లొంగిపోయాడు. రాందేవ్‌కి, అతని అనుచరులకి బేడీలు వేసాడు ఎస్సై ముకుందరావు.

తెల్లబోయి చూస్తున్న పరిశోధనరావు బృందంతో, "ఆశ్చర్యపోకండి పరిశోధనరావుగారూ! మేం ఇదిగో యీ రవి ద్వారా జరిగింది తెలుసుకొన్నాం. మీరు లేఖలు తేవ టానికి వెళ్ళాక, ఒంటి గంటకి రవిని వీధి దగ్గరకి రమ్మన్నారట గదా. అలా వచ్చిన రవికి, మీ మాటలు, రాందేవ్ మాటలు వినిపించాయి గట్టిగా. వెంటనే భయం వేసి మాకు ఫోన్ చేసాడు. మేం వచ్చాం" అని వివరిం చాడు ఇన్‌స్పెక్టర్ శశికాంత్.

ప్రేమలేఖలు తీసి రవికి అందించాడు పరిశోధనరావు. జరిగింది విని అరుణ "సారీ! ఇదంతా నా మూలంగా జరి

గింది. నా పెళ్ళి సతీష్ కుమార్‌తో నిశ్చయమయిపోయింది. ఊరికే రవిని ఏడిపిస్తానికన్నాను" అంది పశ్చాత్తాపంగా.

"నీవు అలా అనటంవల్లే, ఈ నాడు బందిపోటు రాందేవ్ అనుచరులతో సహా మా చేతికి చిక్కాడు" అని అక్కడ వున్న అందరికీ కృతజ్ఞతలు చెప్పి రాందేవ్‌ని అతని అనుచరులను లాక్కెళ్ళాడు ఇన్‌స్పెక్టర్ శశికాంత్.

జగన్నాధరావు వాళ్ళ ఫేమిలీ డిటెక్టివ్‌లకి, రవికి కృతజ్ఞతలు చెప్పి, టిఫిన్, కాఫీ అరేంజు చేసారు. అసలే ఆకలిమీద వున్నవాళ్ళు అవటం మూలంగా డిటెక్టివ్‌లు తినటంలో పడిపోయారు. □

రైలు ప్రమాదం

చెరపకురా! చెడేవు!

కృష్ణచైతన్య

అప్పుడే మొదటి ఆట వదలి పెట్టారు. గురుమూర్తి, సుజాత హాల్లోంచి బయటకు వచ్చారు.

"సినిమా చాల బాగుంది కదూ?" అడిగాడు గురుమూర్తి.

"అవును. పక్కింటి పిన్నిగారు చెబితే ఏమో అను

కున్నా గాని, చాల బాగుంది" అంది సుజాత.

ఇద్దరూ కబుర్లు చెప్పుకుంటూ నెమ్మదిగా నడవడం మొదలు పెట్టారు.

"హోటల్‌లో భోంచేసి వెళదాం" అన్నాడు గురుమూర్తి హోటల్ వయిపు దారి తీస్తూ.

"ఎందుకు? వచ్చే ముందు వండే వచ్చాను!" అంది సుజాత వారిస్తూ.

"పోనిద్దూ! ఇప్పుడు వెళ్ళి తినబోతే చల్లగా ఉంటుంది. ఎందుకో ఈ రోజు నీతో కలసి హోటల్లో తినాలని పిస్తుంది!" అన్నాడు.

సుజాత భర్త కోరిక కాదనలేకపోయింది. ఇద్దరూ హోటల్లోకి వెళ్ళి 'ఫామిలీ రూం'లో కూర్చున్నారు.

గురుమూర్తి 'స్పెషల్ మీల్స్' ఆర్డరిచ్చాడు.

సర్వర్ ఒక స్వీటు, హాటు, అప్పడం, పూరీలతోపాటు ఘుమఘుమలాడే నెయ్యి భోజనంలోకి వడ్డించాడు.

ఇద్దరూ కబుర్లు చెప్పుకుంటూ తృప్తిగా భోంచేసి, బిల్లు చెల్లించి బైటకు వచ్చారు.

"ఇక్కడ నుంచి నేను నడవలేను బాబూ! రిక్షా పిలవండి!" అంది సుజాత రోడ్డు మీదకు రాగానే.

గురుమూర్తి తలూపాడు.

రిక్షా దిగి ఇద్దరూ ఇంటి వయిపు నడిచారు. గురుమూర్తి టైం చూసుకున్నాడు. పదకొండు గంటలు కావొస్తుంది.

గురుమూర్తి జేబులోంచి తాళం చెవులు తీస్తూ వరండాలో లైటు వెలిగించాడు. ఎదురుగా సుజాత పల్చటి పసుపు రంగు షిఫాన్ చీర, అదే రంగు బ్లౌజు, వదులుగా వేసిన జడ, జాలువారే మల్లెపూలు, కాళ్ళకు పట్టీలు.

"ఈ డ్రస్సులో అప్సరసలా ఉన్నావ్!" అన్నాడు

గురుమూర్తి భార్య వైపు తదేకంగా చూస్తూ.

బయట నిలబెట్టి భర్త తనవయిపు అలా చూస్తూంటే సుజాతకు సిగ్గేసింది. ఆమెకు తెల్సు. తను కాస్త ఎర్ర గానే ఉంటుంది. పెద్ద అందగత్తె కాకపోయినా, అనాకారి మాత్రం కాదని తెల్సు. తన వొంటి రంగుకు అలాంటి బట్టలు అందంగా ఉంటాయని తెల్సు. అయినా ఆ విషయం తన భర్త నోటి ద్వారా వినడం వల్ల ....అదీ వీధి వరం డలో. సిగ్గు ముంచుకొచ్చింది. చిన్నగా నవ్వుతూ తల వంచుకుంది.

గురుమూర్తి తలుపు తెరిచాడు. ఇద్దరూ లోపలి కెళ్ళ గానే తలుపులు మూసి భార్యను పొదివి పట్టుకున్నాడు.

"అబ్బ! వదలండీ!" సుతారంగా విడిపించుకొని పడక గదిలోకి దారితీసింది.

గురుమూర్తి తలుపు గడియపెట్టి పడక గదిలోకి వచ్చి బట్టలు మార్చుకొని, లుంగీ కట్టుకొని, సిగరెట్ వెలిగించి మంచం మీద కూర్చున్నాడు.

సుజాత ఏదో అనబోయింది.

తలుపు తట్టిన చప్పుడు విన్పించింది.

"ఎవరూ!" విసుగ్గా లేచి వెళ్ళి తలుపులు తెరిచాడు.

హఠాత్తుగా ఓ వ్యక్తి లోపలికి దూసుకొచ్చాడు. అతన్ని చూడగానే పెద్దగా అరవబోయిన గురుమూర్తి, అతని చేతిలో వున్న కత్తిని చూచి నోరు మూసుకున్నాడు.

"ష్! అరిస్తే ప్రాణాలు పోతాయి!" అన్నాడతను తలుపులు మూస్తూ.

పడక గదిలో మంచంమీద నుంచి ఇదంతా చూస్తున్న సుజాతకు భయంతో నోట మాట రాలేదు. అరిస్తే ఏమవు తుందో కూడ తెల్సు. అందుకే అరవలేదు.

"ఎవరున్నావ్? నీ కేం కావాలి?" నెమ్మదిగా ధైర్యం తెచ్చుకొని అడిగాడు గురుమూర్తి.

"చెబుతాను. ముందు లోపలికి నడువ్!" అన్నాడతను గురుమూర్తిని గదిలోకి నెడుతూ.

"పమ్మల్నేం చేయకు. నీ కేది కావాలంటే అది తీసుకొనిపో!" అన్నాడు గురుమూర్తి ప్రతిమలాడుతూ.

గదిలోకి వచ్చాక గురుమూర్తి జేబులోంచి డబ్బూ, టీపాయ్‌మీద వున్న వాచీ తీసి జేబులో వేసుకున్నా డతను.

"ఊఁ! నువ్వు కూడ. ఆ చెవి రింగులూ, మెడలో గొలుసూ తీసివ్వు!" అన్నాడు కర్కశంగా.

సుజాత మంచం మీదే చటుక్కున లేచి కూర్చొని మెడలో గొలుసూ, రింగులూ, చేతికున్న గాజులు తీసి యిచ్చింది.

ఆ వ్యక్తి వాటిని జేబులో వేసుకొని గదంతా పరీక్షగా చూశాడు. ఆ తర్వాత మంచం మీద కూర్చున్న సుజాత వయిపు చూశాడు.

అతని చూపులు చూడగానే సుజాతకు భయం వేసింది. నిస్సహాయంగా భర్త వైపు చూపింది.

ఆ వ్యక్తి గురుమూర్తి వైపు తిరిగి, "నువ్విలా రా!" అని ఒక మూలగా తీసుకెళ్ళి పక్కనే వున్న నైలాన్ తాడుతో గురుమూర్తిని పందిరిమంచం కోడుకు కట్టేశాడు.

"ప్లీజ్! మమ్మల్నేం చేయకు! కావాలంటే ఇంట్లో వున్న వస్తువులన్నీ తీసుకెళ్ళు!" ప్రాధేయపడ్డాడు గురుమూర్తి.

ఆ వ్యక్తి చిన్నగా నవ్వి, పక్కనే హాంగర్‌మీద వున్న కర్చీఫ్ అందుకొని గురుమూర్తి నోట్లో కుక్కి, "గోల చెయ్యకుండా వుంటేనే ప్రాణాలు దక్కుతాయి. ఇప్పటికే

నాలుగు హత్యలు చేసాను. మీలో ఎవరయినా గొడవచేస్తే చుట్టుపక్కల వాళ్ళు వచ్చేలోగా మీ యిద్దర్నీ చంపి పారిపోతాను జాగ్రత్త!" హెచ్చరించి మంచం వైపు నడిచాడు.

అప్పటికే భయంతో సుజాత వొళ్ళంతా చెమటలు పట్టింది.

"వొద్దు. నన్నేం చెయ్యొద్దు. నీకు పుణ్యం ఉంటుంది" అంది ఏడుస్తూ అతని ఉద్దేశ్యాన్ని గ్రహించి.

అతను నవ్వి, "అనవసరంగా గోల చేస్తే ప్రాణాలు పోతాయి" అన్నాడు ఆమెను బలవంతంగా ఆక్రమించుకుంటూ.

గురుమూర్తి ఆ దృశ్యాన్ని చూడలేక కళ్లు మూసుకున్నాడు బాధగా.

పావుగంట తర్వాత ఆ వ్యక్తి లేచి వెళ్ళిపోయాడు.

2

సుజాత కాఫీ గ్లాసుతో గదిలోకి వచ్చింది. కుర్చీలో కూర్చొని కిటికీ గుండా ఎటో శూన్యంలోకి చూస్తూన్న భర్తను చూడగానే మనస్సు చివుక్కుమంది.

నెమ్మదిగా దగ్గర కెళ్ళి "ఏవండీ, కాఫీ!" అంది నెమ్మదిగా.

"అక్కడ పెట్టు!" అన్నాడు గురుమూర్తి తల తిప్పకుండానే.

సుజాత చిన్నగా నిట్టూర్చి కాఫీ గ్లాసు టేబిలుమీ దుంచి వెళ్ళింది.

ఆమె లోపలికి వెళ్ళాక కాఫీ త్రాగి సిగరెట్ వెలిగించాడు గురుమూర్తి.

ఆ రోజు ఆ సంఘటన జరిగిన నాటి నుంచి గురుమూర్తిలో చాలా మార్పు వచ్చింది. ఎప్పుడూ ఏదో ఆలో

చీస్తున్నట్లుగా శూన్యంలోకి చూస్తూ దిగులుగా ఉంటాడు. మంచి బట్టలు వేసుకోవడం మానేశాడు. తప్పదు గనుక రోజూ ఆఫీసుకు మాత్రం వెళ్ళి వస్తాడు. గడ్డం మాసిపోయి విరాగిలా కన్పిస్తున్నాడు.

భర్త పరిస్థితి చూస్తూంటే సుజాతకు గుండె బరువెక్కుతుంది. ఎంతో చలాకీగా ఉండేవాడు, తను పలకరించక పోతే ఓ గంటకూడా ఉండలేనివాడు. ఇప్పటికి పది రోజులుగా ఒక్క మాట కూడా మాట్లాడలేదు.

ఇదే కాదు. ఆమెకు బాధ కలిగించే విషయాలు ఇంకా వున్నాయి. ఆ రోజు నుంచి భర్త పడక ముందు గదిలోకి మారిపోయింది. అంతేకాదు, కనీసం భోజనం కూడ తన చేతితో వడ్డించనివ్వడం లేదు.

మరో వారం రోజులు గడిచాయి. సుజాత ఇక తట్టుకోలేకపోయింది. ఆ రోజు రాత్రి భోజనం అయ్యాక భర్త మంచం దగ్గర కొచ్చి నిలబడింది.

గురుమూర్తి అటు వైపు తిరిగి పడుకొని ఉన్నాడు.

"ఏవండీ!" పిలిచింది.

"ఊఁ" అన్నాడు గురుమూర్తి తల తిప్పకుండానే.

"ఇలా తిరగండి మీతో మాట్లాడాలి!" అంది భర్త భుజం తట్టి తిప్పుతూ.

"ఏమిటి?" అన్నాడు తల తిప్పి.

"మీ రిలా వుంటే నాకు చాల బాధగా ఉంది. నేనేం తప్పుచేసానని నాతో యిలా ప్రవర్తిస్తున్నారు. అసలు ఆ రోజు జరిగిన ఘోరానికి నా ప్రమేయం ఏమైనా ఉందా? ప్లీజ్! జరిగింది మర్చిపొండి."

మాటల మధ్యలోనే గురుమూర్తి చటుక్కున లేచి కూర్చొని, "దయచేసి ఆ విషయా లేవీ నాకు గుర్తు

చెయ్యకు. నేను భరించలేను" అని క్షణం ఆగి "జరిగిందేదో జరిగింది. కాని ఎందుకో నాకు నిన్ను బొత్తిగా తాకాలనిపించలేదు" అన్నాడు విరక్తంగా.

సుజాత మొహం వివర్ణమయింది. మరుక్షణం పొర్లి వస్తున్న దుఃఖాన్ని ఆపుకుంటూ పడక గదిలోకి పరుగెత్తి కెళ్ళింది.

ఆ రాత్రి ఇద్దరూ నిద్ర పోలేదు.

నెల రోజులు గడిచాయి. ఈ నెల రోజుల్లో గురుమూర్తి పరిస్థితి మరింత దిగజారింది. బొత్తిగా ఇంటి పట్టున వుండడం లేదు. ఎక్కడెక్కడో తిరిగి ఎప్పుడో పది దాటాకి ఇంటికి వస్తాడు. అదీ హోటల్లో భోంచేసి.

ఇంట్లో ఆ ఇద్దరి మధ్య నెలకొన్న విచిత్ర పరిస్థితి సుజాతను మరింత కృంగదీసింది. భర్త పరిస్థితిచూస్తుంటే ఆమెకు రోజు రోజూ దిగులెక్కువౌతుంది. ఇక కొద్ది కాలం ఇలా గడిస్తే భర్త పిచ్చివాడై పోతాడేమో అన్పించింది ఆమెకు. ఈ నెల రోజులుగా భర్తను మామూలు మనిషిని చెయ్యాలని ఎన్నో విధాలుగా ప్రయత్నించింది. కాని అవేవీ ఫలించలేదు.

రెండు రోజులపాటు తీవ్రంగా ఆలోచించాక సుజాత ఓ నిర్ణయాని కొచ్చింది. తనిక్కడే వుంటే తనని చూస్తున్నంతకాలం భర్త మామూలు మనిషి కాలేడు. తనని చూపినప్పుడల్లా ఆ దారుణం గుర్తుకొచ్చి మరింత పిచ్చివాడయి పోతాడు. భర్తకేదయినా అయ్యాక, తను బ్రతికి వుండీ ప్రయోజనము లేదు. త నెలాగూ డిగ్రీ వరకు చదువుకుంది. తనకో చిన్న ఉద్యోగం దొరికితే తన బ్రతుకు తాను బ్రతగ్గలదు. కొంతకాలంపాటు తను ఆయనకు కన్పించకుండా వుంటే మామూలు మనిషి కావచ్చు.

అదృష్టం వుంటే ఎప్పుడో కల్సుకోవచ్చు.

ఆ నిర్ణయానికి రాగానే ఓ వుత్తరం వ్రాసి భర్త మంచం మీద వుంచి, సూట్‌కేసు అందుకొని బట్టలు సర్దుకోసాగింది. మధ్యలో ఓసారి భర్తవైపు చూచింది. ఎన్నో రోజులుగా నిద్ర లేమితో బాధపడినట్లు ఆదమర్చి నిద్రపోతున్నాడు గురుమూర్తి.

సుజాత చిన్నగా నిట్టూర్చి. తన బట్టలపెట్టె తెరిచి, అందులో వున్న డబ్బు సూట్‌కేసులో పెట్టుకుంది. అప్పుడు జ్ఞాపకం వచ్చింది తనకు పుట్టింటివాళ్ళు పెట్టిన కమ్మలు. అవి అదృష్టవశాత్తు భర్త బట్టల పెట్టెలో వుండబట్టి సరి పోయింది. లేకుంటే అవి కూడ పోయి వుండేవి. భర్త బట్టలపెట్టె తెరిచి బట్టలు పైకి తీసింది. అడుగున గొలుసు గాజులు, రింగులతోపాటు కమ్మలు కూడా వున్నాయి. కమ్మలు తీసుకొని, బట్టలు మళ్ళీ సర్దేసి. పెట్టె మూసి ఓ పదినిముషాలు ఆలోచిస్తూ కూర్చుంది.

ఆ తర్వాత ఓ నిర్ణయానికి వచ్చినట్లు సూట్‌కేసు అందు కొని తలుపులు తెరుచుకొని బైటకు నడిచింది.

3

"పాపం గురుమూర్తి భార్య పుట్టింటికని వెళ్ళి వాళ్ళ ఊళ్ళోనే ఆక్సిడెంటులో చనిపోయిందట." ఈ వార్త గురుమూర్తి ఆఫీసులో పెద్ద టాపిక్ అయిపోయింది.

అంతకు ముందు వారం రోజులు శెలవులో వెళ్ళి ఆ రాజే తిరిగొచ్చిన గురుమూర్తి అన్నీ పోగొట్టుకున్న వాడిలా దీనంగా కన్పించాడు అందరికి.

అతని నిర్లిప్తత చూస్తే పలకరించడానికి భయంవేసింది కొలీగ్స్‌కు.

సాయంత్రం అందరూ వెళ్ళిపోయాక బయలుదేరాడు

గురుమూర్తి.

ఆఫీసు నుంచి నేరుగా పార్కు కెళ్ళాడు పార్కులో ఓ మూలగా చీకటి పడేవరకు కూర్చున్నాడు. బాగా చీకటి పడ్డాక బయటకు వచ్చి ఆటో ఎక్కి అడ్రసు చెప్పాడు.

పావుగంట తర్వాత ఆటో ఆగింది. ఆటో దిగి ఫేర్ చెల్లించి, అది కనుమరుగయ్యేదాకా అక్కడే వుండి ఎదురుగా వున్న ఇంటివైపు నడిచాడు.

తలుపులు వేసి వున్నాయి. నెమ్మదిగా తట్టాడు. నిమిషం తర్వాత తలుపులు తెరుచుకున్నాయి. చటుక్కున లోపలికి వెళ్ళి తలుపులు మూశాడు.

"మీరా! ఎవ్వరూ చూడలేదు కదా?" అంది విమల భయంగా.

విమల గురుమూర్తి కోలిగ్.

గురుమూర్తి రెండు చేతులతో ఆమెను పొదివి పట్టుకొని పెద్దగా నవ్వసాగాడు. విమల ఒక్క నిముషం భయపడినా అంతలోనే విషయం అర్థం అయి తనూ నవ్వింది.

ఇద్దరూ పడక గదిలోకి నడిచారు.

గురుమూర్తి నవ్వటం ఆపి, "అబ్బ! యింత సులభంగా ఆ పీడ విరగడయిపోతుందని కలలో కూడ అనుకోలేదు. నువ్వు గనక ఈ పథకం చెప్పకుంటే దాన్ని అడ్డు తొలగించుకోడానికి హత్యచేసి, అనవసరంగా జైలుపాలయ్యేవాడిని. వెధవది! ఆ నాగరాజుకు కూలీ వెయ్యి రూపాయలు పోతే పోయాయి కాని, చాల సహజంగా నటించాడు."

విమల మధ్యలోనే అందుకుంది "మర్చిపోయా! వాడు ఆ నగలన్నీ తిరిగిచ్చాడా లేదా?" అడిగింది.

"ఇచ్చాడు దొంగవెధవ! ముందు ఇవ్వనన్నాడు. వాడ్ని

ముందు బెదిరించి, ఆ తర్వాత కిరాయికాక మరో రెండు వందలు ఎక్కువ ఇస్తానన్నాక తిరిగి ఇచ్చాడు" అన్నాడు గురుమూర్తి.

"నీ భార్య చనిపోయిందనే వార్త నాటకం కూడా బాగా రక్తి కట్టింది" అంది విమల.

"అవును. దీని కంతటికీ నీ అమోఘమైన ఆలోచన: ఆడదానివి కాబట్టి, ఆడదాన్ని ఎలా దెబ్బ కొట్టాలో తెలిసి బ్రహ్మాండమైన ఆలోచన ఇచ్చావ్ దాన్ని నా నటనతో మరింత రక్తి కట్టించాను. ఇక మన పెళ్ళికి ఎలాంటి ఆటంకం లేదు" అన్నాడు గురుమూర్తి విమలను కౌగ లించుకుంటూ.

విమల సుతారంగా విడిపించుకొని, "అప్పుడే తొందర పడకు. దానికీ ఓ పథకం వుంది. అది రక్తి కట్టేవరకు మన కసలు పరిచయం వున్నట్లు కాని, మనమిద్దరం కలిసి చదువుకున్నట్లుగానీ ఎవ్వరికీ తెలియనివ్వకు. ఓ ఇరవయి రోజులు ఓపిక పట్టు. ఎలాంటి ఇబ్బందీ లేకుండా మనిద్దరి పెళ్ళి జరిగే పూచీ నాది" అంది దృఢంగా.

గురుమూర్తి తల వూపి, నీ ఇష్టం ఎలా చెయ్యమంటే అలా చేస్తాను" అన్నాడు మంచి అబ్బాయిలా.

4

వారం రోజులు పోయాక, ఆఫీసులో అసలు టాపిక్ మొదలుపెట్టింది విమల.

"పాపం! గురుమూర్తిగార్ని చూస్తూవుంటే జాలేస్తుంది. నెల క్రితం వరకు యెంత చలాకీగా వుండేవాడు. అంతలోనే యెలా అయిపోయాడు? ఈ వయస్సుకే ఇంత వైరాగ్యమా? అసలీ వయస్సులో చాల మందికి పెళ్ళిళ్ళే కావు. హాయిగా మళ్ళీ పెళ్ళి చేసుకుంటే ఈ బాధలన్నీ

మర్చిపోవచ్చు!" కొలిగ్స్ ముందు యిలా మాట్లాడడం మొదలుపెట్టే సరికి, క్రమంగా అందరికీ అదే అభిప్రాయం ఏర్పడింది. అప్పటికే కొందరు పెద్దవాళ్ళు గురుమూర్తిని పెళ్ళి గురించి కదలేసారు. కాని గురుమూర్తి వాటినంతగా పట్టించుకోనట్లే నటించాడు.

మరో పది రోజులు పోయాక విమల ప్లేటు మార్చింది.

"పాపం! అతన్ని చూస్తుంటే మీకెవ్వరికి జాలి కలగడంలేదా? హాయిగా పెళ్ళి చేసుకొని సుఖంగా వుండ వలసిన ఈ వయస్సులో ఈ వైరాగ్యం ఏమిటి? ఈ వయస్సులో ఆడపిల్లలకే పెళ్ళిళ్ళవుతున్నాయి. మగవాడు అతని కేం? అతను సరేననాలేగాని నాలాంటివాళ్ళు వందల మంది క్యూలో నిలబడరూ!"

వెంటనే విమల స్నేహితురాలడిగింది. "నీలాంటి వాళ్ళు వందల మంది సంగతలా వుంచు. నువ్వు చేసు కుంటావా?' అని.

విమల కాస్త బిడియంగానే తల ఊపింది.

"ఈ వార్త నిమిషాల మీద ఆఫీసులో పాకిపోయింది.

కొందరు పెద్దలొచ్చి ముందు విమలను అడిగారు— విమల తలవూపి, "అసలాయన ఏమంటారో!" అంది సందేహిస్తున్నట్లు.

"వాడి బొంద! నాలుగు తన్నైనా ఒప్పించమూ!" అంటూ వెళ్ళినవాళ్ళు గురుమూర్తిని సతాయించేసరికి, అయిష్టంగానే ఒప్పుకున్నట్లు నటించాడు.

ఆ రోజే పెళ్ళిరోజు. ఇద్దరూ రిజిస్ట్రార్ ఆఫీసు నుంచి నేరుగా యింటికి వెళ్ళారు. సాక్షులుగా వచ్చిన కొలిగ్స్ అంతా రాత్రికి డిన్నర్‌కు యింటికి వస్తామని మరీ చెప్పి, ఆఫీసుకు వెళ్ళిపోయారు.

గురుమూర్తికి, విమలకు చాల సంతోషంగా వుంది. సాయంత్రం నుంచి డిన్నర్‌కు కావలసిన పిండి వంటలు చేయడంలో మునిగిపోయా రిద్దరూ.

ఏడుగంట లయ్యేసరికి పదార్థా లన్నీ తయారయ్యాయి.

"ఇక వాళ్ళు వచ్చేవేళయింది. నీవు బట్టలు మార్చుకో!" అన్నాడు గురుమూర్తి.

తలుపు తట్టిన చప్పుడు విన్పించింది.

"అప్పుడే వచ్చేసినట్లున్నారే!" అంటూ తలుపు తెరిచిన గురుమూర్తికి, తలుపు అవతల వున్న నాగరాజును చూడగానే చిర్రెత్తుకొచ్చింది.

"ఇక్కడికెందు కొచ్చావ్?" కోపంగా అడిగాడు.

"అలా కోపపడకండి అయ్యగారూ! అవసరంగా డబ్బు కావలసి వెతుక్కుంటూ వచ్చాను. ఓ వంద రూపాయ లుంటే ఇప్పించండి" అన్నాడు నాగరాజు.

గురుమూర్తి ఓ నిముషం ఆలోచించాడు. నాగరాజు జిడ్డుమనిషి. ఇచ్చిందాకా కదలడు. వాడితో పెట్టుకుంటే, ఈలోగా ఆఫీసు స్టాఫ్ వస్తారు. పరువు పోతుంది. వాడికి డబ్బులిచ్చి త్వరగా పంపించడమే మేలు అనుకున్నాడు.

"సరే! ఉండు తెచ్చిస్తాను" అంటూ లోపలికి వెళ్ళి జేబులో డబ్బులు తీసుకొని వెనక్కు తిరిగాడు.

అప్పటికే ఆలస్యం అయింది నాగరాజు లోపలికి వచ్చి తలుపులు మూస్తున్నాడు. వాడి చేతిలో కత్తి మెరుస్తోంది. ఆ గదిలోనే చీర మార్చుకుంటున్న విమలవైపు చూస్తున్న అతని కళ్లూ మెరుస్తున్నాయి.

"నాగరాజూ! కోపంగా ముందుకు రాబోయాడు గురుమూర్తి.

"ష్! అరిస్తే ప్రాణాలు పోతాయి. ఇంతకు ముందుది నాటకం. ఇది నిజం" అన్నాడు కత్తి గాల్లోకి వూపుతూ.

చెయ్యెత్తిన గురుమూర్తి చెయ్యి సర్రున గీసుకు పోయింది. రక్తం బొటబొటా కారసాగింది. బాధగా మూలిగి, రెండో చేత్తో గాయాన్ని పట్టుకొని అక్కడే కూలబడ్డాడు.

ఆ తర్వాత క్షణాల మీద జరిగిపోయింది గురుమూర్తిని గదిలో వున్న పాత నవారుతో కట్టేసి, బలవంతంగా విమలను ఆక్రమించుకున్నాడు.

పావుగంట తర్వాత, గురుమూర్తి జేబులో వున్న డబ్బులన్నీ తీసుకొని తలుపు దగ్గరకు నడిచాడు.

గురుమూర్తి, నాగరాజు వైపు క్రూరంగా చూస్తూ కూర్చున్నాడు.

నాగరాజు తలుపు తెరిచాడు.

అప్పటికే పార్టీకోసం వచ్చిన స్టాఫంతా ఒక్కసారిగా లోపలికి వచ్చారు. వాళ్ళను చూడగానే నాగరాజు పారిపోయాడు. గదిలోకి రాగానే, వివస్త్రగా వున్న విమలను, కట్టేసి పడివున్న గురుమూర్తిని చూడగానే వాళ్ళకు విషయం అర్థమైంది.

గురుమూర్తి ఆ దృశ్యాన్ని చూడలేక గట్టిగా కళ్ళు మూసుకున్నాడు. అతని కళ్ళవెంట నీళ్ళు కారుతున్నాయి.

5

వారం రోజులుగా ఆ యింట్లో నిశ్శబ్దం తాండవిస్తుంది. గురుమూర్తి, విమల సరిగ్గా మాట్లాడుకోవటంలేదు. ఎవరి లోకంలో వాళ్ళు నిర్లిప్తంగా వుంటున్నారు. వాళ్ళిద్దరూ సరిగ్గా భోజనంచేసి వారంరోజులు అయింది.

ఆ రోజుతో గురుమూర్తికి శెలవు అయిపోతుంది. తెల్ల వారి ఆఫీసుకు వెళ్ళాలి. ఎలా? ఆఫీసులో అందరి ముందు తలెత్తుకొని తిరగడం యెలా? పోనీ ఆఫీసు మానేస్తే?.... భుక్తి గడవడం?'....ఆలోచనలతో గురుమూర్తి రాత్రంతా నిద్రపోలేదు.

మరుసటి రోజు ఉదయం అయిష్టంగానే ఆఫీసుకు బయలుదేరాడు.

"ఆఫీసుకు వెళుతున్నారా?" అడిగింది విమల.

"ఊఁ!" అనేసి బయటకు వచ్చాడు. బైట యెండ తీవ్రంగా వుంది. వారం రోజులుగా సరిగ్గా భోజనం లేక పోవడంవల్ల చాల నీరసంగా వుంది. అలాగే నెమ్మదిగా నడవసాగాడు.

ఆఫీసు మెట్లెక్కుతూ యథాలాపంగా చూశాడు ఎవరో పిచ్చిది. చిరిగిన బట్టలు....మురికి పట్టిన శరీరం .. వెకిలిగా నవ్వుతుంది.

ఆ మనిషివైపు ఓ నిముషం పరీక్షగా చూచి అదిరి పడ్డాడు. సుజాత....సుజాతే! సందేహం లేదు. గతం ఒక్కసారి కళ్ళముందు తిరిగి గుండె పట్టేసినట్లయింది. కళ్ళు తిరుగుతున్నట్లనిపించింది.

"ఇప్పుడిం కెవర్ని పెళ్ళి చేసుకుంటావ్?" వెకిలిగా నవ్వుతూ అడిగింది సుజాత.

తూలి పడుతున్న శరీరాన్ని నిగ్రహించుకోలేకపోయాడు. దబ్బున క్రిందపడ్డాడు. పది మెట్లమీద నుంచి దొర్లుకుంటూ క్రిందకు వచ్చాడు.

అప్పుడే అతివేగంగా వచ్చిన ఆఫీసు మేనేజరు కారు చక్రాలు గురుమూర్తి శరీరాన్ని తొక్కుకుంటూ వెళ్ళి ఆగాయి. □

దొంగలొస్తారు జాగ్రత్త

బి. రాజేశ్వరి.

కాలింగ్ బజ్జర్ మోగింది.

జానకమ్మ వచ్చి తలుపు తీసింది.

"సోమనాథం సార్‌గారిల్లు యిదేనాండీ?" అన్నాడు గుమ్మం బయట నించున్న కుర్రాడు. అతనికి పాతికేళ్ళుంటాయి. సన్నగా, పొడవుగా వున్నాడు. గళ్ళ షర్టు, క్రీం కలర్ పాంటు వేసుకున్నాడు.

జానకమ్మ సీట్‌గా కనిపిస్తున్న ఆ కుర్రాడి వంక ప్రశ్నార్థంగా చూపి "ఇదే, ఏం కావాలి?" అనడిగింది.

"సార్ అర్జంటుగా ఆఫీసు నించి అటే కేంప్ వెళ్ళాల్సి వచ్చిందమ్మా. మీకు కబురు చెప్పమన్నారు!"

"అలాగా? ఇంకా రెండు రోజుల వరకు వెళ్ళనని చెప్పారే!?"

"ఆ మాట నిజమేనమ్మా! మేనేజర్ సార్ అనుకోకుండా యీ రోజే వెళ్ళాలని చెప్పారట. వెళ్తున్నారు. అందుకే నా చేత కబురు పెట్టారండి!"

"నువ్వెవరు?"

"ఆఫీసు అటెండర్నమ్మా!"

"కొత్తగా వచ్చావా?"

"లేదండి. పెద్దయ్యగారింటి దగ్గర పని చేస్తుంటానండి! అప్పుడప్పుడు ఆఫీసు కొస్తుంటానండి!"

"అలాగా!"

"రెండు జతల బట్టలు, దుప్పటి, లుంగీ వగయిరా సామాన్లు సర్దమని చెప్పారండి! నేను కూడా కేంప్ వెళ్తున్నానండి. ఇదిగోండి, నా గుడ్డలు సర్దుకున్నా నీ బాగ్‌లో!"

"చీటీ ఏమైనా యిచ్చారా?"

"లేదమ్మా! మధ్యగదిలో స్టీలు బీరువాపైనున్న ఎర్ర వి.ఐ.పి. సూట్‌కేసులో సర్ది యిమన్నారండి."

జానకమ్మ సంతృప్తిగా తలాడించింది. మధ్యగదిలో బీరువాపైన వున్న ఎర్ర వి ఐ.పి. కేసు గురించి యీ కుర్రాడికి తెలిసే అవకాశం లేదు! ఆయన సరిగానే గుర్తు చెప్పారు.

"అలాగే, వుండు తీసుకొస్తాను!" అన్నది జానకమ్మ

లోనికి వెళ్తూ. ముందు గదిలో వున్న అద్దంలో నుంచి మధ్యగదిలో వున్న వస్తువులు కనిపిస్తాయని, అందుకే ముందు గదిలో వున్న కుర్రాడికి లోపల స్టీలు అల్మయిరా, దానిమీద వున్న సూట్ కేస్ కనిపించి వుంటాయనీ ఆ క్షణంలో ఆమెకు గుర్తురాలేదు.

ఓ అయిదు నిమిషాల తర్వాత ఎర్ర సూట్ కేసులో నాలుగు రోజుల కేంప్‌కు సరిపోయే గుడ్డలు సర్దుకుని వచ్చింది జానకమ్మ.

అయితే ఈ లోపల ఆ కుర్రాడు ఊరికే కూచోలేదు. చాలా ఏక్టివ్‌గా పనిచేశాడు. ముందు గదిలోవున్న టూ ఇన్-వన్ టేప్ రికార్డరు, అలారం టైంపీసు, విలువైన స్టీలు సామాను, ఏభై పైగా ఇంపోర్టెడ్ క్యాసెట్లు, వంకెన తగిలించివున్న ఖరీదైన చీరలు, చకచక తన వెంట తెచ్చిన పెద్ద ఏర్‌బ్యాగ్‌లో సర్దేశాడు.

మళ్ళీ యెక్కడైతే ముందు నించున్నాడో సరిగ్గా అదే చోట బ్యాగ్ భుజానికి తగిలించుకుని నించున్నాడు.

జానకమ్మ సూట్ కేసు అతని కందించి, "మీ సార్‌ను చలిగాలిలో తిరగొద్దని, సిగరెట్లు యెక్కువ కాల్చవద్దనీ చెప్పు. అసలే ఆయన ఆరోగ్యం అంతంత మాత్రంగా వుంది!" అంటూ జాగ్రత్తలు చెపుతూనే వుంది యింకా వెనుకనుంచి.

ఆ కుర్రాడు 'అలాగేనమ్మా' అంటూ తలాడించు కుంటూ క్షణాల మీద యిల్లు దాటి సందు మలుపు తిరిగి పోయాడు.

జానకమ్మ కాసేపు గుమ్మం దగ్గరే నించుని తర్వాత లోనికొచ్చి తలుపు మూస్తూ వులిక్కిపడింది. పరిస్థితి గ్రహించగానే ఆమెకు కాళ్ళు చేతు లాడలేదు. జరిగిన

మోసం, దోపిడీ ఆమెకు గుర్తింపు కొచ్చి సన్నగా కేక పెట్టి కూలబడిపోయింది!

* * *

కాకీబట్టల్లో వున్న ఓ వ్యక్తి టెలిఫోన్ స్తంభం ఎక్కాడు. అయిదు నిమిషాల తర్వాత స్తంభం దిగాడు. ఆ స్తంభం నించి కనెక్షన్ యివ్వబడ్డ యిళ్ళను గుర్తుపెట్టు కున్నాడు.

ఓ గంట తర్వాత మళ్ళీ ఆ వీధిలోకి వచ్చాడు. ఓ యింటి తలుపు తట్టాడు. తెరుచుకోలేదు. గుమ్మానికి పైనున్న బజ్జర్ నొక్కాడు.

ఓ మూడు నిమిషాల తర్వాత ఏభై ఏళ్ళ ముసలామె ఆప సోపాలు పడుతూ వచ్చి తలుపు తెరిచింది.

"ఎవరది? ఎవరు కావాలి?" అనడిగింది.

"నేను టెలిఫోన్స్ నించి వస్తున్నానమ్మా! మీ ఫోన్ బావుందలేదని చెక్ చేయటానికొచ్చాను" అన్నాడు.

"మా ఫోన్ బానేవుందే. కంప్లెయింట్ ఎవ రిచ్చారు?"

"కంప్లెయింట్ యిచ్చారని కాదమ్మా! లైన్ చెక్ చేస్తుంటే మీ ఫోన్ ఎవరూ యెత్తలేదు. ఒకవేళ ఫాల్ట్‌గా వుందేమోనిని చూడటానికొచ్చాను."

భుజాన వున్న సంచీ కిందికి దించి, అందులోనుంచి స్క్రూ డ్రయివర్ వగయిరా సరంజామా పైకి తీశా డతను.

"ఎండన పడొచ్చాను, కాసిని మంచినీళ్ళిప్పిస్తారా?" అన్నాడతను.

ఆమె "అదేం భాగ్యం నాయనా" అంటూ లోపలికి వెళ్ళింది నీళ్లు తేవటానికి.

ఆ వ్యక్తి ఒక్క అంగలో దూకి వీధి తలుపు మూసి

బోల్టు పెట్టేశాడు. కిటికీ తెరలు మీదుగా తలుపులు మూసే శాడు.

ఆమె తిరిగొచ్చేలోపల బ్యాగ్‌లోనుంచి తాడుతీసి పట్టు కున్నాడు. చాకుతీసి చేతిలో సిద్ధంగా వుంచుకున్నాడు.

ఆమె గదిలోకి అడుగు పెట్టగానే కత్తి చూపించాడు. "అరవకు, పొడిచేస్తాను" అన్నాడు.

ఆమె చేతిలోని నీళ్ళగ్లాసు నేలమీద పడిపోయింది.

అరవబోయింది. కాని నోరు పెగల్లేదు. సన్నటి మూలుగు మాత్రం బయటికొచ్చింది.

"మర్యాదగా బీరువా తాళాలు యిచ్చెయ్యి. నిన్నేం చెయ్యను. లేకపోతే చంపటానికేమాత్రం సంకోచించను!" అన్నాడతను కత్తి ఆమె గొంతుమీదికి తెచ్చి.

ఆమె రొంటిన దోపుకుని వున్న తాళాల గుత్తి తీసి అతని కిచ్చేసింది. అతను గుత్తి అందుకున్నాడు. ఆమె చీరె కొంగును ఆమె నోటిలో కుక్కాడు. చేతులు వెనక్కు విరిచి తాడుతో కట్టేశాడు. రెండో కొసను సోఫా కాలుకి కట్టాడు.

"ఏ మాత్రం పిచ్చివేషాలు వేసినా నిర్దాక్షిణ్యంగా ప్రాణం తీసేస్తాను!" అని మరోసారి హెచ్చరించి, బ్యాగ్ తీసుకుని స్టీలు అల్మయిరా దగ్గరకు వెళ్ళాడు.

ఓ పావుగంట తర్వాత బ్యాగ్ మోయలేక మోస్తూ హాల్లోకి వచ్చాడు.

ఆమె దీనంగా చూస్తోంది. గుండెలు బాదుకోవాలన్నా చేతులు విరగట్టేశాడు. కళ్ళవెంట కన్నీరు వరదలై కారి పోతుంటే, అతను తలుపు తీసుకుని దొరలా వెళ్ళి పోతుంటే, నిస్సహాయంగా చూస్తూ వుండిపోయింది.

* * *

"టెలిగ్రాం!" అన్నాడు టెలిగ్రాం మెసెంజర్.

సరోజ చటుక్కున తలుపు తెరిచింది.

"ఎక్కడ్నుంచి బాబూ టెలిగ్రాం?" అన్నది కంగారుగా. టెలిగ్రాం వస్తే అది అశుభ సూచకంగా భావించే వాళ్ళే యెక్కువ మందున్నారు. ప్రతి చిన్న విషయానికి టెలిగ్రాం మీద నడిచే యీ రోజుల్లో యింకా టెలిగ్రాం వస్తే అది ఖచ్చితంగా మరణవార్తే అయుంటుందని టెన్షన్‌తో బిగుసుకుపోతుంటారు సరోజ వంటివాళ్ళు.

మెసెంజర్ టెలిగ్రాం విప్పిచూసి, "గుంటూరు నుంచండి!" అన్నాడు.

సరోజ గతుక్కుమని, "మా అమ్మగారి వూరే అది! చదువు బాబూ ఎవరికైనా ఏమన్నా అయిందేమో! మా నాన్నగారి ఆరోగ్యం అంతంత మాత్రంగా వుంది!" అన్నది. ఆమెకు చదువురాదు. లోపల ఎవరో ముసలాయన దగ్గుతున్నాడు.

మెసెంజర్ టెలిగ్రాంలోకి తలతిప్పి జాలిగా ఆమెను చూస్తూ. "సారీ అమ్మ! నాన్నగారు పోయారట!" అన్నాడు.

సరోజ గొల్లుమన్నది. చుట్టుపక్కల వాళ్ళు చేరారు.

"అమ్మ! దీనిమీద సంతకం పెట్టండి!" అని మెసెంజరు ఓ కాగితం ముందుకు జరిపి. ఆమె సంతకం పెట్టింది.

ఆమె జాగ్రత్తగా పరిశీలించి చూస్తే అంత క్రితం రోజు జ్యోతిష్కుడి రూపంలో వచ్చి, తనకు భవిష్యత్తు చెపుతానని తన సంగతులు, తన పుట్టింటి, అత్తింటి సంగతులు అన్నీ కూపీలాగిన వ్యక్తికి, టెలిగ్రాం మెసెంజర్‌కి దగ్గిర పోలికలున్న విషయం గుర్తించి వుండేది! కాని అప్పటి హడావిడి అట్లాంటిది!

మెసెంజర్ నవ్వుకుంటూ వెళ్ళిపోయాడు.

మళ్ళీ సాయంత్రం అదే వీధిన వేగంగా సైకిల్‌మీద పోతూ సరోజ వాళ్ళ యిల్లు తాళం పెట్టివుండటం చూసి తృప్తిగా నవ్వుకున్నాడు.

రాత్రి పదిగంటల తర్వాత మారుతాళం చెవితో ఆ ఇల్లు తెరిచి లోపలికి దూరిన టెలిగ్రాం మెసెంజర్ చాలా ఆనందంగా యిల్లంతా చక్కబెట్టేశాడు.

* * *

బజ్జర్ చప్పుడు విని తలుపు తెరిచింది.

బయట పాతికేళ్ళ యువకుడు నిలబడివున్నాడు.

"నేను గాస్ కంపెనీ నుంచి వస్తున్నానండీ! గాస్ వాడకందార్లకు కొన్ని మెలకువలు చెప్పిరమ్మని మా కంపెనీ పంపింది!" అన్నాడు.

"ఇప్పుడవన్నీ యెందుకు?"

"ఈ మధ్య జంటనగరాల్లో గాస్ ప్రమాదలు ఎక్కువయిపోయాయమ్మా? వాటిని తగ్గించటానికి కొన్ని తరగతులు నిర్వహిస్తోంది మా కంపెనీ. ప్రతీ యింటికి వెళ్ళి గాస్ వాడకందారులకు జాగ్రత్తలు చెప్పిరమ్మని పంపింది" అన్నాడతను. ఓ గంట క్రితమే కొత్త సిలిండరు బండిలో వేసుకొని వచ్చిన గ్యాస్ కంపెనీ కుర్రాళ్ళద్వారా అది యే కంపెనీదో కనుక్కున్నాడు ఆ యువకుడు. క్రొత్త సిలిండర్లు ఏయే యిళ్ళకు వేస్తున్నారో అది కూడా దగ్గరుండి గమనించాడు.

"మీ దే గాస్ కంపెనీ?" అన్నదామె హఠాత్తుగా.

అత నేమాత్రం తడుముకోకుండా "ఇండేన్" అని చెప్పాడు. వాళ్ళ గాస్ ఆ కంపెనీదే నని స్వయంగా సిలిండర్‌మీద చూశాడతను ఇంత క్రితం. అందుకే కచ్చితంగా

చెప్పాడు.

ఆమె ఇంకేం ప్రశ్నించలేదు.

అతను గ్యాస్ వాడకం గురించి అనర్గళంగా ఉపన్యాసం మొదలుపెట్టాడు. ఆమె వింటూ మధ్య మధ్య ప్రశ్నలు వేసి సందేహాలు తీర్చుకున్నది.

"గాస్ సిలండర్ని ఎప్పుడూ పడుకోబెట్టకూడదండి. నిలబెట్టే వుంచాలి....ఆ విషయాలు మీకు చేసిచూపిస్తే బాగా అర్థమవుతుంది. రెగ్యులేటర్ కూడా లీకేజీ లేకుండా ఎలా చూసుకోవాలో అవన్నీ మీకు స్వయంగా చూపిస్తే గుర్తుండిపోతుంది" అన్నాడతను.

ఆమె తలూపి, "లోపలికి రా!" అంటూ సిలిండర్ పెట్టివున్న కిచెన్‌లోకి తీసుకువెళ్ళింది.

అదే ఆమె చేసిన పొరపాటు! యింట్లో ఆమె తప్ప యెవరూ లేరన్న విషయం అతనికి తెలిసిపోయింది. ఆమె వెంట నడుస్తున్నట్టే నడిచి, వెనక్కి నాలుగడుగులు వేసి, తలుపులు మూసేశాడు.

ఆమె చటుక్కున వెనుతిరిగి చూసేసరికి అతని చేతిలో పొడవాటి కత్తి తళుక్కున మెరిసింది.

ఆమె అరవబోయింది. రెండంగలో ఆమెను సమీపించి గొంతుమీద కత్తి ఆనించాడు.

"మర్యాదగా నీ ఒంటిమీదున్న నగలన్నీ తీసి యివ్వు. అరవటానికి ప్రయత్నించకు! యింకా లోపల యేం దాచావో అవన్నీ బయటికి తియ్యి. లేకపోతే అనవసరంగా నిండు ప్రాణాన్ని పోగొట్టుకొంటావు....!" అన్నాడు.

ఆమె గుడ్లనీరు కుక్కుకుంటూ అతను చెప్పినట్లే చేసింది.

* * *

"సుబ్బరామయ్యగారిల్లు యిదేనాండీ?" అనడిగాడు అతను. గోడకున్న నేమ్ బోర్డు అవునని చెప్తోంది.

ముసలామె తలుపు తెరిచి "అవును బాబూ, అతను నా కొడుకే! ఏం కావాలి?" అనడిగింది.

"మీ అబ్బాయి స్కూటర్ని లారీ ఢీకొట్టిందండి— ఆయనను హాస్పిటల్లో చేర్పించారు. ఆయన స్పృహతప్పి పోయేముందు యింటి అడ్రస్ చెప్పారు. నేను హాస్పిటల్ వార్డుబోయ్ని!" అన్నాడతను.

ఆ ముసలామె చిన్నగా కేకపెట్టింది. ఓరి భగవంతుడా. ఎంతపని జరిగింది?.... ఒసేవ్ అమ్మాయి, వాడికి ఏక్సిడెంటయిందట!" అని పిలిచింది ఏడుస్తూ.

ముప్పయ్యేళ్ళ స్త్రీ చంకన చంటిబిడ్డతో పరుగెత్తుకొని వచ్చింది. "యేమిటత్తయ్యా, యేమిటి మీ రనేది?" అంటూ.

విషయం తెలిపి గొల్లుమన్నది.

"ఏ హాస్పిటల్ బాబూ?"

అతను చెప్పాడు.

"బాబూ, మాకు తోడు వస్తావా?" అనడిగింది ముసలామె బయల్దేరటానికి సిద్ధమవుతూ.

"మీ అబ్బాయికి రక్తం కావాలి మామ్మగారూ! అది తేవటానికి మరో హాస్పిటల్కి వెళ్తున్నాను. మా డాక్టర్ గారు చాలా అర్జంటని చెప్పారు!" అన్నాడతను.

"అలాగా, అయితే ఆ పని ముందు చూడు నాయనా, ఏం ప్రమాదం లేదుకదా!"

"ఏం చెప్పగలమండి? రక్తం దొరకటం మీద ఆధారపడి వుంటుంది!" అని వెళ్ళిపోయాడు.

వాళ్ళిద్దరూ చంటిబిడ్డను తీసుకొని యింటికి తాళంపెట్టి

రోడ్ ఎక్కారు.

వాళ్ళు అలా వెళ్ళగానే వార్డుబోయ్ కొద్దిసేపటికి ఆ యింటి దగ్గర ప్రత్యక్షమయ్యాడు. తక్కిన యిళ్ళకి దూరంగా విసిరేసినట్టుంది ఆ యిల్లు. ఇన్‌కంటాక్స్ ఆఫీసర్ యిల్లని, కావాలనే దాన్ని ఎన్నుకున్నాడతను. తన పంట పండిందనుకుంటూ తలుపులు తెరిచాడు.

ఎవరూ గమనించటంలేదని రూఢి చేసుకుని లోపల్నుంచి తలుపులు వేసుకున్నాడు.

తనపని చకచక చేసుకుపోతున్నాడు.

* * *

"నేను టీవీ రిపేర్నండి! మీ టీవీ చెడిపోయిందని కంప్లెయింట్ ఇచ్చారు కదా, బాగుచేయటానికి మా కంపెనీ పంపిందండి!" అన్నాడతను.

"ఓ, అయితే చూడు బాబూ! రెండు రోజుల్నించి ప్రోగ్రాంస్ మిస్సయిపోయాం. నిన్న తెలుగు సినిమా పోయింది. ఈ రోజు హిందీ సినిమా కూడా పోతుందనుకున్నాం. స్వంత టీవీ వున్నాక పక్కింట్లో చూడాలంటే నాకు చచ్చేంత అవమానంగా వుంటుంది! అయినా సినిమాలు రెండూ వారానికోసారి వేస్తున్నారని తప్పితే యిక టీవీ పెట్టుకోవటం, కొనుక్కోవటం కూడా అనవసరమే! ఎందుకూ పనికిరాని ప్రోగ్రాంలు వేస్తున్నారు మరీ ఘోరంగా...." ఆమె ఉపన్యాసం అనర్గళంగా సాగిపోతూనే వుంది. అతను బ్రేక్ వేశాడు.

"ఆ మాట నాతో అంటే యేం లాభమమ్మా....ఆ ప్రోగ్రాంలు వేసేవాళ్ళ నడగాలి! మేము టీవీ సెట్లు అమ్ముకునేవాళ్ళం! మా కూ్కడా ఈ ప్రోగ్రాంలు పేరు చెప్పి సేల్స్ పడిపోయాయి. హైదరాబాద్ టీవీ యిక బాగుపడ

దేమోనండి!" అన్నాడతను బ్యాగ్‌లో నుంచి సరంజామా తీసి నేలమీద పెడుతూ.

అతను పైకి పక్కలకి చూశాడు. ఎలక్ట్రిక్ మెయిన్ తలుపుకి ఎడమపక్కగా వున్నది. సప్పై నెపంతో తలుపు దాకా వెళ్ళాడు. చటుక్కున తలుపులు మూసేశాడు.

ఆమె టీవీ మీద యింకా ఏదో ఉపన్యాసం యివ్వ బోతుండగా ఆమె నోరు టక్కున మూతపడిపోయింది.

టీవీ రిపేరర్ చేతిలో కత్తి తళతళ మెరవటమే అందు క్కారణం! అంతటి వసపిట్టలా వాగే మనిషి అమాంతం మూగదైపోయింది. మూగవాళ్ళ నుంచి యెలా వస్తువులు రాబట్టాలో బాగా తెలిసినవాడిలా అతను చకచక తన బ్యాగ్‌ని నింపుకొంటున్నాడు.

ఉదయం అతను బిచ్చగాడి వేషంలో తిరుగుతున్నపుడు వసపిట్ట—తన టీవీ రెండురోజులుగా పాడయిపోయిందనీ బోరుకొట్టి చచ్చిపోతున్నాననీ ఆ రోజు ఆఫీస్‌కు వెళ్తూ భర్త టీవీ కంపెనీకి చెప్పి వెళ్తానన్నారని—పక్కింటామెతో పెద్దగా అరుస్తూ చెప్పటం అతను విన్నాడు.

అందుకే ఆ యింటి టీవీ రిపేరులో వున్న సంగతి తెలిసి, దాన్ని ఎన్నుకున్నాడు.

* * *

"అమ్మా, బూట్‌పాలిష్ చేస్తాను, కాస్త అన్నం పెడ తారా?" చినిగిపోయిన నిక్కరు, షర్టు వేసుకొన్న కుర్రాడు గేటుదగ్గిర నిల్చుని మాట్లాడుకుంటున్న ఇద్దరు గృహిణు లను నుద్దేశించి అన్నాడు.

అప్పటిదాకా ఏదో విషయంమీద మాట్లాడుకుంటున్న ఆ గృహిణులు తమ ప్రసంగం ఆపుచేసి వాడివంక పరీక్షగా చూశారు. వాడు చాలా ఆరోగ్యంగా వున్నాడు. కాని చిరి

గిన నిక్కరు, షర్టు మాసికలు వేసినవి వేసుకున్నాడు. ముఖానికి కావాలనే కాస్త నలుపురంగు పులుముకున్నా డేమో ననిపించింది వాళ్ళకు వాణ్ణి చూస్తే.

"బూట్ పాలిష్ చేయించుకునేది మగాళ్ళు. మగాళ్ళు ఆఫీసులకి వెళ్ళిపోయాక యింటిలో వస్తే ఎవరు చేయించు కుంటారు పాలిష్? సాయంత్రం రా!" అన్నది ఇద్దర్లోను ఒకామె.

రెండో ఆమె మస్తిష్కంలో ఏదో మెరుపు మెరిసింది. మొదటి ఆమెతో చెప్తున్నట్టు వాడికి వినపడేలాగా "మీ కైతే మీ వారు వూళ్ళో వున్నారు గాబట్టి సాయంత్రం వాడికి కాస్త పని దొరుకుతుంది గాని, మా యింట్లో అయితే వాడికి పని దొరకదు. యెందుకంటే మా వారు కాంప్‌లో వున్నారు కదా! షూస్ ఆయన వేసుకువెళ్ళారు!" అన్నది

పాలిష్ కుర్రాడి ముఖంలో ఏదో వెలుగు కనిపించింది రెండో ఆమెకి. మొదటి ఆమెవంక చూసి, వాడు, సాయంత్రం వస్తానెండమ్మగారూ!" అంటూ వెళ్ళి పోయాడు.

మొదటి గృహిణి ఆశ్చర్యంగా రెండో ఆమెవైపు చూసి, "అదేమిటి శారదగారూ! అన్నయ్యగారు ఊళ్ళోనే వున్నారు కదా! వాడితో అలా అంటా రేమిటి....?" అన్నది.

శారద ఆశ్చర్యంగా మొదటి ఆమెను చూసి "భలేవారే లక్ష్మిగారూ! అయితే మీరీ రోజు పేపర్ చూడలేదా? రండి, మా యింట్లోకి వెళ్ళి మాట్లాడుకుందాం!...." అన్నది.

లక్ష్మి అనబడే మొదటి ఆమె శారద వాళ్ళ యింట్లోకి

ఆమె వెంటనే నడిచింది.

శారద ఆ నాటి లోకల్ డెయిలీ పేపరులో వచ్చిన దొంగతనాల వార్తలు లక్ష్మికి చూపించింది....

బూట్‌పాలిష్‌వాడు ఒక గంట తర్వాత మారువేషంలో తిరిగి శారద ఇంటికి వచ్చి తలుపు తట్టాడు.

"అమ్మా, తలుపుతీస్తారా? మీటర్ చూసుకోవాలి!" అన్నాడు.

శారద కిటికీలోంచి చూసి, "ఏమిటి నాయనా, ఏం మీటరు?" అనడింది.

"కరెంటు మీటరమ్మా! ఇది డిసెంబర్ నెల కదా! రీడింగు తియ్యాలి!" అన్నాడతను.

"ఓహో, స్లాబ్ సిస్టం వచ్చాక నాలుగు నెల్లకోసారి మీట(రీడింగు తీసుకుంటున్నారు కదూ! నా కీ పద్ధతి నచ్చ లేదోయ్!"

"ఏమిటమ్మా?"

"మేం కాల్చినా కాల్చకపోయినా నెలకి ముప్ఫై అయిదు రూపాయలు వసూలు చేస్తున్నారు. ఎప్పుడో యెక్కువ కట్టిన సొమ్ము అడ్జస్టు చేస్తా రనుకో! కాని యీ సంవత్సరంలో నాలుగుసార్లు నష్టం పోయాం మేం!"

"అదేమిటండీ? ఎందుకు నష్టపోవటం?"

"నాలుగుసార్లు యిల్లు మారాల్సి వచ్చింది. నాలుగు నెలలు చొప్పున అధికంగా కట్టిన బిల్లులు మాకు రిఫండు వచ్చే అవకాశం లేదుగా. మా తరువాత యిళ్ళలో దిగిన వాళ్ళకే లాభం!"

"మరి దానికి మేమేం చేయగలం? త్వరగా తలుపు తియ్యండమ్మగారూ! అప్పుడే మూడైపోయింది. ఇంకా

చూసుకోవలసిన యిళ్ళు చాలా వున్నాయి!" అన్నాడు ఆ మనిషి.

"అలాగే వస్తున్నా వుండు" అంటూ శారద మధ్యగది లోకి ఓసారి ఓరకంట చూసి, వెళ్ళి తలుపు బోల్టుతీసింది.

అతను లోపలికి అడుగుపెట్టాడు. భుజాన సంచీ వున్నది. మీటరు ఎక్కడుందో చూస్తూన్నట్టు నటించి చటుక్కున తలుపు మూసేశాడు.

అతని చేతిలో కత్తి తళుక్కున మెరిసింది.

"అయ్యో, అదేమిటి నాయనా? చెయ్యి తెగిపోతుంది సుమా! మీట ర్రీడింగు తియ్యటానికి యీ మధ్య చాకు లుపయోగించటం మొదలెట్టారా ఏం?" అన్నది శారద.

"మీట ర్రీడింగు తియ్యటాని క్కాదు. నీ ప్రాణాలు తియ్యటానికి! అరిచావంటే చంపేస్తాను!"

"ఛ, ఛ! ఎందుకరుస్తాను? ఇంతకీ నువ్వు దొంగగారివా? మీట ర్రీడింగు కోసం కాదన్నమాట నువ్వు వొచ్చింది?"

"కాదని చెప్పాను కదా, యింకా కత్తితో పొడిచి చెప్పాలా?"

"అక్కర్లేదులే అబ్బాయ్! కత్తి చాలా పదునుగా వున్నట్టుంది, జేబులో పెట్టేసుకో, తెగేలా వుంది!"

"నాతో ఆటలుకాదు. నీ వస్తువులు, నగదు, యింకా యింట్లో యేమున్నాయో అవన్నీ తెచ్చిపోగుపొయ్యి—లేక పోతే నిన్ను చంపి అవన్నీ నేనే తీసుకోవలసి వుంటుంది!"

"అలాగే! అయిదునిమిషాల్లో తెచ్చిపెడతాగా! పాపం, ఎంత కష్టంలో వుండి అడిగావో ఏమో!"

"ఊఁ! నామీదేం జాలి పడక్కర్లేదు. నోర్మూసుకుని తెచ్చి యిక్కడ పడెయ్యి అవన్నీ!"

"అంత కోపమెందుకు నాయనా! తెస్తా నన్నాను కదా!"

అయితే అనుకోకుండా అతని చేతిలోని కత్తి యెగిరి అవతల పడింది నెత్తిమీద పడ్డ దెబ్బకు అతని బుర్ర పగిలిపోయినట్టనిపించి చర్రున పక్కకి చూశాడు.

లక్ష్మి చేతిలో పచ్చడి బండ! అతని నెత్తిన మరో దెబ్బ పడింది. అంతే! కుప్పలా కూలిపోయాడు.

"ఎరా, ఒంటరిగావున్న ఆడవాళ్ళను కత్తి చూపి భయపెట్టి దోచుకుపోతావా? ఇప్పుడు నీ ప్రాణం తీస్తాం" అన్నారు శారద, లక్ష్మి పచ్చడి బండతో మరి నాలుగు వడ్డిస్తూ.

అతను ఒక్క అంగలో వాళ్ళకాళ్ళమీద పడి లబ లబ లాడాడు.

తర్వాత యిద్దరూ కలిసి అతడిని ఓ తాడుతో కట్టేసి, పోలీస్‌స్టేషన్‌కి ఫోన్ చేశారు. □

కుంభకోణం!



పతనం

ఇది చాలా సంవత్సరాల క్రితం జరిగిన యథార్థ సంఘ
టన. అప్పటికి ఆంధ్రరాష్ట్రం ఏర్పడలేదు.

అవి భక్త మద్రాసు రాష్ట్రంలో వుండగా గుంటూరులో కళ్యాణసుందరం అనే ఆయన జిల్లా విద్యాశాఖాధికారిగా పని చేస్తుండేవాడు. ఆయన వయసు ఈ సంఘటన జరిగే

సమయానికి యాభయి సంవత్సరా లుండేది. ఆయన భార్య పేరు మధురం. ఆవిడ ఆయనకన్నా పదిహేను సంవత్స రాలు చిన్నది.

వాళ్ళకు ఒక్కటే కూతురు. ఆమె పేరు భామ. ఉమెన్స్ కాలేజీలో ఇంటర్ చదువుతుండేది.

భామకు సంగీతం అంటే చాలా ఇష్టం. ఆమెకు సంగీతం నేర్పటానికి శివమణి అనే మాష్టారు వస్తుండే వాడు. అతనికి ఇరవయి అయిదు సంవత్సరాల వయసు వుండేది. సన్నగా, పొడుగ్గా, ఎర్రగా వుండేవాడు. బ్రహ్మ చారి.

అతను కళ్యాణసుందరం ఇంటికి నాలుగయిదు వీధుల అవతల వుండేవాడు. అయిదారుగురు తమిళుల ఇళ్ళల్లో సంగీతం పాఠాలు నేర్పుతూ పొట్ట పోసుకునేవాడు.

సామాన్యంగా భామ కాలేజీ నుండి ఇంటికి తిరిగి వచ్చే సరకి నాలుగున్నర అవుతుంటుంది. పాఠాలు చెప్పటానికి శివమణి వచ్చేసరికి అయిదవుతుంటుంది. అతను ఆరు న్నరా, ఏడు గంటలవరకు ఆ ఇంట్లోనే వుంటాడు. అప్పు డప్పుడు అక్కడే భోజనం చేస్తుండటం కద్దు.

అతను గత ఆరు నెలలుగా భామకు పాఠాలు నేర్పు తున్నాడు. రోజులు గడిచేకొద్దీ భామకు సంగీతం అంటే ఇష్టం పోయి ఆ స్థానే శివమణి మీద ఇష్టం పెంచుకో సాగింది.

భామ మనసు తెలుసుకోవటానికి శివమణికి ఆట్టేకాలం పట్టలేదు. అయితే లేనిపోని గొడవల్లో ఇరుక్కుని తన జీవనోపాధికి ముప్పు తెచ్చుకోవటం ఇష్టం లేక అతను తొందరపడలేదు.

అలా ఎంతోకాలం సాగలేదు.

ఒక రోజు సాయంత్రం ఎప్పటిలా శివమణి అయిదు గంటలు కావస్తుండగా భామ వాళ్ళింటికి చేరుకున్నాడు. నరాసరి మేడ మీదున్న భామ గదిలోకి నడిచి గది మధ్యలో పరచి వున్న చాపమీద కూర్చున్నాడు. పాఠాలు ఆ గది లోనే జరుగుతుంటాయి.

హార్మోనియం అందుకొని మూత తీస్తుండగా భామ గ్లాసులో కాఫీ తీసుకు వచ్చి అతనికి అందించింది. ఎదు రుగా కూర్చుని, "ఇవేళ సంగీతానికి సెలవు" అని నవ్వింది. ఆమె నవ్వినపుడు బుగ్గలు సొట్టలుపడి ఆమె అందం ద్విగుణీకృత మవుతుంటుంది.

"ఎందుకట?" అడిగాడు శివమణి.

"ఇవేళ ఇంట్లో అమ్మా నాన్న లేరు."

"ఎక్కడికి వెళ్ళారు?"

"ఆఫీసర్స్ క్లబ్‌లో ఏదో పార్టీ వుంటే వెళ్ళారు. వాళ్ళు వచ్చేసరికి ఎనిమిది గంట లవుతుందిట. అప్పటి వరకు మీరిక్కడే నాకు తోడుగా వుండాలని మా నాన్న గారి హుకూం. తెలిసిందా?"

"జీ హుజూర్ తెలిసింది."

"ఈ రాత్రికి మీ రిక్కడే భోజనం చేసి వెళ్ళాలని మా అమ్మగారి ఆజ్ఞ."

"పాటిస్తాను. ఈ బ్రహ్మచారికి అంతకంటే ఏమి కావాలి?"

"ఇంకేమీ కోరికలు బ్రహ్మచారులకు వుండవా?" అడి గింది భామ 'కోరిక' అనే మాటను వత్తి పలుకుతూ.

ఈ ప్రశ్నకు ఏమి జవాబు చెప్పాలో అతనికి తోచ లేదు నాలుగయిదు గుటకల్లో గ్లాసు ఖాళీ చేశాడు. హార్మో

నియం మూత వేసి మంచం క్రిందకు నెట్టాడు. తలెత్తి భామ ముఖంలోకి చూశాడు.

"నా ప్రశ్నకు మీరు జవాబు చెప్పలేదు మాస్టారూ" అని కవ్వింపుగా అంది.

ఆమె ముఖంలోకి చూసేకొద్దీ అతని నరాల్లో చైతన్యం మొదలయింది. హృదయస్పందన వేగం క్రమ క్రమంగా హెచ్చవసాగింది.

"ఎందుకుండవు? వుంటాయి" అన్నాడు. అతని కంఠ స్వరం అతనికే కొత్తగా వినిపించింది.

"మీ కోరికేమిటో చెప్పండి. విందాము" అంది భామ.

"విని ఆర్చేదానివా, తీర్చేదానివా?" అడిగాడు.

"మీరు ఏమి అడిగినా కాదనను మాస్టారూ...."

ఈ మాటతో శివమణి నిగ్రహం పూర్తిగా సడలి పోయింది. ముందుకు జరిగి భామ నడుం చుట్టూ చేతులు వేసి దగ్గరకు లాక్కున్నాడు. ఆవేశంతో ఆమె ముఖాన్ని ముద్దులతో నింపి వేస్తుంటే ఆమె అభ్యంతరం చెప్ప లేదు ఈ అవకాశం కోసం ఎదురు చూస్తున్న దానికిమల్లె వెనక్కి వాలిపోయింది. అతను ఆమె మీదకు వాలి, "భామా! నువ్వంటే నాకు ఎంత యిష్టమో తెలుసా?" అని అతను అంటుంటే భామ అతని మాటలకు అడ్డు తగు లుతూ—

"మాస్టారూ! నేను అంటే మీకు ఉత్తి ఇష్టమే. అయితే మీరంటే నాకు ప్రేమ, పిచ్చి. మీరంటే నాకు ఎంత ప్రేమంటే.... మాటల్లో ఎలా చెప్పాలో అర్థం కావటం లేదు .. అయి లవ్ యూ మాస్టారూ .. అయి లవ్ యూ వెరీ మచ్. మీ గురించి నా హృదయం ఎంత పరితపించి

పోతుందో చూడండి....”

అని మయికంలో వున్నదానిలా మాట్లాడుతుంటే అతనామెను పూ_ర్తిగా ఆక్రమించుకున్నాడు.

గంట తర్వాత శివమణి వెళ్ళిపోయాడు. భామ తలి దండ్రులు పార్టీ నుండి తిరిగి వచ్చేసరికి భామ స్నానం చేసి గుడ్డలు మార్చుకుని బుద్ధిమంతురాలిలా పు_స్తకం తీసుకుని చదువుకుంటూ కూర్చుంది.

2

పది రోజుల తర్వాత, “రేపు నువ్వు ఒక పని చేయాలి” అన్నాడు శివమణి భామతో.

ఏమిటన్నట్లు చూసింది భామ.

“నా గది నీకు తెలుసు కదా?” అడిగాడు.

“తెలుసు.”

“రేపు నువ్వు నా గదికి రావాలి.”

“ఎందుకు?”

“నువ్వు రా చెబుతాను.”

“ఎందుకో ఇప్పుడు చెబితేనే రేపు వస్తాను.”

అతను భామను దగ్గరకు తీసుకుని పెదవుల మీద ముద్దు పెట్టుకుని “ఇందుకు....నీకొద్దా?” అడిగాడు.

“వద్దు. ప్లీజ్ నన్ను వదులు. హఠా_త్తుగా ఎవరయినా వ_స్తే బావుండదు.”

అతను ఆమెను మరొకసారి ముద్దు పెట్టుకుని వదిలి, “నాకు ఎంత పిచ్చిగా వుందో తెలుసా? నీకు ఏమీ అని పించటం లేదా?” అడిగాడు.

భామ అవునన లేదు కాదనలేదు.

ఆవేళ్టి పాఠం ముగించాక “రేపు మధ్యాహ్నం ఒంటి గంటకు నీ కోసం నా గదిలో ఎదురుచూస్తూ వుంటాను.

నువ్వు కాలేజీ నుండి అటు వచ్చేసేయి. ఒక్కపూట కాలేజీ ఎగ్గొడితే ఏమీ కాదులే. కాలేజీ వదిలే సమయానికి మీ ఇంటికి వెళ్ళిపోదువు. రాకపోతే నామీద ఒట్టు....” అని ఆమె జవాబుకై ఎదురు చూడకుండా మెట్లు దిగి వెళ్ళిపోయాడు.

మరుసటి రోజు కాలేజీ వెళ్ళింది భామ. భోజన విరామ సమయంలో తలనొప్పి మిషమీద కాలేజీ నుండి బయట పడింది. ఆమె శివమణి గది చేరుకునేసరికి పావు తక్కువ ఒంటి గంటయింది.

వేగంగా స్పందించే హృదయంతో తడబడే అడుగులతో శివమణి గదిలోకి నడిచి చేతిలోని పుస్తకాలు బల్ల మీద పెట్టింది భామ.

అతను తలుపు గడియవేసి “నిజం చెప్పేదా! నువ్వు ధైర్యం చేసి నా గదికి వస్తావని అనుకోలేదు” అని దగ్గరకు వచ్చి ఆమె నడుం చుట్టూ చేతులు వేసి తన వయిపు లాక్కుని మెడక్రింద ముద్దు పెట్టుకున్నాడు. భామ అతనికి చుట్టుకుపోతూ, “రాకపోతే ఏడుస్తావని వచ్చాను తెలుసా?” అంది.

అతను చిన్నగా నవ్వాడు.

“నీ గదికి వస్తుంటే నాకు చాలా భయం వేసింది” అంది భామ.

“మొదటిసారి కాబట్టి భయంగా వుంటుంది. తర్వాతర్వాత భయం వేస్తే అప్పుడను” అన్నాడు ఆమెను చివరికంటూ చూస్తూ.

అతనన్న మాట అబద్ధం కాలేదు. మూడు రోజుల తర్వాత భామ ఆ గదికి రెండోసారి వచ్చినపుడు మొదటి సారి వచ్చినపుడంత భయపడలేదు. ఆ తర్వాతి వారంలో

ఇంకో మధ్యాహ్నం పూట వచ్చినప్పుడు భయం పూర్తిగా తగ్గిపోయింది. ఆపయిన వారానికి ఒకటీ రెండుసార్లు అతని గదికి రావడం ఆమెకు కాలేజీకి వెళ్ళినంత తేలిక అయింది.

*

నాలుగు నెలలు గడిచాక కాలేజీవాళ్ళు ఏర్పాటు చేసిన స్టడీ టూర్‌కు భామ వెళ్ళవలసి వచ్చింది. భామ టూర్‌కు వెళ్ళిన మరుసటి రోజున కళ్యాణసుందరం కూడా రెండు వారాలపాటు క్యాంపుకు బయలుదేరాడు.

లంకంత ఇంట్లో మధురం ఒక్కతే మిగిలిపోయింది. భర్త క్యాంపుకు వెళ్ళిన సాయంత్రం బోరుకొడుతుంటే ఇంటికి దగ్గరలో వున్న సినిమా హాలుకు వెళ్ళి బాల్కనీలో ఒక మూల కూర్చుంది.

అప్పటికి సినిమా యింకా మొదలుపెట్టలేదు. సినిమా పాతది కావటంవలన హాలులో జనం ఆట్టే లేరు. తెలిసిన వాళ్ళు ఎవరయినా కనిపిస్తారేమోనని చుట్టూ కలయచూసిన మధురానికి నాలుగయిదు వరసలు ముందు కూర్చున్న శివమణి కనిపించేసరికి వెదకబోయిన తీగ కాలికి తగిలినంత సంతోషం వేసింది.

"శివమణీ" పిలిపించి.

అతను వెనక్కి తిరిగి "మీరా?" అన్నాడు ఆశ్చర్యపోతూ.

"రా, ఇలా వచ్చి కూర్చో" ఆహ్వానించింది.

శివమణి లేచి వచ్చి ఆమె ప్రక్క సీట్లో కూర్చున్నాడు.

"భామ లేకపోతే మా యింటికి రాకూడదా ఏమిటీ?" అంది నిష్ఠూరంగా.

"భామ స్టడీటూర్ నుండి వచ్చేవరకు రావద్దని అన్నది మీరే కదా?"

"మా ఆయన ముందు అలా అనవలసి వచ్చింది.... శిఖామణీ! నువ్వు చాలా అమాయకుడివోయ్....నా కెంత బోరుగా వుందో తెలుసా .. నువ్వు కనబడేసరికి నాకు ప్రాణం లేచివచ్చినట్లయింది...." అంటుంటే ఆమె పయిట జారి ఒడిలో పడింది. ఆమె అందుకోలేదు. "లోగడ ఈ సినిమా ఒకసారి చూశాను. బాగానే వుంటుంది" ఆమె హేండ్ రెస్ట్ మీద చేయి పెట్టి ముందుకు వంగింది.

అతను ఆమె మెడ క్రిందకు చూశాడు. రవిక బిగుతుగా వుంది. ఆమెది ఆరోగ్యవంతమయిన తెల్లటి శరీరం. నిజానికి భామకన్నా మధురమే అందంగా వుంటుంది. తెలియనివాళ్ళు ఎవరయినా మధురాన్ని, భామను ప్రక్క-ప్రక్కన చూస్తే వాళ్ళను అక్కా- చెల్లెళ్ళని అనుకొంటారే కాని, తల్లీ కూతుళ్ళని అనుకోరు. మధురానికి భామ అంత కూతురుందంటే వెంటనే ఎవరూ నమ్మరు.

శివమణి మధురాన్ని అంత దగ్గరగా, నిశితంగా ఎప్పుడూ చూడలేదు. మధురంలాటి అందమయిన భార్యను పొందినందుకు కళ్యాణసుందరాన్ని మనసులో అభినందిస్తూ అతని అదృష్టానికి మొట్ట మొదటిసారిగా అసూయ పడ్డాడు. అదే చివరిసారి కూడా.

సినిమా మొదలయిన పావుగంటకు పాట సీక్వెన్స్ వచ్చింది. "మణీ! ఈ పాటంటే నాకు చాలా యిష్టమోయ్....చూడు, హీరో హీరోయిన్ను ఎలా వత్తేస్తున్నాడో....!" అంటూ అతని కుడి చేయిని పట్టుకుంది

మధురం. ఆమె చేతిలోని మందోష్ణం క్రమ క్రమంగా అతనిలోకి పాకసాగింది. పాట ముగిసేసరికి అతను ఆమెకు చేరువుగా వున్నాడు. అతని చేయి ఆమె భుజాల మీదుగా క్రిందికి జారి వుంది.

పది నిమిషాలు గడిచాక "మీకు సినిమా తప్పకుండా చూడాలని వుందా?" అడిగాడు శివమణి.

"లేదు."

"మీ ఇంటికి వెళ్దాం పదండి."

"ఎవరికీ అనుమానం కలుగకుండా ఒక పని చేద్దాం."

"చెప్పండి."

"ముందు నేను వెళ్ళి మా ఇంట్లో నీ కోసం ఎదురు చూస్తూ వుంటాను. పది నిమిషాల తర్వాత నువ్వు వచ్చేయి. ఇద్దరం కలిసి రిక్షాలో వెళితే బావుండదు. ఏమంటావు?"

"సరే" అన్నాడు శివమణి ఆమె మీంచి చేయి తీసి వేస్తూ.

మధురం పయిట భుజాలనిండా కప్పుకుని లేచి బయటకు వచ్చింది. రిక్షా మాట్లాడుకుని ఎక్కి కూర్చుంది.

పది నిమిషాల తర్వాత శివమణి హాల్లోంచి బయటకు వచ్చి కళ్యాణసుందరం ఇంటి వయిపు నడవసాగాడు.

అప్పుడు అతనిని అయ్యర్ అనే వ్యక్తి అనుసరిస్తున్నాడన్న సంగతి అతనికి తెలియదు.

అది మొదలు కళ్యాణసుందరం కేంప్ నుండి తిరిగి వచ్చేవరకు మధురం శివమణితో పగటిపూట అయితే అతని గదిలో కలుస్తుండేది. రాత్రిళ్ళయితే వాళ్ళిద్దరికి ఎటువంటి అడ్డూ వుండేది కాదు.

కళ్యాణసుందరం క్యాంపు నుండి గుంటూరు తిరిగి వచ్చిన రెండో రోజున భామ స్టడీటూర్ నుండి తిరిగి వచ్చింది.

జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో అయ్యర్ గుమాస్తాగా పనిచేస్తున్నాడు. అతనూ కళ్యాణసుందరం తిరుచినాపల్లి వాళ్ళు కావటంవలన అయ్యర్ అప్పుడప్పుడు కళ్యాణసుందరం దగ్గిరకొచ్చి పిచ్చాపాటీ మాట్లాడుతుండేవాడు.

కళ్యాణసుందరం క్యాంపు నుండి తిరిగి వచ్చిన నాలుగు రోజుల తర్వాత అయ్యర్ కళ్యాణసుందరాన్ని కలిశాడు. "మిమ్మల్ని కలుసుకోవాలని మూడు రోజుల నుండి ప్రయత్నిస్తుంటే. ఇప్పటికి వీలయింది" అన్నాడు.

"కూర్చో" కుర్చీ చూపించాడు కళ్యాణసుందరం.

అయ్యర్ కుర్చీలో కూర్చుని ముందుకు వంగి "మీతో ఒక రహస్యం చెప్పాలి" అన్నాడు.

"చెప్పు."

"నేను మీ మేలు కోరేవాడిని. నేను చెప్పేది విని నా మీద విరుచుకుపడవద్దు. నేను కళ్ళారా చూసింది తమతో విన్నవించుకుంటున్నాను."

"త్వరగా చెప్పవయ్యా బాబూ!" అని తన అసహాయం తెలియజేస్తూ చేతి గడియారం వంక చూసుకున్నాడు.

"మీరు క్యాంపుకి వెళ్ళిన సాయంత్రం అమ్మగారినీ శివమణినీ సినిమా హాలులో ప్రక్క ప్రక్కన కూర్చుని ఉండగా చూశాను. సినిమా మొదలయిన కొద్దిసేపటికి ఒకరి తర్వాత ఒకరు హాలులోంచి బయటకు వెళ్లారు. నాకు అనుమానం వేసి శివమణిని వెంబడించాను. వాడు

మీ ఇంటికి వెళ్లాడు ... రెండు మూడుసార్లు అమ్మగారు వాడి గది నుండి తిరిగి వస్తుంటే కూడా చూశాను...." అన్నాడు అయ్యర్.

కళ్యాణసుందరం కళ్ళు మూసుకుని కొద్దిసేపు మవునంగా కూర్చున్నాడు.

"నే వెళ్ళొస్తానండీ" అని లేచాడు అయ్యర్.

కళ్యాణసుందరం కళ్ళు తెరిచి అయ్యర్‌ను వెళ్ళమన్నట్లు తలూపి "ఈ సంగతి....ప్లీజ్....ఎవరికీ చెప్పకు" అన్నాడు ప్రాథేయపడుతూ.

అయ్యర్ తల అడ్డంగా ఆడించి "నే నెవరకూ చెప్పను సార్" అని బయటకు నడిచాడు.

ముప్పావు గంట తర్వాత కళ్యాణసుందరం ఏదో నిశ్చయానికి వచ్చినవాడికిమల్లె కోటు తొడుక్కొని ఆఫీసు నుండి బయటకు వచ్చాడు. రిక్షా ఎక్కి సరాసరి ఇంటికి వెళ్ళాడు.

ఇంటికి తాళంవేసి వుంది. మధురం ఎక్కడకు వెళ్ళిందో ప్రక్కింటివాళ్ళకు కూడా తెలియదు. వాచీ చూసుకున్నాడు. ఒకటిన్నర అయింది. పళ్ళు పట పట కొరుకుతూ 'వాడి గదిలో కులుకుతూ వుండి వుంటుంది' అనుకుని శివమణి గది వయిపు వేగంగా నడవటం మొదలెట్టాడు.

5

తలుపు మూసి గడియ వేస్తుంటే "టయిం ఎంతయింది?" అడిగింది భామ.

"ఒకటిన్నర" అని మంచం దగ్గరకు వచ్చి నుంచుని దిశగా పడుకుని వున్న ఆమె వంక చూశాడు. టూర్ నుండి తిరిగి వచ్చాక భామ అక్కడికి రావటం అదే మొదటి

సారి. ఆమెకు ఎప్పుడెప్పుడు అతనిలో లీనమయిపోదామా అని వుంది.

"మణీ! నిన్నొదిలి నేనుండలేనమ్మా...." అంది.

"ఇన్నాళ్ళు ఎలా ఆగగలిగావు?" అడిగాడు.

"టూర్‌లో వున్నాననేగాని మనసంతా నీమీదే వుంది. ఎప్పుడెప్పుడు తిరిగి వచ్చి ఇలా వుండిపోతానా అని పిచ్చిగా అనిపించేది...." అంటుంటే ఎవరో తలుపు తట్టిన చప్పుడయింది.

"ఎవరో వచ్చినట్టున్నారు" అంది భామ దుప్పటి మెడ వరకూ కప్పుకుంటూ.

భామ మాట పూర్తి కాలేదు. కళ్యాణసుందరం తన్నిన తాపుతో తలుపు గడియ వూడి శబ్దంతో తలుపు తెరుచుకుంది.

ఈ హఠాత్ సంఘటనకు శివమణి ఆశ్చర్యంలోంచి తేరుకునేలోగా కళ్యాణసుందరం లోపలికి వచ్చాడు. భామ భయంతో లేచి కూర్చుంది. భార్య వుంటుందని కోపంతో వూగిపోతూ వచ్చిన కళ్యాణసుందరం ఆవేశం ద్విగుణీకృతమయింది. శివమణిని తిడుతూ ఇష్టం వచ్చినట్లు బూటుకాలితో తన్నసాగాడు.

శివమణి కొద్దిసేపు తన్నులు భరించి ఆపైన ఎదురు తిరిగి కిటికీ మీదున్న కూరగాయలు కోసుకునే కత్తి అందుకుని కళ్యాణసుందరం మీద లంఘించి ఆయన్ని క్రింద పడేసి నాలుగు పోట్లు పొడిచాడు. మూడో పోటుకే కళ్యాణసుందరం ప్రాణాలు పోయాయి.

సెషన్స్ కోర్టులో కళ్యాణసుందరం హత్యకేసు ఆరు నెలలపాటు నడిచి అప్పటిలో చరిత్రను సృష్టించింది. భామ ప్రత్యక్షసాక్షిగా అన్ని విషయాలు పూసగుచ్చినట్లు

చెప్పింది. మధురంతో సహా మరో పదిహేను మంది ప్రాసిక్యూషన్ తరపున సాక్ష్యాలు చెప్పారు. శివమణి తన నేరం ఒప్పుకున్నాడు.

న్యాయమూర్తి శివమణికి ఉరిశిక్ష విధించాడు. ఈ శిక్షను హైకోర్టు ధృవపరచింది.

చనిపోయే ముందు తన చివరి కోరిక ఏమిటని జయిలు అధికారులు అతన్ని అడిగినప్పుడు "భామను కాని, మధురాన్ని కాని చూడాలని వుంది" అన్నాడు శివమణి. అతని చివరి కోరిక తీరలేదు. భామ, మధురం గుంటూరు వదలి వెళ్ళి పోయారు. తిరుచినాపల్లి చేరలేదు. ఎక్కడికి వెళ్లారో ఎవరికీ తెలియదు.

1951 మే 24 ఉదయం నాలుగున్నరకు శివమణిని రాజమండ్రి సెంట్రల్ జయిల్లో ఉరి తీశారు. □

మోడరన్ వైద్యం



చిత్రమైన కోరిక



ప్రతాప
రవిశంకర్

"సదరన్ ట్రేడింగ్ కార్పొరేషన్ పేరు మీరు వినే వుంటారు" అన్నది ఆమె.

తల వూపాను.

ఎంతోమంది అందమైన ఆడవాళ్ళను చూశాను. కాని—యిప్పుడు నా యెదురుగా కుషన్ ఛెయిర్‌లో కూర్చున్న అమ్మాయి అందం.... నన్ను పరవశుడిని చేసింది.

"ఆ కంపెనీలో స్టెనోగా ఉద్యోగం చేస్తున్నాను. నా పేరు లావణ్య."

లావణ్య గొంతు తీయగా వున్నది. ఆమె మాటల్లో ఏదో మత్తు వున్నది.

పైన గిరగిరా తిరుగుతున్న ఫ్యానుగాలికి ఆమె ముంగరులు కదిలి నాట్యం చేస్తున్నాయి. ఆమెను అలా చూస్తూంటే నాకు యెంతో హాయిగా వున్నట్టు అనిపించింది.

క్షణం తర్వాత వూహల నుంచి బయటపడి "చెప్పండి....మీరు నన్ను యెందుకు కలుసుకున్నారు?" అన్నాను.

వెంటనే ఆమె మాట్లాడలేదు.

లావణ్య కళ్ళలో ఆ నిముషంలో నాకు ఓ విధమైన విచారం కనిపించింది.

విశాలమైన కనులలో విషాదం తొంగిచూడటం నిజంగా విషాదకరమైన విషయం.

ఇంత అందమైన యువతికి విచారాన్ని కలుగజేసిన సంఘట ఏమిటి?

నిమిషంలో లావణ్య హ్యాండ్ బాగ్ తెరిచి అందులో నించి రెండు ఉత్తరాలు తీసి నా ముందు వుంచింది.

ఆశ్చర్యంగా వాటిని అందుకున్నాను—

మొదటి ఉత్తరం ఇలా వున్నది:

"మై డియర్ లావణ్యా—

నువ్వెప్పుడయినా నీ నగ్న సౌందర్యాన్ని అద్దంలో చూసుకున్నావా? చూసుకుని వుండవు. ఎందుకంటే నీకు మతిపోయి వుండేది. ఇప్పుడు నేను నా మతి పోగొట్టుకోవాలని అనుకుంటున్నాను—నీ నగ్నసౌందర్యం చూసి.

అందుకే నువ్వు నీ నగ్నఫోటో ఒకటి తీసి నాకు పంపించు ముందు ఫోటో తీయించు—అది నాకు యెలా చేరాలో నీకు తర్వాత తెలియబరుస్తాను—బై!

—నీ అభిమాని."

ఆ ఉత్తరాన్ని చదివి కుతూహలంగా లావణ్య కళ్ళలోకి చూశాను. ఆమె సిగ్గుగా తల దించుకున్నది.

రెండో ఉత్తరం మడత విప్పాను.

"డియర్ అందాల రాణీ—

నీ కోసం సదరన్ ట్రేడింగ్ కార్పొరేషన్‌కి రెండు సార్లు ఫోన్ చేశాను. కాని నువ్వు రాలేదని జవాబు వచ్చింది....ఇంతకీ నువ్వు నీ నగ్న ఫోటో తీయించావా? సిగ్గుగా వున్నాదా? ఫర్వాలేదు. నీ గర్ల్ ఫ్రెండ్స్‌లో ఎవరో ఫోటోగ్రఫీ తెలిసివుంటుంది... ప్రయత్నించు. మళ్ళీ నీకు ఫోన్ చేస్తాను....అప్పుడు అన్ని విషయాలూ మాట్లాడుతాను—బై!

—నీ అభిమాని."

"చిత్రమైన కోరిక" అన్నాను ఆ ఉత్తరాలను మడిచి బల్లమీద వుంచుతూ.

లావణ్యకు నా మొహంలోకి చూడాలంటే యింకా సిగ్గుగానే వున్నట్టు అనిపించింది—

నిజమే—ఓ ఆడదానికి అలాంటి ఉత్తరాలు రావటాన్ని యెవ్వరూ హర్షించలేరు. అందాన్ని ఆస్వాదించటంలో తప్పులేదు. కాని యిలా నగ్నఫోటోలు కావాలని రాయటం నిజంగా దారుణం—ఆ ఉత్తరాలు రాసిన మనిషి పిచ్చివాడయివుంటాడు.

"ఉత్తరాలు చదివారు కదా! ప్రస్తుతం నేనెలాంటి స్థితిలో వున్నానో మీకు అర్థమయివుంటుంది. క్రితం రోజు మధ్యాహ్నం నాకు రెండో ఉత్తరం వచ్చిన గంట తర్వాత

నాకు ఫోన్ వచ్చింది. వెళ్ళి రిసీవర్ తీసుకున్నాను. ఎవరిదో బొంగురు గొంతు వినిపించింది. 'హల్లో లావణ్యా.... ఉత్తరం అందిందా' అని అడిగాడు అతను.

నాకు అంతులేని కోపం వచ్చింది. ఫోన్లో తిట్టాను. అతను నవ్వి, 'నీ తిట్లు యెంతో అందంగా వున్నాయి. అయితే నేను యెలాంటి మనిషినో నీకు తెలీదు. మర్యాదగా నువ్వు నా కోరిక తీర్చకపోతే బలవంతంగానైనా ఎత్తుకెళ్ళి నేను నా కోరిక తీర్చుకుంటాను—అప్పుడు నీ శీలం కూడా నాశనమయ్యే అవకాశం వుంది. ఆలోచించుకో' అని ఫోన్ పెట్టేశాడు. ఇదీ జరిగింది. అతని మాటలు విన్న తర్వాత వాడెవడో అన్నంతపనీ చేసేట్టుగానే అనిపిస్తున్నాడు. ఎలాగయినా నన్ను మీరే కాపాడాలి'' అన్నది దీనంగా.

అంత అందమైన యువతి అలా దీనంగా నన్ను అడుగుతుంటే నా గుండె బాధగా మూలిగింది. వృత్తిరీత్యా నేను డిటెక్టివ్ని అయినా పర్సనల్గా నాకు లావణ్య అంటే ఓ విధమైన లైకింగ్ కలిగింది.

"మీరు భయపడకండి. మీకు ఒకటి రెండు రోజుల్లో మళ్ళీ ఇలాంటి ఉత్తరం కాని—ఫోన్కాల్గాని రావొచ్చు. ఫోన్కాల్ వస్తే ఫోటోగ్రఫీ తెలిసిన గర్ల్ ఫ్రెండ్స్ ఎవరూ లేరని, అందువల్ల ఓ లేడీ ఫోటోగ్రాఫర్ని పంపిస్తే కావలసినన్ని ఫోటోలు తీయించి పంపుతానని ధైర్యంగా చెప్పండి'' అన్నాను.

ఉలిక్కిపడింది లావణ్య.

"అతను నా మాటలు నిజమని నమ్మి నిజంగానే ఏ లేడీ ఫోటోగ్రాఫర్నో పంపిస్తే ఎలా?'' అన్నది భయంగా.

నవ్వి మనకు కావలసింది అదే. అలాగే జరిగితే

అసలు మనిషి ఎవరో పట్టుకునే అవకాశం కలుగుతుంది. మీరు కంగారు పడకండి. ఆ మనిషి తప్పకుండా పట్టుబడ తాడు. మీ అడ్రసు ఇచ్చి వెళ్ళండి" అన్నాను.

లావణ్య ఓ కాగితం మీద తన అడ్రసు రాసి యిచ్చి "మరి మీ ఫీజు" అన్నది.

"ఇప్పుడు కాదు. కేసు తేలిపోయిన తర్వాత ఫీజు నేనే అడిగి పుచ్చుకుంటాను" అన్నాను చిరునవ్వుతో.

ఆమె ధైర్యాన్ని కూడదీసుకుంటూ నాకు థాంక్స్ చెప్పి అక్కడి నించి వెళ్ళిపోయింది.

అప్పుడు నా ఎదురుగా వున్న కుషన్ ఛెయిర్ నాకంటె ఎక్కువగా బాధపడుతున్నట్టు అనిపించింది - లావణ్య వెళ్ళిపోయినందుకు.

2

ఆఫీసు - సదరన్ ట్రేడింగ్ కార్పొరేషన్.

లావణ్య టైపు చేస్తోంది. కీబోర్డు మీద ఆమె అందమైన చేతివేళ్ళు సుతారంగా నాట్యం చేస్తున్నాయి.

ఆ రోజు బాస్ రాలేదు—అందువల్లనే ఆమె యెంతో నెమ్మదిగా—తీరుబడిగా—బద్ధకంగా టైపు చేస్తోంది.

కాని—

ఇంతలోనే ప్యూను లోపలకు వచ్చి ఆమెకు ఫోన్ కాల్ వచ్చినట్టు చెప్పాడు.

ఉలిక్కిపడింది లావణ్య.

సందేహం లేదు. ష్కీ అతనే ఫోన్ చేసి వుంటాడు. ఇదెక్కడి కర్మ. అందంగా వుండటం తన దోషమా! మామూలుగా ఓ ఫోటో కావాలని రాస్తే ఐదు ఫోటోలు తన పెదవుల ముద్రలతో పంపించి వుండేది. కాని నగ్నంగా? వూహించటానికే భయంగా వుంది.

ఐనా తను భయపడకూడదు. డిటెక్టివ్ జగదీష్ చెప్పి నట్టు ధైర్యంగా ఫోన్లో మాట్లాడాలి.

రిసీవర్ తీసుకుని "హల్లో.... లావణ్యను మాట్లాడు తున్నాను" అన్నది.

అవతలి వైపు నించి బొంగురు నవ్వు వినిపించింది.

"ఇంతకీ ఏం నిర్ణయం చేసుకున్నావ్ లావణ్యా. నేనడి గిన ఫోటో తీయించావా?"

"లేదు."

"ఏం. నా మాటలు నీకు లక్ష్యం లేదా?" బొంగురు గొంతు మనిషి కోపంగా అడిగాడు.

"నువ్వు అనుకున్నది సాధించే మనిషివని నాకు అని పించింది. కాని నన్ను ఫోటో తీయగల గర్ల్‌ఫ్రెండ్స్ యెవ్వరూ నాకు లేరు. అందుకని నువ్వే ఓ లేడీ ఫోటో గ్రాఫర్ని నా దగ్గరకు పంపించు. నేను ఫోటోలు తీయించి నీకు అందజేస్తాను" అన్నది ఆమె యెలాగో ధైర్యంగా.

మళ్ళీ బొంగురు గొంతు కోపంగా మాట్లాడింది:

"లావణ్యా.... నన్ను మభ్యపెట్టడానికి ప్రయత్నించకు. నీ గర్ల్‌ఫ్రెండ్స్‌లో ఫోటోగ్రఫీ తెలిసిన వాళ్ళు ఎవ్వరూ లేరంటే నిన్ను వదిలిపెడతా ననుకున్నావా? నేనే లేడీ ఫోటోగ్రాఫర్ని నీ దగ్గరకు పంపించాలా? పిచ్చివేషాలు వెయ్యకు. మర్యాదగా ఆ ఫోటోని తీయించి వుంచు. రేపు సాయంత్రం మళ్ళీ నీకు ఫోన్ చేస్తాను."

*

లావణ్య గురించి అడిగాను ఆఫీసులోకి వెళ్ళగానే—

బాస్ గదిలో యెవతోనో ఫోన్లో మాట్లాడుతోందని తెలిపింది.

ఫోన్ కాల్ అనేసరికి నాకు ఎందుకో తప్పకుండా ఆ మనిషి దగ్గర్నించే నవిపించింది. గబగబా డోర్ని నెట్టుకుని ఆ గదిలోకి నేను నడిచేసరికి లావణ్య అప్పుడే చేతిలో వున్న రిసీవర్ని హుక్ మీద వుంచుతోంది.

ఆమె మొహాన్ని చూడగానే ఆ ఫోన్ కాల్ ఆ మనిషి దగ్గర్నించి వచ్చిందేనని తెలిసిపోయింది.

వెంటనే రిసీవర్ ఎత్తి ఎక్స్చేంజీకి ఫోన్ చేసి ఆ కాల్ యెక్కడినించి వచ్చిందో తెలుసుకున్నాను.

"ఓ పదిహేను నిముషాల్లో నేను తిరిగి వస్తాను" అని అక్కడినించి బయటపడి స్కూటరు స్టార్టు చేసి ముందుకు దూకించాను.

ఆ ఫోన్ కాల్ 'బ్యూటీ క్లినిక్ ఫర్మ్' నించి వచ్చిం దిట....

ఆ క్లినిక్ అక్కడికి దగ్గరలోనే వున్నది. అందుకే ఐదు నిముషాల్లో అక్కడికి చేరగలిగాను.

స్టాండ్ వేసి లోపలకు వెళ్ళగానే నాకు ఓ అందమైన అమ్మాయి ఎదురొచ్చి "వెల్కమ్ హాండ్సమ్" అన్నది చిరునవ్వుతో.

"సారీ మిస్.... నేను ఓ కస్టమర్గా ఇక్కడికి రాలేదు. కేవలం ఐదునిమిషాల క్రితం మీ క్లినిక్లో వున్న ఫోన్ని ఓ మనిషి వుపయోగించాడు....ఆ మనిషి ఎవరో తెలుసు కుందామని వచ్చాను" అన్నాను.

"ఇంతకీ మీరు?...."

"ప్రయివేట్ డిటెక్టివ్ జగదీష్....ఓ కేసు దర్యాప్తులో వున్నాను....చెప్పండి....ఐదు నిముషాల క్రితం మీ ఫోన్ని ఎవరు వుపయోగించారు?"

"ఓ పాతికేళ్ళ యువతి ...."

"యువతా!" ఆశ్చర్యంగా అడిగాను.

"ఎందుకలా ఆశ్చర్యపోతున్నారు?" అన్నది ఆమె.

"ఎందుకంటే ఓ మగాడి గొంతు ఫోన్‌లో వినిపించింది"

"అయితే మీరు పొరబడి వుండాలి....మరెక్కడినించో మీకు ఆ ఫోన్ కాల్ వచ్చివుండాలి....మా క్లినిక్‌కి ఈరోజు ఒక్క మగాడు కూడా రాలేదు" అన్నదామె.

"అవును .... ఎక్స్ఛేంజ్‌లో నెంబర్ పొరపాటుగా చెప్పివుంటాడు....ఇంతకీ ఐదు నిముషాల క్రితం మీ ఫోన్‌ని వుపయోగించుకున్న యువతి ఎలావుంటుంది? ఎటువైపు వెళ్ళింది?"

ఆ యువతి గురించి వర్ణించి చెప్పి యేదో టాక్సీలో వెళ్ళినట్టు చెప్పింది.

"మీ ఫోన్ ఎక్కడ వుంటుంది?"

పక్కనే వున్న ఓ గదిని చూపించింది.

ఆమెకు థాంక్స్ చెప్పి అక్కడినించి బయటపడి లావణ్యను కలుసుకున్నాను....ఆమె ఫోన్లో ఆ మనిషి చెప్పినదంతా నాకు చెప్పింది.

4

నా మనసు గాల్లో తేలిపోతోంది....యెంతో మంది అందమైన యువతుల పక్కనే—నేను ఎన్నోమార్లు విహారాలు చేశాను.

కాని—ఇప్పుడు నేను పొందుతున్న అనుభవం వాటితో పోల్చటానికి వీలులేనిది.

లావణ్యతో నడుస్తున్నాను.

ఆమె భుజం నా భుజానికి రాసుకుంటోంది. ఆమె

నెమ్మదిగా నా ఒక్కడికే వినిపించేలా తన కథ చెబుతోంది.

ఆమె పేదకుటుంబంలో పుట్టిందిట.

ఐనా సిరిసంపదలమీద ఆశ లేదుట....తన మనసుకు నచ్చిన మనిషినే తను కోరుకుంటుందిట.

ఇలా చెబుతోంది—

అన్నీ వింటున్నాను....

రోడ్లు రద్దీగా వున్నాయి. ఎదురుగావస్తున్న మనుషులను తప్పుకుంటూ నడుస్తున్నాము.

ఇంతలో హఠాత్తుగా మా పక్కనే ఓ తెల్లని ఎంబాసిడర్ కారు వచ్చి ఆగింది. డ్రయివింగ్ సీట్లో నీట్‌గా ఆధునికంగా అలంకరించుకున్న ఓ మనిషి వున్నాడు.

అతను "వెరీ నైస్....అయితే ఇతన్ని మ్యారేజ్ చేసుకున్నావా? గుడ్... కంగ్రాచ్యులేషన్స్" అన్నాడు లావణ్యను ఉద్దేశించి.

ఆమె క్షణకాలం అతనికేసి అదోలా చూసి మళ్ళీ ముందుకు కదిలింది.

అతను ఓ నిట్టూర్పు విడిచి కారును ముందుకు పోనిచ్చాడు.

నాకు ఆశ్చర్యం కలిగి "ఎవరతను?...." అనడిగాను

"ఓ కోటీశ్వరుడి కొడుకు....నా అందం అతడిని పిచ్చివాడిని చేసిందిట....నన్ను పెళ్ళి చేసుకుంటానని వెంటపడ్డాడు. నేను ఒప్పుకోలేదు" చెప్పింది.

"మైగాడ్....ఇప్పుడు మీకు ఉత్తరాలు రాసి ఫోన్లో బెదిరిస్తున్న మనిషి ఇతను కాదుగదా....ఇంతకీ అతనికి

మీకు పరిచయం ఎలా జరిగింది?"

చెప్పింది లావణ్య.

మర్నాడు—డిటెక్టివ్ జగదీష్ కల్పన అనే యువతిని వెంబడించి, ఆమె లావణ్యను ఫోన్‌లో బెదిరిస్తుండగా రెడ్‌హాండెడ్‌గా పట్టుకున్నాడు. అవమానభారంతో బుస కొట్టిన త్రాచుపాములా జగదీష్‌ను చూసింది

"కోపగించకు కల్పనా.... తెలివితేటలు నీకే కాదు ... అందరికీ వుంటాయి. పెళ్ళిచూపుల్లో నిన్ను కాదని నీ పక్కనే వున్న యీ లావణ్యను చేసుకుంటానని ఆ కోటీశ్వరుడి కొడుకు పట్టుబట్టినందుకు నువ్వు ఆమె అందం మీద పగబట్టావు ఎలాగయినా ఆమెను నవ్వులపాలు చేసి నీ కసి తీర్చుకోవాలని ఆమె నగ్నఫోటో కావాలని బెదిరింపు ఉత్తరాలు రాశావు. గొంతు మార్చి ఫోన్లో మాట్లాడావు.

బ్యూటీ క్లినిక్‌నించి వచ్చిన ఫోన్‌కాల్ ఓ యువతి మాట్లాడిందని చెప్పినప్పుడే నాకు అనుమానం వచ్చింది. తర్వాత ఆ కోటీశ్వరుడి కొడుకు కార్లో కనిపించినప్పుడు నేను అతన్ని గురించి అడిగాను. అప్పుడు ఆమె అసలు కథంతా చెప్పింది. అప్పుడు యీ నాటకం ఆడుతున్న మనిషివి నువ్వే అని అనుమానించాను.

అందుకే ఈ రోజు నిన్ను వెంబడించి రెడ్‌హాండెడ్‌గా పట్టుకొన్నాను. ఇప్పుడు నిన్ను పోలీసులకు అప్పగిస్తే నీ బ్రతుకేమవుతుందో ఆలోచించు. ఒకరిపై ఈర్ష్య చెందటం ఆరోగ్యానికి అంత మంచిది కాదు—" మందలింపుగా అన్నాడు డిటెక్టివ్ జగదీష్.

మరుక్షణం కల్పన ఏడుస్తూ అతని కాళ్ళను చుట్టుకు పోయింది. □

ముష్టివాడు-దొంగనోట్లు

సరసి

ఆ రోజు మహా పర్వదినం. తండోపతండాలుగా శ్రీ రామలింగేశ్వరుడి దర్శనం చేసుకుని వెళ్ళేవాళ్ళు, వచ్చే వాళ్ళు. దారి పొడుగునా ఇరువేపులా ముష్టివాళ్ళు. ధర్మం కోసం అరుపులు - కోలాహలంగా వుంది.

గంటసేపు వరసలో నిలబడితేగాని రామానికి దైవ

దర్శనం కాలేను. ప్రసాదం పుచ్చుకుని మెట్లు దిగుతూ వస్తున్నాడు.

"ధర్మం. ఒక్క ఐదు పైసలు ధర్మం చెయ్యి బాబూ" రకరకాల గొంతులు. కొందరు ఏడుస్తున్నట్లు జాలిగా అరుస్తున్నారు. రామం ఎవ్వరికీ ఒక్క పైసా కూడా వెయ్యకుండా మెట్లు దిగుతూ వస్తున్నాడు. ముష్టివాళ్ళకు అన్నం గాని, బట్టలు గాని ధర్మం చెయ్యాలిగాని, డబ్బి లిస్తే చీకటి పడ్డాక తాగి తందనాలాడతారని అతని నమ్మకం.

ఒక ముష్టివాడు రామం కాళ్ళు పట్టుకుని బతిమాలు తున్నాడు. వాడ్ని విదిలించుకుంటూ అసహనంగా వాడి వైపు చూశాడు రామం.

అంతే! నిశ్చేష్టు డయ్యాడు. వాడే! నల్లగా బలిష్టంగా కాలు మోకాలువరకూ తెగిపోయి. చెంపల మీద గెడ్డం కింద ప్రపంచపటంలాగా తెల్లటి మచ్చలు! అనుమానం లేదు. వాడే.

ఒక్కసారి అతనిలో రక్తం వేడెక్కిపోయింది. ఆవేశం అదుపు తప్పింది.

"బాస్టర్డ్. నీ ప్రాణం తీస్తా!" ముందు కురికి వాడి చిరుగు బనీను పట్టుకున్నాడు. ఆ క్షణంలో వాడి అసహ్య కరమైన బట్టలు, మురికి వొళ్ళు, వాసన ఏం గుర్తుకు రాలేదు.

ఈ హఠాత్పరిణామానకి అదిరిపడ్డాడు ఆ యాచకుడు.

"రాస్కెల్! నాకే టోకరా వేస్తావ్రా? నీ ముఠా అంతా ఎక్కడుందో చెప్పు. చెప్పురా చెప్పు.... చెప్పు..." వాడ్ని చేతులతోటి ఇష్టం వచ్చినట్లు బాదసాగాడు.

"బాబూ....బాబూ...." వాడి ఆర్తనాదాలు. వాడితోటి

ముష్టివాళ్ళు పరుగెత్తుకు వచ్చారు. అంతా కలిపి కర్రలతో, గిన్నెలతో చేత కందిన వాటితో రామం మీద దాడిచేసి, దొరికిన చోటల్లా చితకబాదేరు. తొక్కేసారు కాళ్ళతో. ఈ బాధలన్నీ స్పృహ పోయేవరకూ మాత్రమే గుర్తున్నాయి అతనికి.

2

రూప సాయంతో బెడ్ మీద లేచి కూర్చున్నాడు. తలకి, చేతులికి బ్యాండేజీలు. ఒళ్ళంతా నొప్పులు. వీపుకి వెనకాల తలగడా ఆసరాగా పెట్టి మోకాళ్ళ మీద దుప్పటి సరిచేసి వేడికాఫీ అందించింది రూప.

ఆమె కళ్ళు ఉబ్బి వున్నాయి. ఏడ్చినట్టుంది బాగా. ఆమెకి తెలుసు ఆ ముష్టివాడిమీద అతను దాడి చేయడానికి కారణం. నోరు మెదిపితే బావురుమనేలా వుంది. అందుకే మౌనంగా వున్నాడు రామం.

సరిగ్గా క్రితం నెల మూడో ఒకటో తేదీ. రాత్రి బాగా పొద్దుపోయింది ఆఫీసులోనే ఆ రోజు వరకు ఆ నెల మొత్తం అకౌంట్సు అప్ టు డేట్ చేసిగాని కదలడానికి వీలులేకపోయింది రామానికి. ఆ రోజే పే డే. మొత్తం రెండువేల నాలుగొందలు కవర్లో పెట్టి జేబులో పెట్టుకుని స్కూటర్ స్టార్టు చేశాడు.

చర్చిరోడ్డు వచ్చేసరికి స్పీడు తగ్గించాడు. రోడ్డసలు బాగాలేదు. అన్నీ గతుకులు. సాధారణంగా జనసంచారం తక్కువగా వుంటుందా రూట్‌లో. ముందూ వెనకా వాహనాలు కూడా ఏం లేవు.

కొంచెం దూరంలో యెవరో లైట్ వేసి సిగరెట్టో చుట్టో వెలిగించుకుని ఆర్పేశారు. అంతా చీకటి. డిమ్ముగా వున్న స్కూటర్ లైట్ వెలుగులో మసకగా కనిపిం

చింది—యెవరో ఒక మనిషి పది అడుగుల దూరంలో నిల బడివున్నట్టు.

స్కూటర్ రైజ్‌చేసి పక్కనించి పోనిద్దామనుకునే లోగా 'ఠప్' మని పెద్ద శబ్దం. రోడ్డు దాటబోయిన ఆ మనిషి 'అబ్బా' అని ఓ చావుకేక పెట్టి రెండు గజాల దూరంలో పడ్డాడు. రామం కూడా బోర్లాపడ్డాడు స్కూటర్‌కి అవతలి వైపున.

"చచ్చిపోయాను బాబో" అంటూ గిలగిల కొట్టుకోవడం ప్రారంభించాడు. ఆ అరుపులు విని నలుగురు మనుషులు పరిగెత్తుకొచ్చి వాణ్ణి లేవదీశారు. రామం కూడ శక్తి కూడ గట్టుకుని లేచి పరిగేత్తాడు అతని దగ్గరికి.

జేబులోంచి లైటర్ తీసి వెలిగించాడు. గుండె ఆగి నంత పనైంది. రక్తంమడుగు! విలవిల్లాడిపోతున్నాడు. కేకలు "చచ్చిపోయా" నంటూ.

వాళ్ళంతా ఆత్రంగా చేతుల కింద చెయ్యివేసి అతన్ని కూర్చోబెట్టి గాయాలు చూస్తున్నారు. ఒకతను కాళ్ళు సరి చేసి కాలు మడత తీయబోయాడు. అంతే! ఒళ్ళు కంపర మెత్తిపోయింది రామానికి. మోకాలు తర్వాత కాలులేదు. మొండికాలు రక్తం ముద్దలా వేళాడుతోంది.

వాళ్ళ ఆవేశం కట్టలు తెంచుకుంది. అందులో ఒకడు రామం కాలరు పుచ్చుకున్నాడు.

"ఒరేయ్ కళ్లు మూసుకుని నడుపుతావురా బండి? వాడి జీవితం నాశనం చేశావురా!" అంటూ పెడీమని డొక్కలో తన్నేడు.

పేగులు కదిలినట్టయింది రామానికి. మరొకపక్క గాయం తగిలినవాడి గురించి భయం ఏమవుతాడోనని. అత నికి నోట మాట రావడంలేదు. నాలిక పిడచకట్టుకు

పోయింది. కాళ్లూ చేతులూ దడ.

మరొకడొచ్చి రామాన్ని తన్నుతున్నవాణ్ణి పట్టుకుని వాడికి సర్దిచెప్పాడు.

"సచ్చిపోతాడు బాబూ ఆడింక కొద్ది ఛనాల్లో. కాలు తెగి నజ్జు నజ్జు అయిపోయింది. పైగా ముందుచక్రం గుండెల్ని తాకింది."

"ఈడు మా పేటలో వోడే. ఈడుగాని పోయినాడా నీ అంతుజూస్తా నాయాలా. చుక్కేసుకునిగాని తోల్తన్నావేటి నాయాల్ది బండి?" గుడ్లురుముతూ ఒకడు ముందుకొచ్చాడు. "నడు నీ సంగతి ముందు పోలీట్టేషన్లో తేలుస్తా."

"నువుండెహే సన్నాసెదవా. ముందు రిచ్చా తీస్కరా ఆసపటాల్కి తీసుకుపోదాం. ఆపైన బగమంతుడున్నాడు."

ఇంతవరకు దెబ్బతిన్నవాడి చావు బతుకుల గురించి భయపడిన రామానికి యిపుడు "పోలీసు" అనే మాట వినేసరికి వున్న ధైర్యం కాస్తా సడలిపోయింది. ఎలాగైనా ఈ వ్యవహారం నుంచి కేసు లేకుండా తప్పుకోవాలనిపించింది.

"బాబూ ముందాడికి వైజ్జం చేయిస్తేగాని బతికేదీ లేందీ చెప్పలేం. నాలుగైదు వేలన్నా లెందే కాదు...."

వాడిమాట కడ్డొచ్చి రామం "ఇవిగో రెండువేలు. ఇంక నా దగ్గిర ఒక్కపైస లేదు. ముందు వైద్యం సంగతి చూడండి. పోలీసులూ కేసులూ వాడికి ప్రాణం పొయ్యేవు" అంటూ జేబులోంచి కవరు తియ్యబోతుండగా మొత్తం కవరు లాక్కున్నా డొకడు. డబ్బు పోతే పోయింది యెలాగైనా తొందరగా బైటపడితే చాలని వుంది రామానికి.

వాడే స్కూటర్ లేవదీపి యిచ్చాడు. స్టార్టుచేసి ఎక్కి బ్రతుకుజీవుడా అనుకున్నాడు రామం. "రెండువేల నాలుగొందలు!! పోతేపోయాయిగాని పోలీసులూ కోర్టులూ తప్పేయి!" వెనక్కి చూడకుండా ఇంటి ముఖం పట్టేడు.

వారం రోజుల తర్వాత—

ఓ అర్ధరాత్రి. ఎవరో ఆదరాబాదరాగా తలుపు తడుతున్నారు.

"పోలీసులు కాదు కదా" అనుకుంటూ భయపడుతూనే తలుపు తీశాడు రామం.

చంద్రమౌళి. ఊపిరి పీల్చుకున్నాడు రామం. అతని స్నేహితుడు చంద్రమౌళి.

"అర్జంటుగా ఓ వెయ్యి రూపాయలు కావాలి! ఎందుకని అడగొద్దు దయచేసి. తర్వాత చెబుతాను వివరంగా" అన్నాడు చంద్రమౌళి. సందేహాలతో సమయం వృధా కావడం యిష్టంలేనట్లు.

డబ్బు చేతిలో పెడుతూ అతని మొహంలోని అశాంతిని గుర్తించి రామం "ఒరే మౌళీ! కారణం అడగొద్దని ఆంక్ష పెట్టావు....నీ కేదైనా సమస్య వుంటే పంచుకోడానికో మిత్రుడున్నాడని మాత్రం మరచిపోకు" అన్నాడు.

మౌళి కళ్ళల్లో నీళ్లు తిరిగేయి. "నీకన్నా నాకు ఆప్తులెవర్రా? అందుకే నీ దగ్గిరికి యింత రాత్రైనా రాగలిగేను. సమస్యేం లేదు. అర్జంటుగా ఓ మనిషికి డబ్బివ్వాల్సొచ్చింది. ఇంటి దగ్గిర కూర్చోబెట్టి వచ్చాను—అంతే" అంటూ స్కూటర్ స్టార్టుచేసి వేగంగా వెళ్ళిపోయాడు.

మర్నాడు సాయంత్రం డబ్బు తిరిగి యివ్వడానికొచ్చి జరిగిందంతా పూసగుచ్చినట్టు చెప్పేడు చంద్రమౌళి.

షాక్ తిన్నాడు రామం! అచ్చం తనకి జరిగినట్టే జరిగింది ఓ మనిషి స్కూటర్‌కి అడ్డుపడడం, కాలు విరిగి కొట్టుకోడం, వాళ్ళు డబ్బుకోసం వత్తిడి చేస్తే జేబులో లేకపోవడంవల్ల వాళ్ళలో ఒక మనిషి కూడా ఇంటి కొచ్చి మొత్తం వున్నదంతా ఊడ్చుకొని సుమారు నాలుగు వేల దాకా పట్టుకుపోయాడట.

ఇదంతా ఒక ప్లానని, వాళ్ళ ఒక ముఠా అని, యిలా తరచుగా జనసంచారం తక్కువగా వున్న రోడ్లని కాపి డబ్బు పిండుకుంటున్నారని కనిపెట్టడానికి వాళ్ల కెంతో సేపు పట్టలేదు.

పైగా రెండు సంఘటనల్లోనూ కాలు విరిగిన మనిషి ఒకడే. చెంపలమీద, గెడ్డం కింద మచ్చలు—వాణ్ణి చీకటిలో కూడ గుర్తు పట్టేలా చేస్తాయి.

"పోలీస్ రిపోర్టిద్దాం" అన్నాడు మౌళి.

"అంతకన్న కొరివితో తల గోక్కోడం బెటరు. ఎందుకంటే యాక్సిడెంట్ కేసునుంచి తప్పించుకోడం కోసం వెంటనే పోలీస్ రిపోర్టు యివ్వలేదు. మన అదృష్టం బావుండి యిదంతా ఒక ముఠా చేస్తున్న పని అని తేల్తే ఫరవాలేదు. లేకపోతే యాక్సిడెంట్ కేసులో మన వుచ్చు మనం బిగుసుకున్నట్టే. అదీగాక పోలీసులు ఆ దుండగుల్ని పట్టుకుని, పోయిన మన డబ్బు పువ్వుల్లో పెట్టి తెచ్చి ఇస్తారంటే నమ్మడానికి నేనేం చెవిలో పువ్వులు పెట్టుకొనిలేను. కాబట్టి మనంతట మనం ఏవన్నా చెయ్యగలిగితే చెయ్యడం. లేకుంటే ఓ పావలా నువ్వులు కొనుక్కొచ్చి మన డబ్బుకి నీళ్ళొదులుకోడం ఉత్తమం" అన్నాడు రామం.

మౌళి మరి మాట్లాడలేదు. జేబులోంచి పదిహేను పైసలు తీసి రామం చేతిలోపెట్టి "ఇదిగో నా వంతు పది

హేను పైసలు" అన్నాడు.

గొల్లుమని నవ్వుకున్నా రిద్దరూ ఒక్కసారి—

"బావా దయజేసి వాళ్ళ గురించి యింక ఆలోచించకు. రెండువేలు పోతే పోయాయి. ఈ గాయాలు మానేదాకా నాకు మనశ్శాంతి లేదు. దయజేసి మళ్ళీ కొత్త సమస్యలు సృష్టించకు ప్లీజ్" అంది రూప రామం మొహం మీది చెమటని తుడుస్తూ.

రామం ఆలోచనల్లోంచి తేరుకొని యీ లోకంలోకి వచ్చాడు.

"ఏరా డింభకా! ఏదో సాహసం చేశావట?" వస్తూనే పలకరించాడు రామం మేనమామ కొడుకు హరి.

హరిని చూడగానే రూప మొహం వికసించింది. మంచి నీళ్ళిచ్చి తర్వాత ఫ్లాస్కులోంచి కప్పులో కాఫీ పోసి యిచ్చింది.

"నిన్న రాత్రి రూప ఫోన్ చేసి సంగతంతా చెప్పింది. ఊఁ.... నువ్వింత పోటుగాడివని తెలిస్తే, మా పోలీస్ డిపార్ట్‌మెంట్‌కి నిన్నెపుడో రికమండ్ చేసుండేవాడ్ని."

"ఒరే, మీ పోలీసులకీ నీకూ జీవితాంతం ఋణపడి వుంటాను. ఆ పని మాత్రం చేయకు. నన్నిలా వుండనీ చాలు."

"లేకపోతే ఏవిట్రా? నిన్ను మోసగించిన సంగతి కనీసం మాటవరసకైనా నాకు రాశావా? ఇప్పుడు చూడు నువ్వు ఒద్దన్నా నేనే నీ కేసు టేకప్ చెయ్యవలసి వస్తోంది."

రామం ఆశ్చర్యంగా చూశాడు హరి వంక.

"ఆశ్చర్య పడకు. రూప నాకు ఈ దుర్ఘటనపై కంప్లయింట్ చేసింది. రెండో కారణం ఏమిటంటే నన్నిక్క-

డికి సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా ప్రమోషన్ మీద ట్రాన్స్‌ఫర్ చెయ్యడం ”

ఒక్క క్షణం నిశ్శబ్దం. రూప, రామం ఆశ్చర్యం నుంచి తేరుకుని ఒక్కసారిద్దరూ “కంగ్రాచ్యులేషన్స్” అన్నారు. రూప ఆనందానికైతే అవధుల్లేవు.

“అన్నయ్యా, అయామ్ వెరీ హాపీ నువ్వీ కేసు టేకప్ చేస్తున్నావంటే. అందులోనూ ఇక్కడే నీ పోస్టింగ్ అంటే నాకు చాలా రిలీఫ్‌గా వుంది.”

“ముందొక విషయం. అయ్యా రామంగారూ! తమ రింక ఇటువంటి ముష్టి యుద్ధాలు చెయ్యనని మా చెల్లాయికి ప్రామిస్ చెయ్యాలి. అప్పుడుగాని నేను రంగంలోకి దిగ లేను” అన్నాడు హరి నవ్వుతూ.

రామం నవ్వబోయి మెడ దగ్గిర నరం పట్టినట్టనిపించి విరమించుకున్నాడు.

“సరే. అసలు విషయానికొద్దాం. నిన్న నువు చేసిన హడావుడికి ఆ ముష్టాడు మరో వారం దాకా ఆ గుడి చాయలకి రాడు సరికదా, ఆ ముఠా వాళ్ళకి కూడా చెప్పి హెచ్చరిస్తాడు. వాళ్ళు కూడా కొంతకాలం అజ్ఞాతవాసం చేస్తారు. అది కూడా మంచిదే. నేను వచ్చి ఛార్జి తీసుకో డానికింకా నాల్రోజులు ఎలాగూ పడుతుంది. ఆ తర్వాత కథ వెండి తెరమీద! ఓ.కే.?”

“ఓ.కే.”

3

“ట్రింగ్ .... ట్రింగ్ ....”

“హలో .... రామం దిస్ సైడ్.”

“హలో రామం! హరిని మాట్లాడుతున్నాను. ఓసారి సుందర్రావు పేట తూము దగ్గిరికి వెంటనే రాగలవా?”

"వస్తాను. దేనికి?"

"ఇక్కడో శవం దొరికింది. ఒక కాలు కూడా లేదు. నువ్వోసారి వచ్చి చూస్తే గుర్తు పట్టగలవేమోనని."

"ఇదిగో. పది నిమిషాల్లో అక్కడుంటా."

హడావుడిగా టేబిల్‌మీద పేపర్లు సర్ది బాస్ పర్మిషన్ తీసుకుని బయల్దేరాడు రామం.

"ఎగ్జాక్ట్లీ! వాడే వీడు!" రామం గుర్తు పట్టేడు. అప్పటికే శవం పాడైపోయింది. పైగా ఒంటినిండా మట్టి. మొహం మీద మచ్చలు మాత్రం స్పష్టంగా కనిపిస్తున్నాయి.

"శవాన్ని పాతిపెట్టేసి కనబడకుండా పైన మట్టి, ఆకులు. చెత్త కప్పేశారు కాకులు, కుక్కలు గుంపుగా చేరడంతో ఇక్కడ పనిచేసే వాళ్ళు మాకు కబురుచేశారు" వివరించేడు హరి.

ఫోటోగ్రాఫరు అన్ని కోణాల నించి ఫోటోలు తీసుకున్నాక శవాన్ని పోస్టుమార్టానికి పంపే ఏర్పాట్లు చేశాడు హరి.

"నేనా రోజు వీడిని గుర్తుపట్టేనని తెలిసి ఆచూకీ తెలియకుండా వీడిని చంపెయ్యలేదు కదా వాళ్ళు?"

"ఏమో చెప్పలేం. ఐనా మొదటినించీ వీడు కుంటివాడని నా నమ్మకం. ప్రమాదవశాత్తూ ఏ యాక్సిడెంట్లోనో కాలు పోయివుండాలి. వీడి కాలుకి రంగు పూసి రోజూ ఈ నాటకం ఆడి డబ్బు గుంజుతూ వుండొచ్చు. అలా రోజూ సంపాదించిపెట్టే బంగారు బాతుని వాళ్ళు చేజేతులా వాళ్ళే చంపివుంటారని నేననుకోను. కాని అవసరం వస్తే వాళ్ళ ఉనికి కాపాడుకోడం కోసం అంత పని చెయ్యడానికి కూడా వెనుకాడరు. కానీ.... రేపీపాటికి

ఏ విషయం రిపోర్టులో తెలుస్తుందిగా. సరే నువ్వెళ్ళు. రేపు ఏ విషయం నేనే చెప్తాలే!"

4

స్టేషన్‌లోకి వస్తూనే హేట్, చేతికర్ర టేబిల్‌మీదకు విసరి వాష్ బేసిన్ దగ్గర కెళ్ళి మొహం చన్నీళ్ళతో కడుక్కొని కాస్త రిలీఫ్ ఫీలయ్యాడు హరి. టవల్‌తో మొహం తుడుచుకుంటూ వచ్చి ఫ్యాన్ స్పీడు పెంచి కుర్చీలో కూలబడ్డాడు.

శివాలయం వద్ద హతుడి గురించి ఎంక్వయిరీ చెయ్యగా పేరు పల్లిగాడని తెలిసింది. నాలుగైదు రోజుల్నించి కనిపించడంలేదని, అసలు వాడు సరిగ్గా ఎక్కడుండేదీ కూడ తెలియదని చెప్పేరు గుడి దగ్గరి యాచకులు. వాళ్ళేమన్నా దాస్తున్నారేమోనని బెదిరించి కూడా చూశాడు గాని, అంతకంటే వాళ్ళ నుంచి సమాచారం దొరకలేదు.

తల పట్టుకుని ఆలోచిస్తూ కూర్చున్నాడు.

ఫోన్ మోగింది. ఆలోచనలకు ఆనకట్ట పడింది.

"హలో....యస్. హరి స్పీకింగ్. ఓ.కే. ఐదు నిమిషాలు!!" ఒక్క ఉదుటన కుర్చీలోంచి లేచి నలుగురు కానిస్టేబిల్స్‌ని వెంటబెట్టుకొని జీపువైపు పరుగుతీశాడు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ హరి.

బ్యాంక్ దగ్గర కోలాహలంగా వుంది. పోలీసులు జీపులోంచి ఉరికి బ్యాంకు లోపలికి పరుగుతీశారు. సెక్యూరిటీ గార్డులు ఓ వ్యక్తిని పెడరెక్కలు విరిచి పట్టుకున్నారు. బ్యాంకు స్టాఫ్, కస్టమర్స్ వాళ్ళ పనులు మానేసి గుంపుగా మూగేరు.

పోలీసులు ఆ వ్యక్తిని కస్టడీలోకి తీసుకున్నాక బ్యాంక్ మానేజర్ జరిగినదంతా ఇన్స్పెక్టర్‌కి వివరించి చెప్పేడు.

కొద్ది రోజుల క్రితం ఆ వ్యక్తి ఎకౌంట్ ఓపెన్ చేశాడట వాళ్ళ బ్రాంచిలో. అప్పుడప్పుడు చిన్న చిన్న మొత్తాలు డిపాజిట్ చేసి తీసుకుంటూ వుండేవాడు. ఆ రోజు ఆరు వేలు డిపాజిట్ చేయడానికి వొచ్చాడు. తీరా కౌంటర్‌లో పరీక్షిస్తే అవి దొంగనోట్లు అని తెలిసింది.

కౌంటర్ క్లర్కు తెలివిగా ఈ విషయం మేనేజర్‌కి తెలియపరచి సెక్యూరిటీ గార్డుల సాయంతో అతన్ని పట్టుకోబోతే ఆ వ్యక్తి కంగారుపడి తప్పించుకోబోయాడట. కొంతమంది కస్టమర్లు కూడ అతన్ని పట్టుకోబోవడం అతను కత్తితో ఒకర్ని గాయపరచడం జరిగిందిట. గాయపడిన వ్యక్తిని వెంటనే హాస్పిటల్‌కి పంపించి పోలీస్ స్టేషన్‌కి ఫోన్ చేశాడు బ్యాంకు మానేజర్.

"తను తెచ్చినవి దొంగనోట్లని మేము చెప్పేదాకా అతనికి తెలియదు. అతనికి ఎక్కడివించి అవి వచ్చేయో అతను చెప్పడంలేదు" అన్నాడు మేనేజర్.

"అతనికి దొంగనోట్లని తెలియకపోవడంవల్లనే బ్యాంకు కొచ్చి మనకు దొరికేడు. ఎనీవే. మీరు మా పని సుగమం చేశారు. మీ సిబ్బంది చాకచక్యాన్ని నిజంగా అభినందిస్తున్నాను" అని వాళ్ళందరికీ థాంక్స్ చెప్పి వెళ్ళిపోయాడు హరి.

5

"రారా నీ కోసమే చూస్తున్నా" స్టేషన్‌లో అడుగు పెడుతున్న రామాన్ని ఆహ్వానిస్తూ అన్నాడు హరి.

"రిపోర్టు వచ్చిందా?"

"ఆ: యాక్సిడెంటట. హత్య కాదన్నాడు. ఛాతీలో ఎముకలు పూర్తిగా విరిగిపోయాయట. చనిపోయి నాల్గు

రోజులైందన్నాడు. మనం అనుకున్నట్టు కాలు యిప్పుడు విరిగింది కాదట. అంతకు ముందే కొన్నేళ్ళ క్రితమే విరిగిపోయిందని చెప్పేరు డాక్టరు. నా ఉద్దేశం ప్రకారం...."

"అరె! వీడే! వీడేరే హరీ!" రామం ఒక్కసారి కుర్చీలోంచి లేచి గావుకేకలు పెట్టాడు అప్రయత్నంగా.

నలుగురు కానిస్టేబిల్స్ ఒక ఖైదీని సెల్‌పైపు తీసు కెడుతున్నారు.

హరి మొహం చిట్లించేడు. "ఏవిటి? సరిగ్గా చెప్పు?"

"ఆ రోజు యాక్సిడెంట్ రోజున....డబ్బు లాక్కుంది వీడే....ఆ ముఠాలోవాడే వీడు!"

"ఈజిట్? యింతవరకూ యింటరాగేషన్‌లో అన్ని రకాలుగానూ ప్రయత్నించాను వివరాలకోసం. పేరు తప్పితే యింకేం చెప్పలేదు. గుడ్‌గాడ్! నువ్వు వాడ్ని చూడ్డం మంచిదయింది. పేరు చెంగయ్య అని చెప్పాడు."

అని ఇన్‌స్పెక్టర్ చెంగయ్యని మళ్ళీ ఇంటరాగేట్ చేశాడు. దారి కాపి యాక్సిడెంట్ పేరుతో డబ్బులు గుంజు తున్న సంగతి, రెండు మూడు సంఘటనలు చెప్పేసరికి వాడి కింక నిజం చెప్పక తప్పలేదు. దానితోబాటు దొంగనోట్లు ఎలా వచ్చింది కూడ బైటపెట్టేడు.

ఎర్ర చెరువు రోడ్డులో, అర్ధరాత్రి ఎదురుగా వచ్చే ఓ స్కూటర్‌కి అడ్డుపడ్డాడు పల్లిగాడు రివాజుగా. యధా ప్రకారం మిగిలినవాళ్ళంతా హడావుడి చేశారు పరిగెట్టు కొచ్చి. దెబ్బ తగలకుండా స్కూటర్‌కి అడ్డుపడడంలో ఎంత నిష్ణాతుడైనప్పటికి అదృష్టం వక్రించినందువల్ల పల్లిగాడి ప్రాణాలు నిజంగానే గాలిలో కలిసిపోయాయి.

స్కూటర్ మనిషిని బెదిరించినా ప్రయోజనం లేక

పోయింది. డబ్బు లేదన్నాడు. అనుమానం వచ్చి రెండు తన్ని బ్రీఫ్‌కేసు తీసి, కాగితం కింద వున్న ఆరు పది రూపాయల కట్టల్ని లాక్కున్నారు.

తర్వాత స్కూటర్ స్టార్టు కాలేదు. నడిపించుకుంటూ వెళ్ళిపోయాడు స్కూటర్‌వాలా.

అతను వెళ్ళిన తర్వాత గాని వాళ్ళకు తెలియలేదు పల్లి గాడు చచ్చిపోయినట్టు. వాడు ప్రతీసారిలాగే ఈసారి కూడా చావు అరుపులు అరిచి విలవిల్లాడిపోతూ మెడ వాల్చేసినపుడు—అదంతా వాడి నటనాకౌశలం అనుకున్నారే తప్ప వాళ్ళు అది నిజం అని అస లూహించలేదు.

తీరా యిప్పుడు సంగతి గ్రహించి గతుక్కుమన్నారు.

శవాన్ని గుట్టుచప్పుడు కాకుండా దూరంగా ఈడ్చుకుపోయి అక్కడే కప్పేశారు.

ఆ తర్వాత బ్యాంకు కెళ్ళినపుడు దొంగనోట్లని తెలిపి అంతా కలిసి చెంగయ్యని పట్టుకోవడం జరిగింది.

"ఆ స్కూటర్ మనిషిని గుర్తుపట్టగలవా?"

"కష్టం."

"పోనీ స్కూటర్ నంబర్ గాని, కలర్ గాని చెప్పగలవా?"

"నంబర్ తెలియదు. కలర్ నీలం కావచ్చు."

చెంగయ్యకి కూడా ఎలాగైనా ఆ స్కూటర్‌వాలాని పోలీసులకి పట్టించాలనే వుంది. దొంగనోట్లిచ్చి మోసం చేసి తను దొరికిపోవడానికి కారణం అతడేనని చెంగయ్యకి కోపంగా వుంది. అతన్ని పట్టిస్తే హత్యా నేరంలో కూడ కొంత భాగం అతనికి పంచవచ్చని అతని ఊహ.

6

ఫోర్టు రోడ్‌లో ఒక పెద్ద భవనం చుట్టూ అన్నీ పెద్ద పెద్ద మేడలే. అది పూర్తిగా ధనవంతులుండే ప్రదేశం.

రాత్రి పదకొండయ్యింది.

ఓ ఫియట్ కారు వచ్చి ఆ భవనం ముందాగింది. గూర్ఖా గేటు తెరవగానే భవనంలోంచి ఒక వ్యక్తి వచ్చి కారులో దిగిన వ్యక్తిని రిసీవ్ చేసుకుని లోపలకు తీసుకెళ్ళాడు. కారు వెళ్ళిపోయింది.

"నా పేరు జాఫర్" అన్నాడు కారు దిగిన వ్యక్తి. కళ్ళకి కళ్ళద్దాలు. బలిష్టంగా వున్నాడు.

"తెలుసు. రాజారావు చెప్పేడు ఫోనులో. విషయం తెలుసనుకుంటాను. అయినా చెప్తాను. నా పేరు సుదర్శనం. నా దగ్గరొక ఇంపోర్టెడ్ కరెన్సీ ప్రింటింగ్ మెషీన్ వుంది. కొద్ది రోజులుగా అది పనిచేయటం లేదు. ఇదివరలో ఓసారి పాడైనప్పుడు రాజారావే స్వయంగా వచ్చి బాగుచేశాడు. ఈసారి తనకి ఒంట్లో బాగులేదని నిన్ను పంపిస్తున్నానని చెప్పేడు. ఈ పని చాలా రహస్యం" అన్నాడు సుదర్శనం. అతడా యింటి యజమాని.

"నా గురించి రాజారావు చెప్పలేదా? నేను అందరిలా రోజూ పనిచేసే మెకానిక్‌ని కాదు. దేశంలో ప్రైవేట్ కరెన్సీ ప్రింటింగ్ మెషీన్స్ ఎన్నో బాగుచేశాను. రహస్యాలు పనిగట్టుకుని బయటపెట్టే ఖర్మ నాకు పట్టలేదు. నాకు కావాల్సింది నా వాటా: దట్సాల్!" అన్నాడు సిగరెట్ నిర్లక్ష్యంగా యాష్‌ట్రేలో దులుపుతూ.

"ఓకే. నాకు నమ్మకం వుంది. నీ సామర్థ్యం చూపించు. అనుకున్నదానికంటే పదివేలెక్కువిస్తాను. పద లొకేషన్‌కెళదాం" అంటూ లేచాడు సుదర్శనం.

జాఫర్ కళ్ళకి గంతలు కట్టబడ్డాయి. కారులో అతని ప్రక్కనే కూర్చున్నాడు సుదర్శనం.

కారు ముందు కురికింది చీకట్లో.

ఆ భవనానికి ఎదురుగా కొంచెం దూరంలో వెలగని ఒక లైటు స్తంభం నీడలో అంతవరకూ నిరీక్షిస్తున్న ఓ ఆకారం స్కూటర్ స్టార్టుచేసి, లైట్లు వెయ్యకుండా ఆ కారుని వెంబడించసాగింది.

పావుగంట తర్వాత జాఫర్ కళ్ళగంతలు విప్పేడు.

అతను కొంచెంసేపు కళ్ళు నులుముకుని చూశాడు. ఎదురుగా ఒక చిన్న ప్రింటింగ్ మెషీన్ ఒక టేబిల్‌కి ఫిక్సు చేయబడి వుంది. పూర్తిగా ఆధునికంగా వుంది. చుట్టూ పేపర్సు, ఇంకులు యింకా కొన్ని సామాన్లు వున్నాయి.

ఆ గదినీ, వాతావరణాన్ని ఓసారి పరీక్షగా చూశాడు జాఫర్. గదికి కిటికీలు లేవు. వెంటిలేటర్స్ వున్నాయి. రూమ్ చల్లగా వుంది. అండర్‌గ్రౌండ్ కావచ్చుననుకున్నాడు.

తనవెంట తెచ్చిన కిట్ తెరిచి స్క్రూడ్రైవర్లు, రెంచీలు తీసి మెషీన్ ఓపెన్ చేశాడు. "సిలిండర్స్‌కి అమర్చిన పళ్ళ చక్రం ఒకటి విరిగిపోయింది. అందుకే రొటేట్ కావడం లేదు" అన్నాడు చిన్న పళ్ళచక్రాన్ని చూపిస్తూ.

"ఐతే యిప్పుడు బాగుపడదా?" సందేహంగా అన్నాడు సుదర్శనం.

"ఎందుక్కాదూ? చాలా మైనర్ ఫాల్ట్. కొత్త పీస్ వేస్తే సరిపోతుంది. ప్రస్తుతం నా దగ్గిర లేదు. రేపు సెట రైట్ చేస్తాను."

మళ్ళీ అతని కళ్ళకి గుడ్డ కట్టేక కారు స్టార్టయింది.

కారు ప్రయాణ కాలాన్నిబట్టి అంచనా వేస్తే ప్రింటింగ్ స్థావరం సుదర్శనం ఇంటికి పది కిలోమీటర్ల దూరంలో వుండాలనుకున్నాడు జాఫర్ మనసులో.

ఉదయం పదకొండు గంటలకి పోలీస్‌స్టేషన్లో—

"నేను ఎంక్వయిరీ చేశాను సార్! సుదర్శనంగారి ప్రక్క యింటి కాంపౌండ్‌లో కార్ గరాజ్ వుంది. అందులో నిన్న అర్ధరాత్రివరకూ టేబిల్ టెన్నిస్ ఆడేరట సార్. సార్. దాదాపు ప్రతిరోజూ రాత్రిళ్ళు అక్కడ టి.టి. ఆడతారట సార్!" అన్నాడొక పోలీస్ డిపార్టుమెంటుకి చెందిన వ్యక్తి ఇన్‌స్పెక్టర్ హరితో.

"వెరీగుడ్ బ్రదర్! కేసు పరిష్కారమైపోయింది. ఈ రాత్రికే ప్లాన్ సిద్ధం చేశాను" అన్నాడు హరి ఉత్సాహంగా.

7

రాత్రి పదకొండయ్యింది, జాఫర్ సుదర్శనం యింటి కొచ్చేసరికి.

సుదర్శనం ఎదురుచూస్తున్నాడతనికోసం.

కారులో సుదర్శనం అన్నాడు "మెషీన్ కుంటుపడ్డం వల్ల చాలా నష్టం వచ్చింది. మళ్ళీ మళ్ళీ రిపేర్లు రాకుండా మొత్తం మెషీనంతా చెక్ చెయ్యాలి."

జాఫర్ మౌనంగా తలూపేడు.

కళ్ళకు కట్టిన గుడ్డవిప్పేక "సిలిండర్ వీల్ తెచ్చావా?" అన్నాడు సుదర్శనం.

"ఆ తెచ్చాను" అని కిట్ ఓపెన్ చేసి, సామాన్లు కొన్ని బైటకుతీసి, అడుగునున్న రివాల్వర్ తీసి సుదర్శనానికి గురిపెట్టాడు.

సుదర్శనం వెంటచే జేబులోంచి రివాల్వర్ తీసేలోగా

జాఫర్ అతనిని చేతిమీద "ధన్"మని పేల్చాడు. చేతి లోంచి రక్తం చిమ్మింది.

"అందరూ చేతులు పైకెత్తండి. ఆలస్యంచేస్తే ఛస్తారు" అన్నాడు కటువుగా.

ఈలోగా తలుపు భళ్ళున తెరుచుకుంది. సాయుధులైన పోలీసులు బిలబిల మంటూ లోపలికి దూసుకొచ్చి అందరికీ బేడీలు వేశారు.

"ఎవరు నువ్వు?" మెల్లగా అడిగాడు సుదర్శనం జాఫర్ని తీక్షణంగా చూస్తూ.

"ఐయామ్ సర్కిల్ ఇన్స్పెక్టర్ హరి!" అన్నాడు కళ్ళజోడుతీసి నవ్వుతూ.

* * *

"కంగ్రాచ్యులేషన్ మిస్టర్ హరీ! మీరు ఛార్జి తీసుకున్న పదిరోజుల్లోనే రెండు పెద్ద కేసుల్ని సాల్వ్ చేశారు. ఐయామ్ ప్రౌడాఫ్ యూ రియల్లీ" అన్నాడు డి.జి.పి. ఉత్సాహంతో భుజం తడుతూ.

"థాంక్యూ సర్!" వినయంగా తల వంచుకొన్నాడు హరి.

"మీ రీ కేసుల్ని ఎలా డీల్ చేసిందీ తెలుసుకోవాలనుంది. చెప్తారా?" అన్నాడు పార్టీ కొచ్చిన ఓ పెద్ద మనిషి.

"మొదటి కేసులో నేనంటూ పెద్దగా చేసిందేమీ లేదు. స్టేషన్లో చెంగయ్యని రామం గుర్తుపట్టడంతో అతన్నించి సమాచారం సేకరించి, వలపన్ని మిగిలిన ముఠావాళ్ళ నందర్నీ కస్టడిలోకి తీసుకున్నాం.

ఇకపోతే రెండో కేసు. అర్ధరాత్రి రోడ్డుమీద యాక్సిడెంటు చేశాక ఆ వ్యక్తికి స్కూటర్ స్టార్టు కాలేదు. నడి

పించుకుంటూ వెళ్ళిన ఆ మనిషి దగ్గర్లో ఏదో ఒక మెకానిక్ కి ఆ స్కూటర్ని యివ్వడమో లేక రిక్షామీద యింటికి తీసుకు పోవడమో చేసివుండాలని ఊహించాను. ప్రమాదం జరిగిన ప్రదేశానికి చుట్టుపక్కల వున్న స్కూటర్ రిపేరర్స్ అందర్నీ వాకబు చేశాం—ఫలానా తేదీ రాత్రి సుమారు 12 గంటల సమయంలో బ్లూ కలర్ స్కూటర్ ఎక్కడ రిపేర్ చేయబడిందీ అని. సులువుగా దొరికింది ఒకచోట. రిపేరర్స్ రిజిస్టర్లో స్కూటర్ నెంబర్ విధిగా రాసు కుంటారు. అదే పెద్ద బలమైన క్లూ.

ఆ నెంబర్నిబట్టి ఆర్.టి.వో. ఆఫీసులో ఎంక్వయిరీ చెయ్యగా నిందితుడి యింటి అడ్రస్సు దొరికింది. అతడే సుదర్శనం.

వెంటనే వెళ్ళి అరెస్టు చెయ్యవచ్చును కాని దొంగ నోట్ల ప్రింటింగ్ ఎక్కడో తెలియకపోవచ్చు. పైగా అతడు ప్రింటింగ్ స్థావరం ఎక్కడుందీ చెప్పకపోవడమో లేక పోలీసులని తప్పుదోవ పట్టించడమో జరుగుతుంది. అంతే కాకుండా సుదర్శనాన్ని అరెస్టు చెయ్యడంవలన ప్రింటింగ్ చేసే మిగిలిన నేరస్థులు తెరమరుగయ్యే ప్రమాదం కూడా వుంది.

అంచేత అతన్ని అరెస్టు చెయ్యకుండా వరుసగా మూడు రాత్రులు అతని యింటిముందు నిఘా వేయవలసివచ్చింది. అంతేకాకుండా అతనికి వచ్చేపోయే ఫోన్ కాల్స్ని రికార్డు చేయించాం. అతన్ని కలుసుకునేలోగా మెషీన్ మెకానిక్ని ట్రేస్ చేసి, అతనిలాగా నేను వెళ్ళడం జరిగింది. నే నీ వూరికి కొత్తగా బదిలీ కావడంవల్ల నన్ను గుర్తుపట్టే అవకాశం లేకపోయింది సుదర్శనానికి.''

“ఐతే అతని యింటి అండర్ గ్రౌండ్లోనే మెషీన్

వున్నట్లు ఎలా తెలిసింది మీకు?"

"దీని కూడా బలమైన ఆధారాలు దొరకబట్టి మాకు శ్రమ లేకుండా పట్టుబడ్డారు నేరస్థులు. నా కళ్లు మూసి కారులో తీసుకెళ్ళినప్పుడు ఆ మెషీన్ వుండే స్థావరం కనీసం పది కిలోమీటర్లు వుండి వుంటుందనుకున్నాను.

కాని ఆ కారుని వెంటాడిన మా డిపార్టుమెంటు వ్యక్తి ఆ కారు ఎక్కడా ఆగలేదనీ, టౌనులో పావుగంటకు పైగా తిరిగి మళ్ళీ యింటికి వచ్చిందనీ, మళ్ళీ తర్వాత రెండోసారి బయల్దేరినప్పుడు కూడా ఎక్కడా ఆగకుండా యింటికి వచ్చిందనీ చెప్పాడు. దాన్నిబట్టి సుదర్శనం ఇంట్లోనే ఎక్కడో మెషీన్ వుండి వుండాలనుకున్నాను. నన్ను తప్పుదోవ పట్టించి, యింటికి చాలా దూరంలో ఆ స్థావరం వున్నట్లు నన్ను నమ్మించాలని కారుమీద నన్ను తీసుకెళ్ళాడు సుదర్శనం.

కాని అదృష్టం నావైపు వుండడంవల్ల మరొక ఆధారం కూడా లభించింది నాకు. మెషీన్ చూపించడానికి నన్ను తీసుకెడుతున్న సమయంలో ఎక్కడ నుంచో సన్నగా 'టిక్ .... టిక్' మని శబ్దం తరచుగా వినబడింది. ఆ శబ్దం టేబిల్ టెన్నిస్ ఆటలో బంతి శబ్దం అని కనిపెట్టడానికి నా కెంతోసేపు పట్టలేదు.

మర్నాడు ఎంక్వయిరీలో సుదర్శనం పక్కఇంట్లో రాత్రి టి.టి. ఆడినట్లు తేలింది. అంతే. ఆ రాత్రే ప్లాన్ సిదంచేసి ఒక్కసారి దాడి చేశాం. దట్సాల్" అన్నాడు హరి.

"ఎసీవే! వెల్ డన్ హరీ! ఒక్క దెబ్బకి రెండు పిట్టల్ని కొట్టేవ్" హరి భుజం తట్టేడు రామం అభిమానంగా. □

మంచుతో కూడిన చలి రాజధాని నగరాన్ని గజగజ వణికిస్తున్నది. పగలు 11 గం.లు అయినా చలి బాధను తట్టుకోలేక తమ విధులను విధిలేక నిర్వహిస్తున్నారు నగర పౌరులు.

చలి అనేది జీవపదార్థాలకే కాని జడ పదార్థాలకు పరిమితం లేదు కదా! అందుకేనేమో చలితో నాకేమిటన్నట్లుగా

గణ గణ మ్రోగసాగింది పోలీసు స్టేషన్‌లో ఫోను.

చలి బాధ నుండి కొంచెమయినా ఉపశమనము పొందు దామనుకునే ఉద్దేశ్యంతో సిగరెట్టు మీద సిగరెట్టు గుంజుతూ ఊహాలోకాల్లో విహరిస్తున్నాడు హెడ్‌కానిస్టేబుల్ భిక్ష పతి. ఫోను మ్రోతకు ఈ లోకంలోకి వచ్చిన భిక్షపతి ఒక సారి సీరియస్‌గా చూచి ప్రస్తుతానికి ఆ ఫోను మీద అధి కార మున్నది కనుక ఠీవిగా వెళ్ళి ఫోను ఎత్తాడు.

"హలో, ఈజ్ ఇట్ పోలీస్ స్టేషన్." రిసీవర్‌లో నుంచి మాటలు వినవచ్చినయ్.

"పోలీస్ స్టేషను కాకుంటే ఫైర్ స్టేషను అనుకొన్నా వటయ్యా! ఏమైంది? ఏమైనా కొంపలంటుకొన్నాయా?" ఇన్‌స్పెక్టర్ లేడు కనుక సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పోజులో మాట్లాడసాగాడు.

"హలో! నేను స్టేట్‌బ్యాంకి మేనేజర్ని మాట్లాడు తున్నాను. ఇక్కడ ఒక దొంగతనం జరిగింది. మీరు వెంటనే రావాలి" రిసీవర్‌లో నుంచి మాటలు గంభీరంగా విన్పించినయ్.

"ఆ! సార్! సార్! ఏవిటీ! మీరు బ్యాంక్ మేనే జరా! 'ఏవిటీ దొంగతనం? ఆ! సార్! ఇన్‌స్పెక్టర్‌గారిని ఇప్పుడే పిలిపిస్తున్నాం. వెంటనే వచ్చేస్తున్నాం. బ్యాంకులో వున్న వాళ్ళందర్నీ ఎక్కడికీ వెళ్ళనీయకుండా తలుపులు మూయించండి" కంగారుగా చెప్పాడు హెడ్‌కానిస్టేబుల్ భిక్షపతి.

2

"రండిసార్?" సాదరంగా ఆహ్వానించాడు ఇన్‌స్పెక్టర్ రాజును బ్యాంక్ మేనేజర్ రంగనాధం. ఆయన వెనుకనే ఫోనులో దర్జాగా మాట్లాడిన భిక్షపతి, పోలీసు కానిస్టేబులు

సురేష్ లోపలకి వచ్చారు.

"ఆ! ఏమైంది సార్! కేసు వివరాలు వివరంగా చెప్పండి" చిరునవ్వు నవ్వుతూ అడిగాడు ఇన్స్పెక్టర్ బ్యాంక్ మేనేజర్ని. బ్యాంక్ మేనేజర్, క్యాషియర్ రవి వర్మ వంక చూశాడు వివరంగా చెప్పమన్నట్లు.

రవివర్మ చెప్పసాగాడు.

"ఈ రోజు సోమవారం అగుటవలన బ్యాంక్ కొంచెం రద్దీగా వున్నది సార్. నేను రోజులాగనే టోకన్ నంబర్స్ కాల్ ఫర్ చేసి టోకన్ ట్యాలీ చేసుకొని క్యాష్ హ్యాండ్ ఓవర్ చేస్తున్నాను. 31 వ నెంబర్ టోకన్ను పిలిచినపుడు ఒక వ్యక్తి వచ్చి ఆ టోకన్ యిచ్చాడు. ఆ వ్యక్తికి నేను ఇవ్వవలసిన 15 వేల రూ.లు. ఇచ్చివేసినాను. అతను వెళ్ళిన అయిదు నిమిషాలకు వెంకటేశం అనే వ్యక్తి వచ్చి తన టోకన్ ఛేంజ్ అయ్యిందని రిపోర్టు చేశాడు.

వివరాలు పరిశీలించగా - వెంకటేశంకు చెందవలసిన 15 వేల రూపాయలు, మరో వ్యక్తి రాంగోపాల్ చేజిక్కించుకొని పరారయ్యాడు. వెంకటేశం వద్దనున్న 18 నెంబర్ టోకన్ రాంగోపాల్కు సంబంధించినది. ఆ టోకన్ మీద కేవలం రెండు వందల రూపాయలు మాత్రమే డ్రా చేసుకోవచ్చును."

"వాట్ ఎ థ్రిల్లింగ్!" సాలోచనగా తల పంకించాడు ఇన్స్పెక్టర్ రాజు.

"బై దిబై, రాంగోపాల్ ఎక్కవుంట్ తెప్పించండి" రాజు అడిగాడు.

ఎక్కవుంట్లో వున్న వివరాలన్నీ నోట్ చేసుకున్నాడు ప్రక్కనే వున్న కానిస్టేబుల్ సురేష్. అదేవిధంగా వెంకటేశం ఎక్కవుంట్ వివరాలు కూడ నోట్ చేసు

కొన్నాడు. రాంగోపాల్ సంతకం, వెంకటేశం సంతకాలు పరిశీలించిన తరువాత వెంటనే ఏదో స్ఫురణకు వచ్చి మరల రాంగోపాల్ ఎక్కౌంటు తెరచి చూచి తనలో తనే నవ్వుకున్నాడు ఇన్‌స్పెక్టర్ రాజు.

"సార్! గుడ్ ఐడియా. వెంటనే మనము రాంగోపాల్ ఇంటికి వెళ్ళి ఇంటిని రౌండ్ అప్ చేస్తే దొంగ వెంటనే దొరికిపోతాడు సార్!" ఎంత తొందరగా ఇన్‌స్పెక్టర్ ప్రమోషన్ కొట్టివేద్దామనే ఆదుర్దాతో తన ఆలోచనను బయట పెట్టాడు హెడ్ భిక్షపతి.

పగలబడి నవ్వసాగాడు ఇన్‌స్పెక్టర్ రాజు.

"పిచ్చివాడా! వాడి ఇంటిని చుట్టుముట్టతే దొరికేది వాడు కాదు. నేనే. ఎందుకంటే వాడిచ్చిన డోరు నంబరు నాదే కనుక. ఇకపోతే వాడికి ష్యూరిటీ సంతకం చేసిన వ్యక్తిని పట్టుకొందామంటే, ఆ వ్యక్తి మరెవరో కాదు. మోసపోయిన వెంకటేశమే! మొత్తానికి దొంగ చాలా తెలివిగా ప్రవర్తించాడు.

వెంకటేశంను ప్రక్క గదిలోకి పిలిపించాడు విచారణ నిమిత్తం రాజు. వెంకటేశం జరిగినదంతా విచారవదనంతో వివరంగా చెప్పాడు. ఆ తరువాత క్యాషియర్ రవివర్మను మరల ప్రత్యేకంగా పిలిపించి ప్రశ్నించాడు. బ్యాంక్ మేనేజర్ వద్ద కంప్లయింట్ మీద సంతకం చేయించుకొని శెలవు తీసికొని, వెళ్ళిపోయారు ఇన్‌స్పెక్టర్ రాజు, ఆయన అనుచరులు.

3

రాత్రి 7 గం, ల సమయం. బ్యాంక్ మేనేజర్ రంగనాథం ఇంటిలో ఫోను మ్రోగింది. స్పోర్ట్సు వీక్ చదువుతున్న రంగనాథం రిసీవర్ ఎత్తాడు.

"కంగ్రాచ్యులేషన్స్ సార్? దొంగలు దొరికి పోయారు. మీరు వెంటనే స్టేషనుకు వచ్చేయండి" రిసీవర్‌లో నుంచి ఇన్‌స్పెక్టర్ మాటలు సున్నితంగా విన్పించినయ్.

వెంటనే డ్రెస్ మార్చుకొని పోలీస్ స్టేషనుకు వెళ్ళిన రంగనాథంగారు ఆశ్చర్యంలోనుంచి తేరుకోలేకపోయి నాడు. కారణం దొంగ రాంగోపాల్‌తోపాటు, కటకటా లను లెక్కపెడుతూ లాకర్ గదిలో విచారంగా కూర్చుని వున్నాడు క్యాషియర్ రవివర్మ.

"రాంగోపాల్ ఒక పేరు మోపిన ఛీటర్. ఇప్పటి దాక అనేక పేర్లతో, అనేక హోదాలతో చాలమందిని మోసం చేసి పోలీసులకు చిక్కకుండ తప్పించుకు తిరుగు మన్నాడు. ఈసారి అతని ఛీటింగ్ వలలో చిక్కుకున్న అమాయకుడు వెంకటేశం.

చిన్న చిన్న కాంట్రాక్టు పనులు చేసుకునే వెంకటేశం ఆ బ్యాంక్‌లో రోజు పది పదిహేను వేలదాక ట్రాన్సా క్షన్స్ జరుపుతుంటాడు. మూడు రోజులు వరుసగా బ్యాంక్‌కు వస్తున్న వాళ్ళందర్ని అబ్జర్వ్‌చేసిన రాంగో పాల్ దృష్టి వెంకటేశం మీద స్థిరీకరించి పోయింది.

రోజు విడిచి రోజు బ్యాంక్‌లో వేల సంఖ్యలో జమ చేయటం కాని, డ్రా చేయటం కాని వెంకటేశం దిన చర్యలలో ఒక భాగంగా గ్రహించిన రాంగోపాల్ ఒక సుదినాన అదే బ్యాంకులో ఖాతా తెరుచుటకుగాను వెంక టేశంను పరిచయం చేసికొని, అతని సంతకం ద్వారా ఖాతా తెరిచాడు. కాని ఖాతాలో రాంగోపాల్ మాత్రం తప్పుడు అడ్రసు ఇచ్చాడు. అంటే ఈ విషయంలో రాం గోపాల్ ముందుగనే జాగ్రత్తపడ్డాడన్న మాట. ఈ విషయం అతను యిచ్చిన డోరు నంబరుబట్టి తెలుస్తు

న్నది.

ఇకపోతే వెంకటేశం ఎక్కౌంట్, రాంగోపాల్ ఎక్కౌంట్ పరిశీలించగా వెంకటేశం బ్యాంక్‌కు వచ్చి నప్పుడల్లా రాంగోపాల్ కూడా బ్యాంక్‌కు వచ్చి వెళుతున్నాడు. అంటే కేవలం వెంకటేశంతో పరిచయం అభివృద్ధి చేసుకొంటూ అవకాశం కోసం ఎదురు చూస్తున్నాడన్న మాట. ఇన్ని రోజుల నుంచి రాంగోపాల్ బ్యాంకుతో ట్రాన్సాక్షన్ జరుపుతున్నప్పటికిని, రాంగోపాల్ ఎక్కౌంట్‌లో డబ్బు మాత్రం మొదట వేసినంతనే వుంది.

అంతా పకడ్బందీగా నడుపుకొచ్చుకొనుచున్న రాంగోపాల్ క్యాషియర్ రవివర్మతో పరిచయం పెంచుకొన్నాడు. తను చేయబోయె ప్లాను వివరంచి చెప్పాడు. ఆ పనికి రవివర్మ మద్దతు దొరికితే పని ఇంకా సులువుగా నెరవేర కలదు. అందుకు ప్రతిఫలంగా సగం వాటా రవివర్మకు ముట్టచెప్పే పద్ధతిపైన ఒప్పందం కుదుర్చుకొన్నారు.

ఆ రోజు మామూలుగానే బ్యాంకులో కలుసుకొన్న రాంగోపాల్, వెంకటేశం ఒకరి నొకరు విష్ చేసుకొన్నారు. బ్యాంక్‌లో రద్దీగా వున్నదనే మిషతో రాంగోపాల్ టీ త్రాగుటకు గాను వెంకటేశంను ప్రక్కనే వున్న హోటల్‌కు తీసుకు వెళ్ళాడు. టీకి ఆర్డరిచ్చిన రాంగోపాల్ తన టోకన్‌తో టేబుల్‌మీద క్యారమ్స్‌లాగ చిన్నగ ఆడటం మొదలుపెట్టాడు. మాటలలో పడిన వెంకటేశం దృష్టిని మరలించి టోకన్‌ను మార్చివేశాడు. అంటే యిప్పుడు వెంకటేశం టోకన్ రాంగోపాల్ వద్దకు, రాంగోపాల్ టోకన్ వెంకటేశం వద్దకు చేరినయ్.

టీ బిల్లు చెల్లించిన రాంగోపాల్ వెంకటేశంతో పిగరెట్లు తీసికోమని చెప్పి. యూరినల్స్‌కు పోయి వచ్చే మిషతో ప్రక్కకు వెళ్ళిపోయాడు. కిళ్ళీషాపువద్ద రద్దీగా వున్న కారణంగా వెంకటేశంకు కిళ్ళీ. పిగరెట్లు తీసికొనుటకుగాను ఐదు నిముషాలు టయిము పట్టింది. ఈ స్వల్ప వ్యవధిని వేస్టు చేయటం ఇష్టంలేని రాంగోపాల్ బ్యాంకు ఆవరణలోకి ప్రవేశించి రవివర్మకు సైగ చేశాడు.

ముందుగనే పైకము ఎంచుకుని తయారుగ వున్న రవివర్మ రాంగోపాల్ సైగ చేయగనే 31 నెం. టోకన్‌ను పిలిచి రాంగోపాల్‌కు 15 వేలు అందచేసినాడు. క్యాష్ అందగానే రాంగోపాల్ అదృశ్యమయిపోయినాడు. ఇందులో తన తప్పు ఏమాత్రం కనపడదనే ఉద్దేశ్యం రవివర్మ ఫీల్ అయినాడు.

కిళ్ళీలు కట్టించుకుని రాంగోపాల్ కోసం చూసిన వెంకటేశం అతను కనుపించకపోవటంతో బ్యాంకు లోపలకు వచ్చి తన టోకన్ నంబరు చూసుకొని ఖంగు తిన్నాడు. వెంటనే క్యాషియర్ వద్దకు వెళ్ళి రిపోర్టు చేశాడు. రవివర్మ వెంకటేశంతో ఆ టోకన్‌కు ఇపుడే డబ్బులు ఇచ్చివేశానని చెప్పాడు.

ఇదంతా కాకతాళీయంగా జరిగిందని కాదని, ప్రీ-ప్లానుతో జరిగిందనే ఉద్దేశ్యంతో మేము రవివర్మను అనుమానించవలసి వచ్చింది. అందుకే మా సురేష్‌తో బ్యాంక్ వదలిన తర్వాత రవివర్మను రహస్యంగా వెంటాడవల్సిందిగా ఆదేశించాను.

రవివర్మ బ్యాంక్ వదలిన వెంటనే రూము కెళ్ళి స్నానముచేసి, డ్రస్ మార్చుకొని, ఆటోలో రాంగోపాల్ బస చేసిన హోటల్‌కు చేరుకొన్నాడు. అప్పటికే హోటల్

రూములో తయారుగా వున్న రాంగోపాల్, రవివర్మవాటా అతని ముంచుంచి, ఆతిథ్యముగా బీరును ఆఫర్ చేశాడు.

ఇది అంతా రహస్యంగా వెంటాడి సమాచారము సేకరించిన సురేష్ మాకు ఫోను చేయగనే, వెంటనే మేము వెళ్ళి దొంగిలించిన సొమ్ముతో సహా ఇద్దరిని అరెస్టుచేయగలిగాము'' అని వివరంగా చెప్పాడు ఇన్‌స్పెక్టర్ రాజు.

అంతా విని ఇంకా ఆశ్చర్యంలో నుంచి తేరుకోలేక పోయాడు బ్యాంక్ మేనేజర్ రంగనాధం. □

సుత్తి

"మా వాడు సుత్తి కొడతాడు. జాగ్రత్త" అని నువ్వంటే-"మాటల సుత్తి" అనుకున్నాన్నే!!

సమాధిరాయి

కాశీభట్ల భానుమూర్తి

"పిలిచింది ఎందుకో తెలుసుకోవచ్చా?" అనడిగాడు సైదులు.

"ఆ! చెబుతా తొందరపడతావేం. ముందీ మందు కొట్టు" అని ఒక సీసా సైదులికి అందించాడు గురుమూర్తి.

సైదులికి ముప్పై ఐదు ఏళ్ళు వుంటాయి. కండలు తిరి

గిన ఒళ్ళు. నల్లగా చింతమొద్దులా వుంటాడు. కిరాయికి లారీ నడుపుతూ వుంటాడు సైదులు. ఆ లారీ అతని స్వంతం. ఆ కిరాయి కాస్త ఎక్కువ అయితే ఆ లారీని మనుషుల మీదినుంచే నడుపుతాడు సైదులు. గురుమూర్తి లాంటి మనుషులు ఈ భూమిమీద వున్నన్ని నాళ్ళు సైదులులాంటి కిరాయి హంతకులకు ఏ కొరతా వుండదు.

"పని ఏమిటో దాని లోటుపాటులు ఏమిటో తెలుసుకోకుండా ఈ సైదులు మందు కొట్టడు. ఆ విషయం మీకూ తెలుసు" అని సీసాని వెనక్కి నెట్టాడు సైదులు.

"అయితే జాగ్రత్తగా విను. నీకు బాగా అనుభవమున్న లారీ హత్యే ఇది కూడా. తాడేపల్లిగూడెం నుండి రాజారావు అనే వ్యక్తి స్కూటర్ మీద ప్రతిరోజూ రాత్రి పది గంటలకు తణుకు వస్తాడు. తొమ్మిదిన్నర అయ్యేసరికి తాడేపల్లిగూడెంలో బయలుదేరుతాడు. టైముని సరిగ్గా పాటించే వ్యక్తుల్లో రాజారావు ఒకడు.

నువ్వు ఈ రాత్రి తొమ్మిదిన్నరకి తణుకులో బయలుదేరి తాడేపల్లిగూడెం వెళ్ళు. దువ్వ దాటాక నీకు రాజారావు ఎదురవుతాడు. ఆ తరువాత మళ్ళీ ఎవరికీ ఆ రాజారావు ఎదురవ్వకూడదు. శవాన్ని మాయం చేసే బాధ్యత కూడా నీదే. అక్కడ ఏ గుర్తులూ మిగలగూడదు. చెప్పు. ఎంత నీ రేటు?" అన్నాడు గురుమూర్తి చుట్ట వెలిగించుకుంటూ.

"రాజారావును చంపటం ఎందుకో తెలుసుకోవచ్చా?" అనడిగాడు సైదులు.

"అది నీ కనవసరం. రేటు ఎంతో చెప్పు" అన్నాడు గురుమూర్తి విసుగ్గా.

"పదివేలు" అన్నాడు సైదులు కుర్చీలోంచి లేస్తూ.

"ఒక మనిషిని పరలోకం పంపటానికి టిక్కెట్టు వెల పది వేలా?" అన్నాడు గురుమూర్తి.

"రోజు రోజుకి రైల్వేవారు, ఆర్టీసీవారు రేట్లు పెంచేస్తుంటే ఏం మాట్లాడలేరు కాని నాబోటివాడికి ఇవ్వటానికి ఏడుస్తారేం? పరలోకానికి టిక్కెట్లు ఇచ్చేది నాలాంటి అతి తక్కువ మంది. అయినా ఆ పని మీవల్లకాదు కాబట్టి నన్ను సంప్రదించారు. తీరా పనిగట్టుకొని వచ్చాక కూర గాయలు బేరం ఆడినట్టు బేరం ఆడుతారేం?" అని ప్రశ్నించాడు సైదులు చిరాగ్గా.

"పది వేలా అని అడిగాను తప్పితే అది ఎక్కువని అనలేదుగా బాబూ? ఉండు ఇప్పుడే పట్టుకొని వస్తాను" అని లోపలికి వెళ్ళి డబ్బు తీసుకొని వచ్చి సైదులు కిచ్చాడు గురుమూర్తి.

సైదులు ఆత్రృతగా ఆ డబ్బుని అందుకుని జేబులో పెట్టుకున్నాడు. ఆ తరువాత ఇందాక వెనక్కి నెట్టిన సీసాను అందుకొని మూతతీసి గొంతులోకి వంపుకొన్నాడు సైదులు. ఒక్క చుక్క గూడా నీరు కలపకుండా ప్యూర్ మందు కొట్టే పూర్ సైదుల్ని ఆశ్చర్యంగా చూడసాగాడు గురుమూర్తి.

సీసా దించి పక్కనపెట్టి జేబులోంచి సిగరెట్టుపెట్టెతీసి ఒక సిగరెట్ వెలిగించుకొని తృప్తిగా పొగ పీల్చి వదిలాడు సైదులు.

గురుమూర్తి అటూ యిటూ నెమ్మదిగా పచార్లు చేయ సాగాడు.

"ఆ! రాజారావుని ఎలా గుర్తుపట్టడం? ఆ టైముకి చాలామంది రావచ్చుగదా స్కూటర్ మీద?" అన్నాడు సైదులు పొగ పీల్చి వదులుతూ.

రాజారావు ఫోటో ఒకటి తీసుకొచ్చి ఇచ్చాడు సైదులికి. సైదులు రాజారావు ఫోటో అందుకొని పరీక్షగా చూడసాగాడు.

"ఇంకొక కొండ గుర్తు వుంది. ఆ రాజారావు స్కూటర్ మీద వచ్చేటప్పుడు ఒక కాలు నేలమీదకి వదిలేసి స్టైయిలుగా నడుపుతాడు స్కూటర్ని. జాగ్రత్తగా చూసుకో" అని మరొకసారి హెచ్చరించి రాజారావు స్కూటరు నెంబరు, కలరు కూడా చెప్పాడు గురుమూర్తి.

"పాములతో చెలగాటమాడేవాడికి వానపాములని చూపి భయపట్టలేరు. ఇలాంటి కేసులు ఎన్ని చూడలేదు" అన్నాడు సైదులు గర్వంగా.

"జాగ్రత్త. నా దగ్గర డబ్బా వాయించగానే సరికాదు. పోలీసుల దగ్గర కటకటాలు లెక్కపెట్టకూడదు. నా పేరు ఎక్కడా పైకి రాకూడదు. శవాన్ని మాయం చేసాక ఒక వారం రోజులవరకు నువ్వు యెక్కడికి బైటికి వెళ్ళకుండా మీ యింటిలోనే వుండు. నా దగ్గరికి కూడా రాకు" అన్నాడు గురుమూర్తి.

"మరి నే వెడతాను. మనం పెట్టుకున్న ముహూర్తం దగ్గరపడింది గదా" అని గురుమూర్తికి చెప్పి, అక్కడే వున్న మరొక నిండుసీసా చంకన పెట్టుకొని బయటికి నడిచాడు సైదులు హుషారుగా.

"వెధవ కక్కూర్తి. ఎంత డబ్బిచ్చినా, మళ్ళీ మందు కూడా యివ్వాలి" అని మనస్సులోనే గొణుక్కొని లోపలికి బయలుదేరాడు గురుమూర్తి.

2

"ఒరే సింహాచలం లేవరా బేరం తగిలింది" అని సింహాచలాన్ని లేపాడు సైదులు.

"ఛీ! నీ యవ్వ. బేరం ఏమిటి బే" అని విసుగ్గా అరిచాడు సింహాచలం. సైదులికి వళ్ళు మండిపోయింది. లాగిపెట్టి ఒక్కటి వేసాడు నెత్తిమీద సింహాచలాన్ని. దాంతో సింహాచలం నిద్రమత్తు వదిలిపోయింది.

"క్షమించు గురూ, మూడురోజులబట్టీ నిద్రలేకపోవటం మూలంగా ఏదో వాగాను. మళ్ళీ ఏ హైదరాబాదైనా వెళ్ళాలా" అని అడిగాడు సింహాచలం.

"కాదు. తాడేపల్లిగూడెం వెళ్ళిరావాలి" అన్నాడు సైదులు ముక్తసరిగా.

"ఇంత బతుకు బతికి ఇంటివెనకాల చచ్చినట్టు. తాడేపల్లిగూడేనికి, మండపాకకి కూడా బేరాలు వప్పుకొంటున్నావేమిటి గురూ" అన్నాడు సింహాచలం.

"ఇది మామూలు బేరం కాదు స్పెషల్ బేరం" అన్నాడు సైదులు.

"ఆ! స్పెషలా. వద్దుగురూ. మొన్న విజయవాడ దగ్గర శంకర్రావుగారికి టిక్కెట్టు యిచ్చిన విషయం పోలీసులు యింకా మరిచిపోలేదు. శంకర్రావుకి పరలోకానికి టిక్కెట్టు యిచ్చిన బుకింగ్ క్లర్కు యెవరా అని పోలీసులు తెగ హడావుడి పడిపోతున్నారు. అది తెలిసుండి మళ్ళీ స్పెషల్ బేరం యెందుకు వొప్పుకొన్నావు గురూ" అన్నాడు సింహాచలం బాధగా.

"పదివేలు ఊరకా వస్తాయా. అయినా యిది తాడేపల్లిగూడెమే కదా. మొత్తం గంటపని. ఒక గంట కష్టపడితే పదివేలు మనల్ని సుఖపెడతాయి. నడు, నడు టైము అవుతోంది" అని దండెంమీద వున్న చొక్కా తీసి తొడుకున్నాడు సైదులు.

మూల నున్న గునపం, పారా తీసి చేత్తో పట్టుకొని

రూముకి తాళంవేసి సైదుల్ని అనుసరించాడు సింహా చలం.

3

"పండువెన్నెల పిండారబోసినట్టు వుంది. పిల్ల తెమ్మెరలు చల్లిగా వీస్తున్నాయి. ఈ జగత్తులో వున్నది నువ్వూ నేనే. మిగిలిన ప్రపంచం అంతా బూటకం" అన్నాడు స్వప్న కళ్ళల్లోకి ప్రేమగా చూస్తూ సుబ్రహ్మణ్యం.

"ఏమిటీ దొరగారీ వేళ కవిత్వం ఒలకబోస్తున్నారు. ఏ కవి సమ్మేళనానికైనా వెళ్ళారా కొంపతీసి" అంది స్వప్న గమత్తుగా నవ్వుతూ.

"ఆహా! నువ్వు నవ్వితే నవరత్నాలు రాలుతాయి. నీ ప్రేమను గెలవటం నాకు మహా సంతోషంగా వుంది. హా! స్వప్నా" అన్నాడు సుబ్రహ్మణ్యం కొంటెగా.

"నువ్వు నన్నింతగా ప్రేమిస్తున్నావని తెలిసే నీ పేరు పాత చింతకాయ పచ్చడిలా వున్నా నిన్ను ప్రేమిస్తున్నాను మణ్యం" అంది స్వప్న తీయగా.

"పాత చింతకాయ పచ్చడి అంటే మహాలోకువగా వుంది నీకు. దాని రుచి యింక దేనికి వస్తుంది. సుబ్రహ్మణ్యం అనే పేరులో వున్న అందం రవి, సురేష్, ప్రణవ్ అనే పేర్లలో లేదు తెలుసా" అన్నాడు సుబ్రహ్మణ్యం కోపంగా.

"అరె! అంతలోనే కోపం వచ్చేసిందే, నీ పేరు బావుండలేదు అని నేను అనలేదు మహానుభావా, పెద్ద పేరు అయిపోయింది పిలుచుకోవడానికి యిబ్బందిగా వుంది అన్నాను. పోనీ మణ్యం అని పిలవనా యికనుంచి" అంది కొంటెగా నవ్వుతూ స్వప్న.

"మణ్యం అని పిలుస్తావా, మణ్యం అంటే అడవి.

అది కాదుగాని నా పేరుకి సమ్మర్ క్రాఫ్‌చేపి 'సుభాష్' అని పిలువు. ఏం సరేనా" అన్నాడు సుబ్రహ్మణ్యం.

"ఏమి టీ రోజు తమరి హుషారుకి కారణం?" అని ప్రశ్నించింది స్వప్న.

"నువ్వు చెప్పావుగా మీ నాన్నగారితో పర్సనల్‌గా మాట్లాడమని. నిన్న మాట్లాడాను. గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు మన పెళ్ళికి" అన్నాడు సుబ్రహ్మణ్యం హుషారుగా.

"అరె! నువ్వు యెప్పుడు వచ్చావు మా యింటికి? మా నాన్నగారు నాతో చెప్పలేదు ఈ విషయం" ఆశ్చర్యంగా అడిగింది స్వప్న.

"ఇంటికి రాలేదు. నిన్న బస్టాండులో మీ నాన్నగారు కనిపించి ఆయనే నన్ను పలకరించారు. కాసేపు సంభాషణ గడిచాక ధైర్యంచేసి మన ప్రేమ విషయం చెప్పాను. ఆయన వెంటనే ఒప్పుకొన్నారు. మా నాన్నగారితో ఆయనే పర్సనల్‌గా మాట్లాడతానన్నారు" అన్నాడు సుబ్రహ్మణ్యం గర్వంగా.

"ఓ! అదన్న మాట తమరి ఆనందానికి కారణం" అంది స్వప్న.

"ఏం? నీకు మటుకు ఆనందంగా లేదూ" అన్నాడు సుబ్రహ్మణ్యం అనుమానంగా.

"ఎందుకు లేదు. అసలు నీకన్నా నాకే ఎక్కువ ఆనందంగా వుంది మన పెళ్ళి జరగబోతున్నందుకు కాని పైకి తేలలేదు. అదే ఆడవాళ్ళలోను మగవాళ్ళలోను వున్న తేడా" అంది స్వప్న చిరునవ్వుతో.

ఆకాశం మబ్బు పట్టివుంది.

"ఈ శుభ సందర్భంలో ఏదన్నా పిక్చర్ చూద్దామా" అన్నాడు సుబ్రహ్మణ్యం.

"చాల్లే, పిక్చర్ కని వంక పెట్టే యిప్పటిదాకా నీతో గడి పాను" అని టైము చూసుకొని "అబ్బ! అప్పుడే తొమ్మిది దాటింది. యిక బయలుదేరుతాను. కాసేపు యెక్కువ అలస్యం చేసానంటే మా నాన్నగారు పోలీసు రిపోర్టు ఇచ్చినా యిస్తారు కనిపించటంలేదని. మళ్ళీ రేపు కలుద్దాం" అంది స్వప్న కూర్చున్న చోటునుంచి లేస్తూ.

"సరే. రేపు ఇదేవేళకు వస్తాను. తప్పకరా" అన్నాడు సుబ్రహ్మణ్యం.

"ఇదే వేళకా, అయ్యబాబోయి నేను రాను. ఆరింటికే మామూలుగా వస్తాను. నీతో ఇక్కడికి తొమ్మిదింటికి వచ్చేది పెళ్ళయ్యాకే" అంది స్వప్న.

తానన్న మాటల్లో పొరపాటు గ్రహించి "సారీ, రేపు మామూలు వేళకే రా, సీ యూ" అని చెప్పి, అక్కడ నుండి బయలుదేరాడు సుబ్రహ్మణ్యం హుషారుగా.

స్వప్న కూడా అక్కడ నుండి కొంత దూరం నడిచి రిక్షా మాట్లాడుకొని యింటికి బయలుదేరింది ఆనందడోలి కల్లో తేలిపోతూ.

4

"శీతాకాలం వాన ఏమిటి, నా బొంద" అని విసుక్కొన్నాడు సింహాచలం.

సైదులు మాట్లాడలేదు. అతని చేతులు స్టీరింగ్ మీద బిగుసుకొన్నాయి. కనుచూపు ప్రసరించే దూరాన్ని ఆత్రంగా పరికిస్తూ గంభీరంగా డ్రైవ్ చేయసాగాడు సైదులు. దువ్వ గ్రామం రాగానే లారీ ఆపాడు సైదులు.

రోడ్డు పక్కనే వున్న కిళ్ళీకొట్టుకి వెళ్ళి ఒక సిగరెట్టు పేకెట్టు అగ్గిపెట్టె తీసుకొన్నాడు సైదులు. సింహాచలం నాలుగు అరిటి పళ్ళు తిని, సైదులు దగ్గర సిగరెట్టు పుచ్చ

కొని వెలిగించుకొన్నాడు.

వాన జోరు తగ్గి సన్న తుంపర పడసాగింది.

చొక్కా జేబులోంచి పర్సుతీసి కిళ్ళీకొట్టువాడికి డబ్బు లిచ్చేసి పర్సు జేబులో పెట్టుకుని. సిగరెట్టు వెలిగించాడు సైదులు.

వాచీకేసి చూశాడు సైదులు. తొమ్మిదీ ముప్పై ఐదు అయింది టైము. నెమ్మదిగా లారీకేసి నడిచాడు. సింహాచలం వెంటనే లారీ యెక్కి కూర్చొన్నాడు. స్టార్ట్ చేసి లారీని ముందుకు దూకించాడు సైదులు. నరసంచారం లేదు. అప్పుడో లారీ, అప్పుడో బస్సు తప్ప సైదులికి అడ్డం వచ్చేవి ఏమీలేవు. మామూలుగా అయితే జన సంచారం ఆ రోడ్డుమీద కొద్దిగా వుండేది. కాని వాన, చలి కారణంగా ఎవ్వరూ లేరు. లారీ స్పీడుగా పోతోంది.

"అదిగో గురూ, నువ్వు చెప్పిన స్కూటర్ మీది వ్యక్తి" అని అరిచాడు సింహాచలం.

"నాకు కనబడ్డాడుగాని నువ్వు అరవక జాగ్రత్తగా వుండు" కసురుకొన్నాడు సైదులు.

మృత్యుదేవతలా మీదికి వస్తున్న లారీని చూసి అయోమయంగా హారన్ వాయించాడు రాజారావు.

అపోజిషన్ వాళ్ళకి ఏమాత్రం అధికారం యివ్వని అధిష్ఠాన వర్గంలా లారీ రాజారావుని ఏమాత్రం కేర్ చేయ లేదు. డ్రయివర్ తప్పతాగివుంటాడని నిశ్చయించుకొని స్కూటర్ని పక్కకి తీశాడు రాజారావు. కాని ఏమాత్రం మృత్యుదేవత హస్తాల్లోంచి తప్పించుకోలేక పోయాడు. విసురుగా వచ్చి లారీ గుద్దుకోవటంతో స్కూటర్ మీద నుంచి ఎగిరి ఒక రాయిమీదపడి ప్రాణాలు కోల్పోయాడు రాజారావు. అతని నుదుటిమీద నుంచి కారిన రక్తంతో

తణుకు పది కిలోమీటర్లు అని వున్న మైలురాయి ఎర్రగా మారసాగింది.

స్కూటర్ని గుద్ది కొంచెం ముందుకు వెళ్ళి టక్కున బ్రేక్ వేసాడు సైదులు. తరువాత బండిని వెనక్కి తీసుకొని వచ్చి రాయి పక్కగా ఆపాడు. లారీ దిగాడు సైదులు. ఆ తరువాత చకచకా గునపం, పారా లారీలోంచి తీసాడు సింహాచలం. సైదులు చుట్టూ చూసాడు. ఆ ప్రదేశం అంతా నిర్మానుష్యంగా వుంది.

గునపంతో మైలురాయిని తవ్వి పక్కన పడేసాడు సింహాచలం. అనుభవమున్న డాక్టర్ టాన్సిల్స్ ఆపరేషన్ యెంత చకచకా చేస్తాడో, అదే విధంగా అక్కడ వున్న మట్టిని తవ్వేసి పెద్ద గొయ్యి తీశాడు.

అక్కడ జరుగుతున్న ఘోరం యెవరికీ కనపడకుండా అడ్డుగా, నిశ్చలంగా నిలబడి వుంది సైదులు లారీ.

ఆ తరువాత రాజారావు శవాన్ని ఈడ్చుకొని వచ్చాడు సింహాచలం. ఇద్దరూ సాయం పట్టి శవాన్ని గోతిలోకి దించారు.

భారంగా నిట్టూర్చి గోతిలో మట్టి వేశాడు సైదులు. వాళ్ళ చేతులు మిషన్‌కన్న వేగంగా కదిలి గొయ్యిని దాదాపు పూడ్చివేసారు. సింహాచలం యిందాక పడేసిన మైలురాయిని బలంగా యీడ్చుకొని వచ్చి గొయ్యిమీద నిలిపాడు. సైదులు ఆ రాయి చుట్టూ మట్టి కప్పాడు. క్షణంలో రాయి మళ్ళీ మామూలు పొజిషన్‌కి వచ్చింది. సింహాచలం చకచకా ఆ రాయిని కడిగేశాడు రక్తం మరకలు లేకుండా. ఆ తరువాత పారా, గునపం లారీలో పడేసాడు సింహాచలం. రాజారావు స్కూటర్ని కూడా లారీలో వేసుకున్నారు.

సైదులు ఆ పరిసరాల్ని తృప్తిగా చూపి సిగరెట్టు వెలిగించుకొని లారీ యెక్కాడు. అవతలి పక్క నుండి సింహాచలం కూడా లారీ ఎక్కాడు. సంతృప్తిగా నిట్టూర్చి లారీ స్టార్ట్ చేసాడు సైదులు. క్షణంలో లారీ కనుమరుగయింది.

ప్రపంచంలో యిన్ని ఘోరాలు జరుగుతున్నా, ఆఖరికి తన క్రిందే ఒక శవాన్ని పాతిపెట్టినా తనకేం పట్టనట్టు, ఆ ఘోరానికి, తనకి ఏం సంబంధం లేనట్టు, నిశ్చలంగా, రాయిలా నిలబడిపోయింది ఆ మైలురాయి.

5

"దేశం చాలా విపత్కరపరిస్థితుల్లో వుంది. భారతీయులు భుజం భుజం కలిపి దేశాన్ని పట్టి పీడిస్తున్న లోపలి ప్రమాదాలు, బయటి ప్రమాదాల నుంచి దేశాన్ని కాపాడాలి. దానికి మనవంటి సమర్థులైన డిటెక్టివ్‌లే కావాలి. కాని ఆ విషయాన్ని భారతీయులు యెవరూ గుర్తించటం లేదు. అయినా నాకు బాధలేదు. కృషి వుంటే మనిషి ఋషి అవుతాడు. మహాత్ముడవుతాడు. అందుకే కొన్ని కేసులకి ఫీజు రాకపోయినా దేశక్షేమం కోసం ఆ కేసుల్ని పరిష్కరించాను. నా బాటలోనే మీరూ సాగాలని నా కోరిక" అన్నాడు పరిశోధనరావు.

అప్పటిదాకా ఆ ఉపన్యాస ప్రవాహ హోరులో కొట్టుకొనిపోతున్న ఓంకారం, శ్రీకారంలు, పరిశోధనరావు ఆపంగానే కళ్ళు తెరిచి చూశారు.

ఇప్పటిదాకా సాగిన ఉపన్యాసాన్ని 'సుత్తి' అనాలా లేక దానికన్నా పెద్దమాట ఏదన్నా వుందా అని దీర్ఘంగా ఆలోచించారు ఓంకారం, శ్రీకారాలు.

వాళ్ళ ఆలోచనలతో తనకేం పని లేనట్టుగా కేకలు

పెట్టసాగింది ఆ పక్కనేవున్న ఫోన్. స్టయిల్‌గా ఫోన్‌ని అందుకోబోయి, అది అందదని గ్రహించి కొంచెం ముందుకి వంగి ఫోన్ అందుకొన్నాడు పరిశోధనరావు.

ఐదు నిముషాలు మాట్లాడి ఫోన్ పెట్టేసాడు పరిశోధనరావు.

ఆనందంతో వున్న పరిశోధనరావు మొహాన్ని చూసి సంగతేమిటని కళ్ళతోనే ప్రశ్నించారు ఓంకారం, శ్రీకారంలు.

"ఇన్‌స్పెక్టర్ శశికాంత్‌కి ఏదో కేసు తగిలిందట, ఆ కేసులో మనకేదన్నా ఇంట్రస్ట్ వుండి, ఖాళీగా వుంటే రమ్మన్నాడు. మనకి ఖాళీయేగదా, వస్తామని చెప్పా" అన్నాడు పరిశోధనరావు గర్వంగా.

"ఛీ! ఛీ! ఎఫ్.ఎస్. కేసు అయింటుంది, మనకొద్దు" అన్నాడు శ్రీకారం చిరాగ్గా.

"మనకొచ్చేవన్నీ ఫీజులేని కేసులేగా" వెక్కిరించాడు ఓంకారం.

డిపాజిట్ కూడా దక్కదని ఆశ వదిలేసుకొన్న మనిషి బంపర్ మెజారిటీతో గెలిస్తే యెలా నవ్వుతాడో అలా నవ్వాడు పరిశోధనరావు.

"పిచ్చివాళ్ళల్లారా, ఏనాడూ మనల్ని తనకొచ్చిన కేసుల విషయమై పిలవని ఇన్‌స్పెక్టర్ శశికాంత్ ఈనాడు పని కట్టుకొని పిలిచాడంటే అర్థం మన ప్రతిభ విషయం ఆయనకి కూడా తెలిసివుంటుంది. అందుకే నడవండి. పోలీసులకి సహాయపడటం మన విధి" అని కుర్చీలోంచి లేచాడు పరిశోధనరావు.

పరిశోధనరావుని, ఇన్‌స్పెక్టర్ శశికాంత్‌ని తిట్టుకొంటూ, విధిలేక పరిశోధనరావుని అనుసరించారు ఓంకారం,

శ్రీకారంలు.

ఆఫీసుకి తాళంపెట్టి పోలీసుస్టేషన్ వైపు బయలుదేరాడు పరిశోధనరావు. మౌనంగా పరిశోధనరావు వెంట నడవ సాగారు ఓంకారం, శ్రీకారంలు.

కుడికాలు లోపలికి పెట్టి పోలీస్ స్టేషన్ ప్రవేశించాడు పరిశోధనరావు. అందరూ సంస్కారవంతంగా నమస్కారములు చేసుకొని యెవరి సీట్లలో వాళ్ళు కూర్చొన్నారు.

"ఆ చెప్పండి! ఏమిటి మమ్మల్ని పిలిచిన కారణం" అన్నాడు పరిశోధనరావు.

"వీరు సుబ్రహ్మణ్యంగారు. వీరి నాన్నగారి పేరు రాజారావుగారు. వీరికి తాడేపల్లిగూడెంలో ఒక నగలకొట్టు వుంది. నివాసం మాత్రం తణుకులోనే" అన్నాడు శశి కాంత్.

"తాడేపల్లి గూడెంలో కొట్టు వుంటే తణుకులో ఉండటం యెందుకు?" అని ప్రశ్నించాడు పరిశోధనరావు సుబ్రహ్మణ్యంని గంభీరంగా చూస్తూ.

"మాకు తణుకులో సొంత యిల్లు వుంది. తాడేపల్లి గూడెంలో మా నాన్నగారికి తెలిసిన ఫ్రెండ్ ఒకరు విదేశాలకి వెళ్ళిపోతూ అతనికి వున్న నగల కొట్టుని మా నాన్న గారికి తక్కువ రేటుకి అమ్మేసి వెళ్ళిపోయాడు. గుడ్‌విల్ వుంది కదా అని ఆ కొట్టుని తీసుకొన్నారు నాన్నగారు. అప్పటి నుంచి సొంత ఇల్లు అద్దెకివ్వటం ఇష్టంలేక తణుకులోనే వుంటూ, రోజూ తాడేపల్లిగూడెం వెళ్ళి కొట్టు వ్యవహారాలు చూసుకొని వస్తున్నారు నాన్నగారు" అని వివరించాడు సుబ్రహ్మణ్యం కాస్త విసుగ్గా.

"మరి మమ్మల్ని పిలిచిన కారణం ఏమిటి, కొట్టులో ఏదైనా దొంగతనం జరిగిందా, ఎంత పోయింది?" అని

ప్రశ్నించాడు పరిశోధనరావు.

"నేను ఏం చెప్పలేదు మిమ్మల్ని పిలవమని. మా నాన్న గారు నిన్నటి నుంచి కనపడ్డంలేదు" అన్నాడు సుబ్రహ్మణ్యం బాధగా.

"కనపడుట లేదు అని పేపర్లో ప్రకటన వేయక పోయారా, లేకపోతే ఏమిటి? ఒకరోజు ఏదో పని వుండి ఇంటికి రాలేకపోయినంత మాత్రాన అన్నేళ్ళు వచ్చిన మనిషి ఏమవుతాడు?" అన్నాడు పరిశోధనరావు నెమ్మదిగా.

"మా నాన్నగారి గురించి తెలిస్తే ఇలా అనరు. రోజూ ఉదయం తొమ్మిది గంటలకి ఇంటి నుండి బయలుదేరి తొమ్మిదిన్నరకి తాడేపల్లిగూడెం చేరుతారు. మళ్ళీ రాత్రి తొమ్మిదిన్నరకి తాడేపల్లిగూడెంలో బయలుదేరి పది గంట లకి తణుకు వస్తారు. మా నాన్నగారు టైము పాటించే వ్యక్తి. ఒకవేళ ఏదన్నా పని వుండి రావటానికి ఆలస్యం అయితే ఫోనుచేసి చెబుతారు. అంతేకాని ఇలా రాకుండా వుండరు. అప్పటికీ తాడేపల్లిగూడెంలో మా షాపుకి పక్కన వుండే షాపువారికి ఫోన్ చేశాను మా నాన్నగారి విషయమై ఆయన రోజూమాదిరే తొమ్మిదిన్నరకి షాపు నుంచి బయలుదేరారట. మా ఇంట్లో ఒకటే ఖంగారు" అన్నాడు సుబ్రహ్మణ్యం దిగులుగా.

"మరి పోలీసు రిపోర్టిచ్చారా?" అని ప్రశ్నించాడు పరిశోధనరావు అనాలోచితంగా.

సుబ్రహ్మణ్యానికి ఆ ప్రశ్న వినగానే ఒళ్ళు మండి పోయింది.

"ఆ ఇచ్చాను. వాళ్ళే మిమ్మల్ని పిలిచారు" అన్నాడు సుబ్రహ్మణ్యం అక్కసుగా.

"ఆ! అవును కదా. మరి యిప్పుడు ఏం చేద్దాం?" అన్నాడు పరిశోధనరావు.

"ఏముంది? ఇక్కడి నుంచి జీపులో బయలుదేరి తాడేపల్లిగూడెం వెళదాము. అక్కడికి వెళ్ళి ఎంక్వయిరీ చేద్దాం. ప్రస్తుతానికి అంతకన్నా చేయగలిగింది ఏదీ లేదు" అన్నాడు శశికాంత్.

"సరే మీ యిష్టం. ఉపయోగం వుండకపోయినా ప్రయోగం చేయాలి గదా. నడవండయితే" అన్నాడు పరిశోధనరావు.

ఇన్‌స్పెక్టర్ శశికాంత్. పరిశోధనరావు. ఓంకారం, శ్రీకారం, సుబ్రహ్మణ్యం మరి ఇద్దరు కానిస్టేబుల్స్ కలిసి జీపులో తాడేపల్లిగూడెం బయలుదేరారు - నిర్జీవుడైన రాజారావు యొక్క సజీవమైన ఆచూకీ కోసం.

6

"డామిట్, వెధవ జీపు పట్టుమని పది కిలో మీటర్లు ప్రయాణం చేసిందో లేదో, చెడిపోయింది" అని తిట్టుకొంటూ జీపు దిగాడు శశికాంత్.

"ప్రభుత్వ వాహనము కదా అంతే. అయినా పది కిలో మీటర్లు ప్రయాణమైనా చేయగలిగాం గదా, అదే పదివేలు" అన్నాడు పరిశోధనరావు.

"వెధవ జీపులో కూర్చొని కూర్చొని విసుగ్గా వుంది బాబూ" అంటూ జీపు దిగాడు ఓంకారం. ఓంకారం జీపు దిగంగానే మిగిలిన అందరూ దిగారు.

"ఎక్కడికీ వెళ్ళకండి బాగై పోతుంది జీపు" అన్నాడు ఓంకారాన్ని, శ్రీకారాన్ని ఉద్దేశించి ఇన్‌స్పెక్టర్ శశికాంత్.

"అబ్బే, ఊరికే అలా ప్రకృతి సౌందర్యాన్ని తిల

కిస్తున్నాం. అలా వెళ్ళి ఆ రాయి దగ్గర కూర్చొంటాం" అన్నాడు ఓంకారం ఆ రాయికేసి కదులుతూ.

శ్రీకారం నెమ్మదిగా ఓంకారాన్ని అనుసరించాడు.

ఇంతలో శ్రీకారం కళ్ళల్లో పిడికెడు మట్టి విసురుగా వచ్చి పడింది. "అబ్బా" అని మూలిగి కళ్ళు మూసుకొంటుంటే. దూరంగా 'అమ్మా' అని ఓంకారం విరుచుకు పడ్డట్టు కేక వినబడింది శ్రీకారానికి. కళ్ళు తెరిచే సాహసం చేయలేకపోయాడు శ్రీకారం.

ఈ 'అబ్బా' 'అమ్మా' అన్న కేకలు వినబడంగానే పరుగు పరుగున ఓంకారం, శ్రీకారం వున్న దగ్గరికి వచ్చారు అందరూ.

"ఛస్, దీని సిగ తరగ. ఈ మైలు రాయిని పాతిన వారు గట్టిగా పాతనక్కరలేదూ, బోలు బోలుగా పాతారు" అని పడ్డచోటునుంచి లేచి వచ్చాడు ఓంకారం.

"చాల్లే, ఆ రాయిమీద ఎవరు కూర్చోమన్నారు నిన్ను. అది గట్టిగా పాతకపోవటంతో నువ్వు పడ్డావు. అంతటితో ఆగిందా, నీతోపాటు ఆ రాయీ పడింది. ఆ పడటంలో దాని అడుగున వున్న మట్టి కాస్త వచ్చి మన శ్రీకారం కళ్ళల్లో చోటు చేసుకొంది" అన్నాడు పరిశోధనరావు.

"ఏం జరిగింది?" అని ఆతృతగా ప్రశ్నించాడు శశికాంత్.

"ఏమీ లేదు. చిన్న ఏక్సిడెంట్" అన్నాడు పరిశోధన రావు గంభీరంగా.

"అరె, ఇది ఏమిటి? ఈ పర్సు నీదా?" అని మట్టిలో ఉన్న పర్సు తీసి ఓంకారానికి చూపించాడు ఇన్స్పెక్టర్

శశికాంత్.

ఓంకారం ఆ పర్సు 'నాది కాదు' అన్నాడు. శ్రీకారం కళ్ళు తెరిచే ప్రయత్నం ఏమాత్రం చేయకుండానే చేత్తో ఆ పర్సుని తడిమి 'నాది కాదు' అన్నాడు. అక్కడ వున్న ఎవరిదీ కాదు ఆ పర్సు.

పర్సు తీసి చూసిన ఇనస్పెక్టర్ శశికాంత్ షాక్ తిన్నాడు. అందులో 'సైదులు లారీడ్రైవర్, తణుకు' అన్న ఎడ్రస్‌తోపాటు సైదులు ఫోటో కూడా వుంది. అందరూ సైదులు మొహాన్ని ఆత్రుతగా పరిశీలించారు.

"ఓరిని వీడి ప్లాను సంతకెళ్లా. ఈ రాయి వీడికి సేఫ్టీ లాకర్‌లా వుపయోగపడుతున్నట్టు వుంది. హాయిగా డబ్బు దాచుకొంటున్నాడు. అందుకే నన్నమాట రాయి ఒదులుగా వుంది" అన్నాడు పరిశోధనరావు తెలివిగా.

"ఈ పర్సు పొరపాటున పడి వుంటుంది. ఏదేమైనా దీనికింద ఒక్కసారి తవ్వి చూస్తే కాని తెలియదు" అన్నాడు ఇనస్పెక్టర్ శశికాంత్ సాలోచనగా.

ఆ మాట ఇనస్పెక్టర్ శశికాంత్ నోటి వెంట ఎప్పుడయితే వెలువడిందో దాంతో అక్కడ సందడి మొదలైంది. వెంటనే చేతులతో, కట్టెపుల్లలతో మట్టిని తవ్వి తీయసాగారు. కొద్ది క్షణాలలోనే మైలురాయికింది శవం బయటికి వచ్చింది. అందరూ అదిరిపోయారు.

"నాన్నా" అంటూ శవం మీదపడి బావురుమన్నాడు సుబ్రహ్మణ్యం.

వెదకబోయిన తీగ కాలికి తగిలినందుకు నవ్వాలో, సుబ్రహ్మణ్యం ఫాదర్ రాజారావు చనిపోయినందుకు ఏడవాలో తెలవక మొహం అదోలా పెట్టి, అలా పెడితే తన

మొహం బాగుండదని తెలిసి మొహాన్ని సీరియస్‌గా పెట్టి "మీ పని కానివ్వండి" అని తన వాళ్ళను హెచ్చరించాడు శశికాంత్.

"ఈ హత్య సరిగ్గా రాత్రి తొమ్మిది గంటల నలభై నిమిషాలకి జరిగి వుంటుంది" అన్నాడు పరిశోధనరావు గంభీరంగా.

శశికాంత్‌తో సహా అంతా తెల్లబోయి చూస్తున్నారు పరిశోధనరావు తెలివికి ఒక్క ఓంకారం తప్ప.

"మరేం లేదు. సుబ్రహ్మణ్యంగారు చెప్పినదాని ప్రకారం లెక్కకట్టి మా బాసుగారు హత్యా సమయాన్ని అంచనా వేసారు" అన్నాడు ఓంకారం. పదవి నుంచి ఊడబెరకబడ్డ కరణంలా అయింది పరిశోధనరావు మొహం.

శవాన్ని పోస్టుమార్టంకి పంపించి వేసారు త్వరత్వరగా.

అక్కడి నుండి హుటాహుటిన సైదులు ఇంటికి బయలుదేరారు అందరూ. నిముషంలో సైదులు స్వేచ్ఛా జీవితాన్ని కోల్పోయాడు, సింహాచలంతోసహా. సైదులు చెప్పిన సమాచారం ప్రకారం సైదుల్ని తీసుకొని గురుమూర్తి యింటికి బయలుదేరారు అందరూ. గురుమూర్తి ఇంతమందిని చూసి ఖంగు తిన్నాడు. తేరుకొని పరుగు అందుకోబోయేలోగా గురుమూర్తి చేతికి బేడీలు బిగుసుకొన్నాయి. మరుక్షణం పోలీస్ జీప్‌లో వున్నాడు గురుమూర్తి. ఆ మరుక్షణంలో పోలీసు స్టేషన్‌లో వున్నాడు.

"మిస్టర్ గురుమూర్తి! నీకు ఎందుకా దుర్బుద్ధి పుట్టింది?" అని అడిగాడు శశికాంత్.

"గురుమూర్తి ఏం చెబుతాడు, నేను చెబుతాను" అన్న

మాటలు వినబడి అందరూ గుమ్మం వైపు చూసారు.

"స్వప్నా:" అన్నాడు ఆశ్చర్యంగా సుబ్రహ్మణ్యం.

"అమ్మా! నీవా, ఎందుకు వచ్చావు తల్లీ!" అన్నాడు గురుమూర్తి బాధగా.

"ఛీ, నీవు తండ్రివని చెప్పుకోవటానికే సిగ్గుగా వుంది. సుబ్రహ్మణ్యం వాళ్ళ ఫాదర్ పెళ్ళికి ఒప్పుకోలేదని అతన్ని చంపేసి, సుబ్రహ్మణ్యంతో నా పెళ్ళి జరిపించి ఆ ఆస్థి కాజేద్దామన్న దురాలోచనతో ఈ పని చేసావు. నీవు చేసిన పనికి నేను సిగ్గు పడుతున్నాను" అంది స్వప్న తల వొంచుకొని.

"అమ్మా" అని బాధగా మూలిగాడు గురుమూర్తి.

"నో! అంత చిన్నకారణానికే హత్యచేస్తాడా, ఇంకేదో కారణ ముండి వుంటుంది. పోలీసు మర్యాద చవిచూడక ముందే నిజం చెప్పు గురుమూర్తీ" అన్నాడు శశికాంత్ కోపంగా. ఆ మాట వినగానే మర్యాద చేయటానికి పోలీసులు రెడీ అయ్యారు.

తల వొంచుకొని గురుమూర్తి చెప్పిన మాటలు వినగానే షాక్‌తో తలలు ఎత్తారు అందరూ.

గురుమూర్తి తెచ్చే దొంగ బంగారాన్ని. కొన్ని వజ్రాలని అమ్మమని రాజారావుతో చెప్పాడట గురుమూర్తి. కాని ఆ విషయం ఇంకోసారి ఎత్తితే పోలీసు రిపోర్టు ఇస్తానన్నాడట రాజారావు. రాజారావు బ్రతికి వుంటే ఎప్పటికయినా మన విషయం బైటపెట్టవచ్చు. తన కూతురిని తన కోడలిగా చేసుకోనన్న రాజారావు పోతే, సుబ్రహ్మణ్యం కళ్ళకద్దుకొని స్వప్నని తన భార్యగా చేసుకొంటాడు. ఇలా ఆలోచించి సైదులు ద్వారా రాజారావుని

పరలోకానికి పంపించాడు గురుమూర్తి. రాజారావు జీవితాన్ని సమాధి చేసాడు.

గురుమూర్తి చెప్పింది విని ఆవేశంగా లేచి గురుమూర్తి మీదకి పోయాడు సుబ్రహ్మణ్యం. గురుమూర్తి నిర్లిప్తంగా నిలుచున్నాడు.

"శాంతం శాంతం" అని అరిచి సుబ్రహ్మణ్యంని దూరంగా లాక్కు వెళ్ళాడు ఓంకారం.

పోలీసులు గురుమూర్తికి ఊసలు లెక్కించే డ్యూటీ అప్పగించి తాళం వేసారు. సైదులు, సింహాచలం గురుమూర్తికి సహాయంగా పంపబడ్డారు. □

మరో సభ్యుడు



గుప్త దర్బారు

వసుంధర సీరియల్

(గతసంచిక తరువాయి)

అవతల ఫోన్ క్లిక్ మంది.

గోపాలకృష్ణ ఉన్నపళంగా బయల్దేరి జయరామయ్య ఇంటికి వెళ్ళాడు. ఆత్రుతగా కాలింగ్ బెల్ మ్రోగించాడు.

ఆ సమయానికి వీరభద్రం లోపల అట్లు తింటున్నాడు.

జయరామయ్య తలుపుదాకా వెళ్ళి వ్యాయర్లోంచి వచ్చిం దెవరో చూసి భార్యకు సైగ చేశాడు.

ఉన్నపళంగా లోపల ఏర్పాట్లు మారిపోయాయి.

వీరభద్రం నోట్లోవున్న లడ్డు గుటుక్కున మింగి మంచంమీద పడుకుని మూలగసాగాడు. కామాక్షమ్మ జాలి చూపులతో దిగులు నటిస్తూ కూర్చున్నది.

అప్పుడు జయరామయ్య తలుపు తీసి గోపాలకృష్ణను చూస్తూనే "భలేవాడివయ్యా—కన్నకొడుకును మా దగ్గర వదిలేసి యింతసేపూ ఏంచేస్తున్నావ్? నిన్న రాత్రంతా వాడికీ మాకూ నిద్రలేదు" అన్నాడు.

గోపాలకృష్ణ త్వరత్వరగా వీరభద్రం వున్న గదిలోకి వెళ్ళాడు.

"నేను చెప్పానుగా—ఆ వచ్చింది డాడీయే" అంటూ లేచి కూర్చున్నాడు వీరభద్రం.

"రాత్రి నుంచీ చీమ చిటుక్కుమన్నా ఇదేవరస బాబూ-యిప్పటికి నువ్వు నిజంగా వచ్చావు" అంది కామాక్షమ్మ.

గోపాలకృష్ణ అసహాయంగా బాబువంక చూశాడు.

వాడి ముఖం యెంతో అమాయకంగా వున్నది. ఏదో అనాలనుకుని కూడా ఏమీ అనలేకపోయాడతను.

"డాడీ—రాత్రి యెందుకు రాలేదు?"

"నా యిష్టం—నువ్వెవరూ నన్నడగడానికి?" అన్నాడు గోపాలకృష్ణ.

"బాగుందయ్యా—కన్న కొడుకును లాలించే పద్ధతి అదేనా?" అంది కామాక్షమ్మ కోపంగా.

"వాడు నా కన్నకొడుకు కాదంటూంటే" అన్నాడు గోపాలకృష్ణ.

"వాడు నీ కన్నకొడుకు కాదూ!"

గోపాలకృష్ణ ఆశ్చర్యంగా అక్కడున్న ముగ్గురి వంకా చూశాడు. వాళ్ళెవ్వరి పెదాలూ కదలడం లేదు. అదీకాక ఆ గొంతు కొత్తగా వున్నది.

ఎవరా మాట అన్నది?

అతను వెనక్కు చూశాడు. ఎవరూ లేరు.

మళ్ళీ ముందుకు చూశాడు.

"చెప్పు—వాడు నీ కన్నకొడుకు కాదూ?"

అతడికి మళ్ళీ అదే స్వరం వినిపించింది. మనిషి కన బడలేదు—"ఎవర్నువ్వు?" అన్నాడతను అప్రయత్నంగా.

"ఏంటి బాబూ—ఎవర్నడుగుతున్నావు?" అంది కామాక్షమ్మ.

అతడామె వంక ఆశ్చర్యంగా చూసి—"వాడు నీ కన్న కొడుకు కాదూ—అని యెవరో రెండుసార్లడిగారు. మీకు వినబడలేదా?" అన్నాడు.

"ఎవరో కాదు. నీ అంతరాత్మే అయుంటుంది. అందుకే నీ కొక్కడికే వినిపించింది" అన్నాడు జయరామయ్య తేలిగ్గా తీసిపారేస్తూ.

"కాదు—నేను స్పష్టంగా విన్నాను" అన్నాడు గోపాల కృష్ణ.

"డాడీ—అలా అనొద్దు నాకు భయమేస్తోంది" అన్నాడు వీరభద్రం.

"నీకూ వినబడలేదా ఆ మాటలు" అన్నాడు గోపాల కృష్ణ.

అతను తప్ప యింకెవరూ ఆ మాటలు వినలేదు

"నువ్వు భోజనానికి తయారవు. నిన్నట్నించీ బాబు భోజనం చేయలేదు" అంది కామాక్షమ్మ.

"నేను భోంచేయను. ఎవరైనా నిరాహారదీక్ష ఫలరసం తోటే ముగిస్తారు. డాడీయే నాకు ఫలరసం యివ్వాలి" అన్నాడు వీరభద్రం.

గోపాలకృష్ణ బాబుకు మనస్ఫూర్తిగానే ఫలరసం యిచ్చాడు.

"డాడీ—ఇంకెప్పుడూ నన్ను వదిలి ఇంతసేపుండవు కదూ?" అన్నాడు వీరభద్రం వస్తున్న యేడ్పును నొక్కిపెడుతూ.

గోపాలకృష్ణ సానునయంగా "బాబూ—నన్నెందుకిలా కాలుస్తున్నావు? నేను నిన్ను తంతానని భయం లేదా?" అన్నాడు.

"మీ నాన్నంటే నీకు ఇష్టమా, భయమా?" అన్నాడు వీరభద్రం.

"ఇష్టమే!"

"నాకూ అంతే!"

"కానీ నేను మీ నాన్నని కాదు."

"అమ్మ చెప్పిందిలే—నువ్వు అబద్ధాలకోరువని!

"ఎక్కడుంది అమ్మ?" చాలా ఆతృతగా అడిగాడు గోపాలకృష్ణ. ఆ మహాతల్లి ఉనికి తెలిస్తే ఎలాగో అలా సాధించవచ్చు.

"చచ్చిపోయింది"—వీరభద్రం ఏడుపు లంకించుకున్నాడు. వాణ్ణి సముదాయించేసరికి గోపాలకృష్ణ తలప్రాణం తోకకు వచ్చింది.

"నువ్వు మంచివాడివి కాదు. నీకు మీ నాన్నంటే ఇష్టం లేదు. నావన్నీ తాతగారి పోలికలేనని అమ్మ నాకు చెప్పింది. అయినా సరే నువ్వు నాతో సరిగ్గా మాట్లాడవు" అన్నాడు వీరభద్రం.

గోపాలకృష్ణ మరోసారి బాబువంక పరీక్షగా చూశాడు. అప్పుడతనకి వాడిలో తన తండ్రి పోలికలు కనిపించాయి.

అతడి ఆలోచనలు పరిపరి విధాల పోయాయి.

తను అనేక మంది స్త్రీలను అనుభవించాడు. వారిలో యెవరికైనా యీ బాబు పుట్టివుండ వచ్చును.

లేక తను భ్రమపడుతున్నాడా?

36

రెండు రోజుల అనంతరం గోపాలకృష్ణకు మళ్ళీ "నిను వీడని నీడను" నుంచి ఫోన్‌కాల్ వచ్చింది.

ఆ పేరు వింటూనే అదిరిపడ్డా డతను.

"ఈ రెండు రోజులుగా బాబుకు బాగా చేరిక అయ్యావు. చాలా సంతోషం. అంత మాత్రాన నీ ఇతర దోషాలన్నీ క్షమించలేను."

"ఏమిటవి?"

"రోజా నిన్ను యాభై వేలు అడుగుతోంది—"

"ఎందుకూ?"

"అయ్యో—నీ తలగడ క్రిందనున్న కవర్లో ఫోటోలు చూడలేదా?"

అతను అప్రయత్నంగా దిండు ఎత్తి చూశాడు. ఓ కవరు. అందులో కొన్ని ఫోటోలు. బాంబూ హౌస్. అందులో తను, రోజా—రోజా కళ్ళలో భయం ...తన తన చేతిలో కత్తి....

నాలుగైదు రకాల ఫోజుల్లో ఫోటోలు....

"ఫోటోలు బాగా వచ్చాయా?" అంది గౌరి.

"ఈ ఫోటోలు చూడగానే గుర్తొచ్చింది. రోజాతో ఏ అనుభవమూ లేకుండా చేశావు. నా ఉసురు నీకు తగు ల్తుంది" అన్నాడు గోపాలకృష్ణ.

"ఉసురు సంగతలా వుంచు—ముందు యాభై వేలూ ఇవ్వకపోతే—రోజా పోలీస్టేషన్‌కు వెళ్ళాల్సి వుంటుంది" అంది గౌరి.

"ఓహ్—రోజా వెల అన్నమాట యాభై వేలు!"

అవతలపక్క నుంచి నవ్వు వినిపించింది.

"మై డియర్ ఫ్రెండ్—ఆడదానికి విలువకట్టేది మగవాడి బలహీనత! మగవాడికి ఎంత యెక్కువ బలహీనత వుంటే ఆడదాని ఖరీదు కూడా అంతగా పెరుగుతోంది. నీ బలహీనత ఏమిటో తెలుసా? ఏ మాత్రమూ అర్థంలేని—పరువు, హోదా! నువ్వు బలహీనుడివి కావనుకుంటే రోజాని పోలీస్ స్టేషన్‌కు వెళ్ళనీ—"

"డబ్బు యెక్కడివ్వాలో చెప్పు" అన్నాడు గోపాలకృష్ణ.

హోటల్ అన్నపూర్ణ రిసెప్షన్ కౌంటర్లో డబ్బున్న బ్రీఫ్‌కేసు యిమ్మనమని గౌరి అతడికి చెప్పింది. ఆ ప్రకారం గోపాలకృష్ణ బ్రీఫ్‌కేసు అక్కడ అందజేశాడు. అది అతి రహస్యంగా వెంకన్న యింటికి చేరింది.

"ఈ యాభై వేలూ ఏం చేస్తారు?" అంది పద్మావతీదేవి.

"అంతా కలిపి పంచుకుందాం" అంటూ వెంకన్న బ్రీఫ్‌కేసు తెరిచాడు.

పద్మావతీదేవి అందులోకి ఆత్రంగా తొంగి చూసింది. అందులో రెండే రెండు చాక్లెట్సు, ఓ చీటీ వున్నాయి.

"ఒకటి రోజాకు, ఒకటి నా నీడకు. బుద్ధిగా చెరోటీ తీసుకోండి. దెబ్బలాడుకోకండేం?"

గౌరికి యింతా అంతా అనరాని కోపం వచ్చింది. వెంటనే ఆమె గోపాలకృష్ణకు ఫోన్ చేసింది.

అవతల నుంచి గోపాలకృష్ణే రిసీవర్ ఎత్తాడు.

"నీ బ్రీఫ్‌కేసు అందింది. ఫలితం అనుభవిస్తావు" అంది గౌరి.

"ప్రియమైన నా నీడా! ఫలితం అంటే పోలీస్టేషనేగా- ఆ ఫోటోలు పోలీస్‌స్టేషన్లో యిస్తానంటే నాకేమీ అభ్యంతరం లేదు. కానీ అంతకు ముందు నువ్వోసారి వెళ్ళి బాంబూ హౌస్‌ను చూడ్డం మంచిది."

అవతల ఫోన్ క్లిక్‌మంది.

గౌరి తన సంభాషణను వెంకన్నకు చెప్పింది.

అంటే—ఇందులో ఏదో ట్రాప్ వుంది. నువ్వక్కడికి వెళ్ళొద్దు" అన్నాడు వెంకన్న.

గౌరి వెంకన్న మాటలు వినలేదు. ప్రాణాలకు తెగించి వున్నదామె. అందుకని వెంటనే బాంబూ హౌస్‌కు వెళ్ళింది. అప్పు డామెకు కలిగిన ఆశ్చర్యం యింతా అంతా కాదు.

ఆ ప్రదేశంలో ఇప్పుడు బాంబూ హౌస్ లేదు. ఒకప్పుడలాంటిది ఉన్న జాడ కూడా లేదు.

అంటే—గోపాలకృష్ణ క్షణాల మీద దాన్ని నేలమట్టం చేయించాడన్న మాట. తను సంపాదించిన సాక్ష్యాధారాల్ని పనికి రాకుండా చేశానన్న ధైర్యంతోనే అతను తనకు డబ్బుకు బదులు చాక్లెట్లు పంపాడు.

గౌరి యింటికి తిరిగి వచ్చి వెంకన్నకు విషయం చెప్పింది.

"ఆ బాంబూ హౌస్ వినాయకరావు విలాసజీవితానికి ప్రతిబింబంగా వుంటోంది ఎన్నో ఏళ్ళుగా. అది నీ కారణంగా నాశనమయింది. రావణుడు చావాలంటే ముందుగా ఇంద్రజిత్తు, కుంభకర్ణులు చావాలి. అది మనకు గొప్ప శుభశకునం. అంత గొప్పగానూ వారికి అపశకునం"

అన్నాడు వెంకన్న.

బాంబూ హౌస్ గురించి తాము సంపాదించిన ఆధారాలు వృధా అయ్యాయన్న బాధకంటె—అవి నాశనమయిందన్న సంతోషమే యెక్కువగా పొందారు గౌరి, వెంకన్న లిద్దరూ కూడా.

పద్మావతీదేవి మాత్రం "నాదో అనుమానం" అంది.

"చెప్పు" అన్నాడు వెంకన్న.

"ఆ బాంబూ హౌస్ వినాయకరావుది. అ దాయనకు యెంతో బాగా వుపయోగపడుతోంది. కానీ దాన్నాయన గోపాలకృష్ణ కోసం క్షణాలమీద నాశనం చేయించాడు. అంటే అతడి కాయన హృదయంలో వున్న స్థానమేమిటి?"

ఈ ప్రశ్న వింటూనే గౌరి భయపడింది. వినాయకరావు చాలా బలవంతుడు. తన భర్తకోసం, ఆయన ఏమైనా చేయగలడా?

భార్య ప్రశ్న వింటూనే వెంకన్న—"చాలా మంచి ప్రశ్న వేశావు. గోపాలకృష్ణ కోసం వినాయకరావు ఏ మాత్రం త్యాగం చేయగలడూ అన్నది చూడాలి. గోపాలకృష్ణ చేసిన తప్పుల్ని ఆయన ఎంతకాలం సహిస్తాడూ అన్నది కూడా వేచి చూడాల్సిందే" అన్నాడు.

గౌరి ఈ సంభాషణ వినడం మానేసింది.

గోపాలకృష్ణ తన బాబును ఆదరణగా చూస్తున్న దృశ్యాలు ఆమె కళ్ళముందు మెదుల్తున్నాయి.

"ఈ దృశ్యాలు—వాస్తవంలో శాశ్వతంగా కావడం కోసం ఏమైనా చేస్తాను ...ఏమైనా చేస్తాను!" అనుకున్న దామె మనసులో.

37

టైగర్ — మన గోపాలకృష్ణగాడు తప్పుతున్నట్లు కనబడు తుంది. నీ అభిప్రాయమేమిటి?" అన్నాడు వినాయకరావు.

"పాపాలుచేసి తట్టుకునే సామర్థ్యం మనకున్నట్లుగానే అందరికీ యెలా వుంటుంది బాస్.

"ఉండదంటే ఎలా? ఉండేలా చేయాలి...."

"వద్దు బాస్...." అన్నాడు టైగర్. "గోపాలకృష్ణ గురించి మనం ఆలోచించ వద్దు. అతను మనకు మెరిక ల్లాంటి మనుషుల్ని ఇద్దరి నిచ్చాడు. మన మిప్పుడు వాళ్ళిద్ద రినీ ఉపయోగించుకోవడం గురించి ఆలోచించాలి."

వినాయకరావు ఆలోచిస్తూ "అది సరే-ఇంతకీ గోపాల కృష్ణను బెదిరిస్తున్న ఆ నీడ యెవరంటావ్?" అన్నాడు.

"నా అనుమానం ఆ గౌరికి సంబంధించిన వాళ్ళని. ఏది ఏమైనా ఆ నీడ గురించి నే నాలోచించదల్చుకోలేదు. అది పూర్తిగా అతడి వ్యక్తిగత విషయం. ఇలాంటివన్నీ ఆలోచిస్తూ కూర్చుంటే మన పనులు దెబ్బతింటాయి. ముఖ్యంగా మనకు రెండు రోజుల్లో బంగారం రానున్నది. ఈ సారి కొత్త మనిషిని ఆపరేషన్‌కి పంపిస్తే బాగుం టుంది. ఎక్కువ కాలం నేనూ యిలాంటి పనులమీద వెళ్ళడం—మనకే మంచిది కాదనిపిస్తోంది" అన్నాడు టైగర్.

"కొత్త మనిషి అంటే?"

"మోహన్!"

"అప్పుడే అతడిమీద నీకంత నమ్మకం ఏర్పడిందా?" అన్నాడు వినాయకరావు ఆశ్చర్యపడుతూ. టైగర్ ఓ పట్టాన ఎదుటివాళ్ళ సామర్థ్యాన్ని నమ్మడు.

టైగర్ నవ్వుతూ "ఎదుటివాళ్ళ సామర్థ్యాన్ని క్షణాల

మీద అంచనా వేయగల శక్తి టైగర్ కిచ్చాడు భగవం
తుడు" అన్నాడు.

"మోహన్‌ని స్మగ్లింగ్ ఆపరేషన్‌కి పంపాలంటే నాకేమీ అభ్యంతరం లేదు. కానీ అందుకున్న షరతు నీకు తెలిపించే గదా!" అన్నాడు వినాయకరావు.

సాధారణంగా ఒకటికి తక్కువ కాకుండా హత్యలుచేసి పోలీసుల బారినుంచి తప్పించుకుని తిరుగుతున్నవారినే యీ ఆపరేషన్సుకు నియమించడం జరుగుతుంది. ఎందుకంటే అలాంటి వారికి పోలీసుల భయం వుంటుంది. వినాయక రావు ఆశ్రయం లభిస్తే అది వారికి శ్రీరామ రక్ష. వారతడి నుంచి పారిపోవాలని కానీ, అతణ్ణి మోసం చేయాలనిగానీ అనుకోరు, అనుకోలేరు.

హంతకుడు కావడం మొదటి షరతు అయితే — టైగర్‌తో ఫైటింగ్ చేయడం రెండవ షరతు. టైగర్‌తో తలపడి నెగ్గడం సామాన్యులకు సాధ్యం కాదు. అందువల్ల ఈ ద్వంద్వ యుద్ధంలో టైగర్‌ని ఓడించాడా అన్నది ముఖ్యంకాదు.

టైగర్ శక్తియుక్తులను తట్టుకునేందుకు అతడేం చేస్తున్నాడూ—అన్నది మొదటి పాయింటు. టైగర్ని యెంత సేపు ప్రతిఘటించగలడూ అన్నది రెండవ పాయింటు.

టైగర్ దెబ్బలకు పది నిమిషాలకు మించి తట్టుకుని నిలబడిన వాళ్ళెవరూ యింతవరకు తటస్థపడలేదు.

"ఈ రోజే నేనూ, మోహన్ తలపడతాం!" అన్నాడు టైగర్.

వినాయకరావు కళ్ళు మెరిశాయి—"అయితే ఈ రోజు గొప్ప వినోద ప్రదర్శన అన్నమాట. మంచి అదృష్టమే నాది. ఈ వినోద ప్రదర్శనకు—పాపం—గోపాలకృష్ణను

కూడా పిలుద్దామా—?"

"అతను వుండడమే మంచిది" అన్నాడు టైగర్.

వినాయకరావు వెంటనే ఫోన్ చేశాడు.

ఆ సమయంలో గోపాలకృష్ణ వీరభద్రంతో క్యారమ్సు ఆడుతున్నాడు.

వినాయకరావు ఫోన్లో తానెవరో చెప్పలేదు. గోపాల కృష్ణకు ఫోన్ పేరు చెబితేనే భయంగా వుంది.

"అయిదింటికి టైగర్ ఫైట్."

మెసేజ్ విని గోపాలకృష్ణ తేలికగా నిట్టూర్చాడు.

"డాడీ! ఫోన్ ఎక్కణ్ణించి?" వీరభద్రం అడిగాడు.

"అర్జంటు పని వుంది. నేను బయటకు వెళ్ళాలి" అన్నాడు గోపాలకృష్ణ. నిజానికంత వెంటనే అతడు బయల్దేర నవసరంలేదు కానీ వీరభద్రం బారినుంచి ఏదో విధంగా తొందరగా బయటపడాలని అతడి కున్నది.

"నేనూ వస్తాను డాడీ!" అన్నాడు వీరభద్రం.

వాణ్ణి సమాధానపర్చడానికి గోపాలకృష్ణకు చాలా సేపు పట్టింది. చిట్టచివరకు వాడికి నచ్చజెప్పగలిగేక "వీడికంటే ఆ సీడే నయం!" అనుకున్నా డతను.

* *

రింగ్‌లో టైగర్, మోహన్ ఒకరి కొకరు ఎదురుగా నిలబడ్డారు.

మోహన్ గౌరవ సూచకంగా టైగర్‌కు నమస్కరించి "మిమ్మల్నే నా గురువుగా భావిస్తున్నాను. ఒక్క క్షణం మీరు శిలావిగ్రహంలా నిలబడండి. మీకు గురుపూజ చేసుకుంటాను" అన్నాడు.

టైగర్ గర్వంగా కదలకుండా నిలబడ్డాడు.

మోహన్ వినయంగా వంగాడు.

టైగర్ పాదా లంటుకున్నాడు.

మరుక్షణం అతడి నోటివెంట గురుర్బ్రహ్మ. గురు ర్విష్ణు....అన్న శ్లోకం రాగయుక్తంగా వెలువడింది.

టైగర్ మహానందంతో అతడిని మనస్ఫూర్తిగా చేతు లెత్తి దీవించాడు.

ఫైటింగ్ ప్రారంభమైంది.

ఆదిలోనే టైగర్ విజృంభించి—రెండే రెండు నిము షాల్లో మోహన్‌ని చావ చితకతన్నాడు.

మోహన్‌కి టైగర్ని చూస్తే భయం వేస్తోంది. మొదటి సారి టైగర్ చేతిలో తను తిన్న దెబ్బల ప్రభావం అతడిని మానసికంగా టైగర్‌పట్ల బలహీనుణ్ణి చేసింది.

టైగర్ మీదకు రాబోతూండగా అతను చేతులెత్తి టైగర్‌కి దణ్ణం పెట్టాడు. అతడి కనులలో ప్రాణభీతి స్పష్టంగా కనిపించింది.

"ఇప్పుడెలా - మొత్తం ప్లానంతా పాడైపోయిందే" అనుకున్నాడు బాబు. మోహన్ తన శక్తియుక్తుల్నిఎంతో కొంత ప్రదర్శించగలిగితే తప్ప అతడి చేతికి రానున్న బంగారు అవకాశం జారిపోతుంది.

"బొత్తిగా చచ్చుఘటం" అన్నాడు వినాయకరావు.

టైగర్ కూడా నీఋ్ఱగారిపోయాడు. ఇలాంటి ప్రత్యర్థిని ఇదివరలో ఎప్పుడూ ఎదుర్కోలేదు. మనిషికి సత్తాలేదు!" అన్నాడు.

మోహన్ మాత్రం ఆ సమయంలో ఆత్మగౌరవం గురించి కానీ, గౌరి గురించి కానీ ఆలోచించడం లేదు. అతణ్ణి పూర్తిగా ప్రాణభీతి ఆవహించింది.

"ఈ టైగర్‌ని నేనేమీ చేయలేను. ప్రపంచమంతా

ఒక్కపై ఎదురు నిలిచినా ధైర్యంగా తలపడగలనేమో కానీ వీణ్ని మాత్రం నేనేమీ చేయలేను" అనుకున్నాడు మోహన్. అతడికి రింగులోంచి బయటపడాలని ఆత్రంగా వుంది.

"టైగర్ ఎదుటివాళ్ళ శక్తి సామర్థ్యాల్ని క్షణాలమీద అంచనా వేయగలనన్నావు. ఇతగాడి విషయంలో ఎంత పెద్ద పొరపాటు చేశావో గమనించావా?" అన్నాడు వినాయకరావు. ఆయన మాటల్లో టైగర్‌కు హెచ్చరిక వుంది.

"లేదు బాస్ - ఇతడు మీరనుకున్నంత చచ్చుదద్దమ్మ కాదు. ఎక్కడో ఏదో పొరపాటు జరిగింది" అన్నాడు టైగర్.

"అదేమిటో నాకు తెలుసు" అన్నాడు బాబు వున్నట్లుండి.

"ఏమిటది?" అన్నాడు వినాయకరావు.

"మా వాడికి గురుపూజ చేస్తే తప్ప విజయం లభించదు. ఇందాకటి పూజ సరిగ్గా జరుగలేదు" అన్నాడు బాబు.

"పూజ ఇంకెలా జరగాలి?" అన్నాడు మోహన్.

"ఇంట్లో ఫోటోకి చేస్తావు-అలాగ" అన్నాడు బాబు.

"ఇక్కడ ఫోటో లేదు కదా" అన్నాడు మోహన్.

"ఇక్కడ టైగర్‌గారి ఫోటో లేదా?" అన్నాడు బాబు.

"ఎందుకు?" అన్నాడు టైగర్.

"మా మోహన్ అసలైన సత్తా ఏమిటో తెలుసుకోవాలని మీ అందరికీ వుంటే టైగర్‌గారి ఫోటో ఒకటి తెప్పించండి" అన్నాడు బాబు.

వినాయకరావు పరిహాసంగా నవ్వి "స్మగ్లింగ్ ఆపరేషన్స్‌లో అప్పటి కప్పుడు ఎందరినో ఎదుర్కోవలసి

వుంటుంది. ఫోటోల గురించి ఆలోచించే టైమ్ కూడా వుండదు'' అన్నాడు.

"అందరి విషయంలోనూ మావాడలా కాదు. టైగర్‌ని తను గురువుగా భావిస్తున్నాడు. అందుకే ఈ సమస్య వచ్చింది'' అన్నాడు బాబు.

అప్పటి కప్పుడు టైగర్ ఫోటో ఒకటి తెప్పించడం జరిగింది.

టైగర్‌కి కూడా మోహన్ మీద అభిమానం ఏర్పడటం వల్ల మరో అవకాశం వచ్చింది కానీ లేని పక్షంలో - అతడు చిత్తుగా ఓడినట్లే లెక్క. చిత్తుగా ఓడినవాడు స్మగ్లింగ్ ఆపరేషన్స్‌కు పనికిరాడు.

ఫోటో తీసుకుని బాబు రింగులోకి వచ్చాడు.

"ఇప్పుడు ఆరంభించు గురుపూజ'' అన్నాడతను.

మోహన్ చేయి గాలిలోకి లేచింది. ఆ ఫోటోకు చాలా పిడికిలి పోట్లు తగిలాయి. మధ్య మధ్య బాబుకు కూడా దెబ్బలు తగులుతున్నాయి. అతడు చాకచక్యంతో తనకు ప్రమాదం లేకుండా కాసుకుంటున్నాడు. మోహన్ ఆవేశం విజృంభించింది.

చూపువారికిది విచిత్రంగా వున్నది. ఒక మనిషి తన ప్రతాపాన్ని ప్రాణం లేని ఫోటోమీద చూపిస్తున్నాడు.

అలా రెండు మూడు నిమిషాలయ్యాక టైగర్ ఫోటోని కొట్టిన చేతులతోనే చటుక్కున వెనక్కి తిరిగి "టైగర్'' అని అరిచాడు మోహన్.

అది సింహనాదంలా వుంది.

టైగర్ వుత్సాహంగా ఫైటింగుకు సిద్ధపడ్డాడు.

మోహన్ ఫోటోను కొట్టిన చేతులతోనే టైగర్‌మీద పడ్డాడు.

ఆ ఊపు, ఆ చురుకుదనం, ఆవేశం, ఆ బలం టైగర్‌ను ఆశ్చర్యచకితుణ్ని కాక అశక్తుణ్ని కూడా చేశాయి. అతడు మోహన్ మీద ఒక్క ఎదురు దెబ్బ కూడా తీయకుండా నేల కూలాడు.

జీవితంలో అంతవరకూ ఎప్పుడూ యెరుగని ఘోర పరాజయం టైగర్‌ని వరించింది.

టైగర్ లేవాలని ప్రయత్నించాడు. అది విఫలయత్నమే అయింది. అతడు లేస్తే చావతన్నాలని మోహన్ సిద్ధంగా వున్నాడు.

మోహన్‌కు తన అశక్తతను సూచించడం కోసం టైగర్ అతి కష్టం మీద "నువ్వే నెగ్గావు" అన్నాడు.

ఇద్దరూ చెరో రౌండూ నెగ్గారు. ఇంకొక్క రౌండు వేయండి" అన్నాడు వినాయకరావు.

"నేను రెడీ!" అన్నాడు మోహన్.

"నా వంట్లో శక్తి లేదు-ఓటమి నంగీకరిస్తున్నాను" అన్నాడు టైగర్.

వినాయకరావు తెల్లబోయాడు.

ఇదాయన ఎదురుచూడని పరిస్థితి.

టైగర్ మెచ్చుకున్న మనిషంటే-అతడిని బహుశా ఓ పావుగంటసేపు ప్రతిఘటించగలవాడయుంటాడు అనుకున్నాడు. సమ ఉజ్జీ అయుంటాడని కూడా ఆయన అనుకోలేదు. అలాంటిది ఈ మోహన్ టైగర్‌ని చిత్తు చేసేశాడు.

ఓటమి నంగీకరించడం అంటే ఏమిటో తెలుసా? ఈ రోజు నుంచీ నీ స్థానాన్ని మోహన్ ఆక్రమిస్తాడు" అన్నాడు వినాయకరావు.

"తెలుసు" అన్నాడు టైగర్. నన్నింతలా చిత్తు చేసేవాడు బయలుదేరాక మీ రుండమన్నా ఈ స్థానంలో

అపరాధ పరిశోధన పోటీ-187

[ఫలితాలు]

ఫిబ్రవరి '84 నెల "అపరాధ పరిశోధన పోటీ—187"కి సరియైన సమాధానాలు:

1. ధీరేంద్ర బ్రహ్మచారి.
2. కత్తులు.
3. ఆకుపచ్చ.
4. పంజాబ్‌లో హత్యాకాండ.
5. చలనచిత్రాలు.

పై జవాబుల ప్రకారం యిద్దరు పాఠకులు మాత్రమే ఆల్ కరెక్టుగా పంపారు. వీరికి మే '84 నెల నుండి ఒక ఏడాదిపాటు "అపరాధ పరిశోధన" మాసపత్రిక లేదా సప్లిమెంట్ (లేదా 6 నెలలపాటు పత్రిక మరియు సప్లిమెంట్) బహుమతిగా పంపబడుతుంది.

(1) శ్రీమతి బి. నాగమణి,
c/o. బొంత విశ్వేశ్వరరావు,
న్యూ పోలీస్ కాలనీ,
పార్వతీపురం - 532 501,
(శ్రీకాకుళం జిల్లా).

(2) శ్రీ తాన్ చంద్,
s/o ఎ. జి. వి. కె. సూర్యారావు,
ఏకోనవారి తోట,
సీతారామపురం - 534 280,
(ప. గో. జిల్లా).

నేను వుండను."

వెంటనే మోహన్ "వద్దుబాస్! గ్యాంగ్ లీడర్‌గా వుండే అర్హత టైగర్ కొక్కడికే వుంది" అని టైగర్‌ని సమీపించాడు "శరీరమే శాశ్వతం కానప్పుడు శరీర బలం మాత్రం శాశ్వతమెలా అవుతుంది? బలంవల్ల ఎవడూ నాయకుడు కాలేడు. కేవలం బలంవల్ల నాయకు డయినవాడు పది కాలాలపాటు నాయకుడుగా మనలేడు. వయసుతోపాటు అనుభవం పెరుగుతూ, బలం తరుగుతూ వుంటుంది. నేనీరోజు టైగర్‌ని ఓడించినట్లే రేపటికొకడు నన్నోడించవచ్చు. కానీ గ్యాంగు లీడరుకుండాల్సిన అను భవం టైగర్ - నీకు మాత్రమే వుంది."

టైగర్ చటుక్కున లేచి మోహన్‌ని కౌగలించు కున్నాడు.

"హమ్మయ్య!" అనుకున్నాడు బాబు. మోహన్ తమ పథకాన్ని సక్రమంగా అమలుపరచడమేకాక టైగర్‌ని చాలా తెలివిగా లొంగదీస్తున్నాడు.

"ఓడిపోయినవాడ్ని కూడా నువ్వే మా నాయకుడి వంటూ వెంటబడేవాళ్ళు లేకపోతే ఇలా ఇండియా ఎందు కవుతుంది?" అంటూ అక్కణ్ణుంచి లేచిపోయాడు వినాయకరావు.

39

డిటెక్టివ్ వెంకన్న తనకు వచ్చిన రిపోర్ట్సన్నీ చూసు కుంటున్నాడు.

మోహన్ టైగర్‌కు నమ్మిన బంటయ్యాడు. అతడికి స్మగ్లింగ్ ఆపరేషన్స్ అన్నీ తెలుస్తున్నాయి. స్మగ్లింగ్ అతి విచిత్రమైన కొత్త పద్ధతిలో జరుగుతున్నది.

బంగారం కానీ, మత్తుపదార్థాలు గానీ యినుప కేసుల

"హోమ్ డెలివరీ"

1. మీరు 'హోమ్ డెలివరీ' సభ్యులుగా చేరితే, 1 నెలానెల పత్రిక మరియు సప్లిమెంట్ రెండూ కలిపి రు. 10-00లకే వి.పి.ద్వారా పంపబడతాయి. ఇందుకు అయ్యే పోస్టుఖర్చులన్నీ మేమే భరిస్తాము.

2. 'హోమ్ డెలివరీ' సభ్యత్వము పొందటానికి మీరు చేయవలసిందల్లా సభ్యత్వ రుసుము రు. 5/-లు పంపటమే. పైకం మనియార్డరుద్వారాగాని, పోస్టలు స్టాంపులుగాని పంప వచ్చును. సొమ్ము చేరగానె మీకు సభ్యత్వము కార్డు అందుతుంది.

3. 'హోమ్ డెలివరీ' వల్ల మీకు కాపీలు నెల నెలా గ్యారంటీగా, త్వరితంగా చేరుతాయి. మీ ఇంటిదగ్గరనే డబ్బు చెల్లించి కాపీలు పొందవచ్చును. కాపీలకోసం మీరు ఏజెంట్ చుట్టూ తిరుగనవసరంలేదు. కాపీలు దొరకలేదనే నిరాశ,పోస్టులో పోయే సమస్య, ఎంతమాత్రం వుండదు. పైగా సభ్యులు పోటీ లలో ఫ్రీగా పాల్గొనవచ్చును.

4. ఏ కారణంచేతనైనా మీకు పంపిన వి.పి. తిరిగొస్తే, వాటి పైకం రు. 10/-లు వెంటనే M. O. చేయాలి. కాపీలు తిరిగి 'రికార్డెడ్ డెలివరీ'లో పంపుతాము. లేదా మీ సభ్యత్వము అంత టితో రద్దవుతుంది.

5. ఇండియాలో మీరు ఏ మారుమూలనున్నా కాపీలు ఖచ్చి తంగా అందజేయబడతాయి. మీ చిరునామా మారినప్పుడల్లా తగినంత ముందుగా మాకు తెలియజేయండి.

6. పాతకాపీలు కావలసిన వారికి వాటి అసలు ధరకే వి. పి. ద్వారా పంపగలము. ఎక్కువ కాపీలు తీసుకునేవారికి కొంత కన్సెషన్ కూడ లభిస్తుంది.

7. నెల నెలా వి. పి. తీసుకోవటం కష్టమనుకునేవారు, ఏడాది పైకము రు. 120/-లు ముందుగా పంపవచ్చును. దీని వల్ల మీకు ఖర్చులు కొంత తగ్గుతాయి.

నేడే మీరూ 'హోమ్ డెలివరీ' లో చేరండి!

ద్వారా సముద్రంలోకి వదలబడుతున్నాయి. అప్పుడు వినాయకరావు గ్యాంగు తమ మోటారు బోట్సులో వెడతారు. ఆ బోట్సు అడుగున ఎప్పుడు కావాలంటే అప్పుడు అయస్కాంత శక్తిని సృష్టించవచ్చును—ఒక చిన్న మీటతో.

మీట నొక్కి అయస్కాంత శక్తిని ఆ ఇనుపకేసుల్ని ఒడ్డుకి తెచ్చుకుంటారు. పోలీసులు దరిదాపుల్లోకి వచ్చినా, హఠాదర్శన మిచ్చినా బోటు అయస్కాంత శక్తిని కోల్పోయేలా చేస్తారు. సముద్రపు అడుగున వుండే ఆ ఇనుప కేసుల గురించి పోలీసు లూహించనైనా ఊహించలేరు.

ఇప్పుడు మోహన్ ఒక స్మగ్లింగ్ ఆపరేషన్‌కు వెళ్ళబోతున్నాడు.

బాబును కూడా వాళ్ళు చిత్రంగా ఉపయోగించుకొంటున్నారు. అతడి జ్ఞాపకశక్తి అద్భుతమైనదనడంలో సందేహమేలేదు. ఎవరైనా పార్టీకి వస్తే మొత్తం అందరూ ఏయే బట్టలు కట్టుకున్నారో కూడా చెప్పగల డతను.

వినాయకరావు తన దగ్గర వ్రాతమూలకమైన సాక్ష్యాలేమీ వుంచుకోకుండా అవన్నీ బాబుకు చెప్పి కంప్యూటరులా వుపయోగించుకుంటున్నాడు.

నాని డ్రైక్లీనింగ్ షాపులో బాగా నమ్మకస్తుడనిపించుకున్నాడు. అతడికి తెలిసిన ఓ ప్రత్యేకమైన విశేషముంది. సాధారణంగా డ్రైక్లీనింగ్ ఛార్జెస్ పది పదిహేను రూపాయ లుంటాయి. కానీ ఒకోసారి స్పెషల్ వాషింగ్ పేరిట వందల్లోనూ వేలల్లోనూ కూడా ఛార్జెస్ వుంటున్నాయి. కారణం అతడికి తెలియలేదు కానీ స్పెషల్ వాషింగ్ అంటే యిష్టపడేవారు మాత్రం చాలా మంది వున్నారు.

గోపాలకృష్ణ బాబుపట్ల ఆసక్తుడవుతున్నాడు. అప్ప

మీ తీర్పు ఏమిటి?

కేసు నెం. 67 : న్యాయవాదు లందరూ దోపిడీ దొంగలనీ, వాయిదాల పేర్లతో క్లయింట్ల వద్ద డబ్బు దోచేస్తారనీ, అసలు న్యాయవాది అనే పదమే అర్థరహితమనీ, ఒక కేసులో ఒక ప్లీడరు న్యాయవాది అనుకుంటే రెండవ పక్షాన వాదించే ప్లీడరు తప్పక అన్యాయవాది అయి ఉండాలనీ, అసలు బార్ అంటేనే త్రాగుబోతుల నిలయమనీ - ఒక ప్రముఖ సినీ నటుడు ఒక సన్మాన సభలో పేర్కొన్నాడు.

ఈ స్టేట్ మెంట్ చూసిన లాయర్ మార్తాండ, ఆ సినీ నటుడిపై పరువు నష్టం దావా వేశాడు. సినీనటుడి స్టేట్ మెంట్ పరమ దారుణమనీ. లాయర్లందరి పరువు తీస్తోందనీ, అందు వల్ల ఒక లాయర్ గా తనకు నష్టపరిహారం మిప్పించవలసిందనీ వాదించాడు.

ఇక — మీ జడ్జిమెంట్ వినిపించండి?

[పై కేసులో - మీ తీర్పు ఏమిటో ఒక పోస్టుకార్డుపై వ్రాసి 5-2-84 తేదీలోపల మాకు చేరేటట్లు పంపండి. అత్యుత్తమమైన తీర్పుకు 6 నెలలపాటు పత్రికను బహుమతిగా పంపుతాము. ఫలితాలు జూన్ '84 నెల సంచికలో చూడండి. —ఎడిటర్]

కేసు నెం. 65 (తీర్పు)

కారు యజమాని దావా చెల్లదు.

క్లీనర్ పని లారీని క్లీన్ చేయటమే కాని డ్రైవ్ చేయటం కాదు. తనది కాని పని చేసిన నౌకరు వలన కలిగిన నష్టానికి యజమాని బాధ్యుడు కాదు. జగన్నాధరావు నష్టపరిహారం చెల్లించ నక్కరలేదు.

ఈ నెల న్యాయనిర్ణేత: శ్రీ పి.బి. శంకర్, టికెట్ కలెక్టరు, 122/2, లోకో కాలనీ, ఎస్.ఇ. రైల్వే, రాయపూర్ - 492 009.

డప్పుడు అతడికి జయరామయ్య ఇంట్లో యెవరికీ వినబడని మాటలు వినబడుతున్నాయి. పెళ్ళి దుస్తుల్లో గౌరి కనిపించి మాయమవుతూంటుంది. గౌరి అతడికి తప్ప యింకెవరికీ కనబడదు. అతడు గౌరికి భయపడుతున్నాడు. జయ రామయ్య తనకు దెయ్యాలంటే నమ్మకం లేదని చెప్పాడు.

గోపాలకృష్ణ పూర్వపు మనిషిలా వుండడంలేదు.

దెయ్యం గురించి అతడికి భ్రమ పెరగడంకోసం జయ రామయ్య చేసిన మరో ట్రిక్కు కూడా ఫలించింది.

ఒక భూతవైద్యుడి ద్వారా గోపాలకృష్ణకో తాయెత్తు కట్టించాడు. ఆ తాయెత్తు అతడి శరీరాన్నంటి పెట్టుకుని వున్నప్పుడు గోపాలకృష్ణకు దెయ్యం కనబడడంలేదు. అప్పుడప్పుడు ఏదో ఆటపేరు చెప్పి బాబు ఆ తాయెత్తును లాక్కుంటే ఆ సమయంలో అతడికి మళ్ళీ దెయ్యం కన బడుతోంది. ఈ సంఘటనతో అతడు గౌరి దెయ్యాన్ని పూర్తిగా నమ్మాడు.

"ఈ ట్రిక్కు ఫలించి తీరాలి. ఎందుకంటే ఇది అప రాధ పరిశోధనలో తెల్లచీర దెయ్యం కథ ఆధారంగా ప్రిపేర్ చేశాను. గోపాలకృష్ణలాంటి వాళ్ళకు ఆ పత్రిక చదివే తీరుబాటులేదు. అది మన అదృష్టం" అన్నాడు వెంకన్న భార్యతో.

రిపోర్ట్సులోని విశేషాలన్నీ చదివి పద్మావతీదేవి, వెంకన్న పకపకా నవ్వుకున్నారు.

"సరిగ్గా వారం రోజులు చాలు. మన కథ ఓ కొలిక్కి వస్తుంది" అన్నాడు వెంకన్న సంతోషంగా భార్య వంక చూస్తూ.

"ఏమిటి మీ పథకం?" అంది భార్య.

"వినాయకరావుకు బంగారం వస్తుందా? మత్తు పదా

అపరాధ పరిశోధనపోటీ-189

ఈ క్రిందకొన్ని ప్రశ్నలు, వాటి పక్కనే జవాబులు కూడా ఉన్నవి. మీరు సరియైనదని వూహించిన జవాబును, నెంబరు వారీగా ఒక (పోస్టుకార్డు సైజు) తెల్ల కాగితంపై వ్రాసి, దానితో 75 పైసలు విలువగల పోస్టలు స్టాంపులు జతపరచి పంపండి. ఆల్ కరక్టుగా పంపిన వారికి ఒక్కొక్కరికి ఒక ఏడాదిపాటు పత్రిక లేదా సప్లిమెంట్ ఉచితంగా పంపుతాము.

దీనిలో ఎవరైనను పాల్గొనవచ్చును. ఒక్కొక్కరు మూడు కూపన్లకు మించి పంపరాదు. ప్రతి కూపనుకీ 75 పైసల పోస్టలు స్టాంపులు జతపరచాలి. స్టాంపులు వేటికి అతికించకూడదు. ప్రతి కూపను వెనుక మీ పూర్తి చిరునామా, హోం. డె. సభ్యులైతే వారి నెంబరు కూడా స్పష్టంగా వ్రాయాలి.

మీ జవాబులు 5-4-'84 తేదీలోగా మాకు చేరాలి. ఫలితాలు జూన్ '84 నెల సంచికలో ప్రచురిస్తాము. *

1. మతోన్మాదం ఇక్కడ స్వైరవిహారం చేస్తున్నది—?
(పంజాబ్, హర్యానా.)

2. అవినీతి ఆరోపణలో రెడ్‌హాండెడ్‌గా పట్టుబడ్డ తెలుగుదేశం మంత్రి—? (రామచంద్రరావు, జీవన్‌రెడ్డి.)

3. ఈ అనుబంధం పవిత్రమైనది—?
(ఆలుబిడ్డలు, అన్నచెల్లెలు.)

4. దీని కోసం కొందరు ఎంతకైనా తెగిస్తారు—?
(పదవి, డబ్బు.)

5. ఇప్పుడు దొరతనం వారికి ఒక్కసారిగా దీనిపై అభిమానం పెరిగిపోయింది—? (క్రీడారంగం, టెలివిజన్.)

ర్థాలు వస్తాయా? వాటి విలువ యెంత వుంటుందో తెలుసా? సుమారు యాభై లక్షలు...." అన్నాడు వెంకన్న.

"అదాయన ముందుగానే డబ్బిచ్చి ఏ పది లక్షల లాభానికో కొనివుంటాడు."

"మరి అమ్మకం."

"అదీ ముందుగానే పుచ్చుకుంటాడు."

"అయితే?"

వెంకన్న నవ్వాడు—"మనం గౌరి కొడుకును గోపాల కృష్ణకు చేర్చిన రోజున ఓ సూట్ కేసును కొట్టేశాం. అందువల్ల తనకు ఓ బేరం పోయిందని ఆయనను కున్నాడు. కానీ నేను అప్పటికప్పుడు సూట్ కేసులోని పత్రాలు చూసి అందులోని వివరాలు డీకోడ్ చేసి—ఆ సూట్ కేసు వుపయోగించుకుని పొరుగూర్లోని మనిషికి అందజేసి డబ్బు తెచ్చుకొని వచ్చాను. ఎంతో తెలుసా— ఒకటి కాదు.... రెండు కాదు....గుండెలమీద చేయి వేసుకో యాభై లక్షలు.

"ఆఁ" అని నోరు తెరిచింది పద్మావతీ దేవి.

"ఆ డబ్బు మన దగ్గరే వుంది. ఆ డబ్బుకు తగ్గ వస్తువులు ఈ నాటికి సరిగ్గా వారం రోజుల్లో వినాయకరావు అందజేయాలి. చేయని పక్షంలో రెండు ముఠాలకూ గొడవ వస్తుంది. యాభై లక్షల కోసం చాలా పెద్ద గొడవ జరుగుతుంది. బహుశా రెండు ముఠాలూ ఒకదాన్నొకటి నాశనం చేసుకోవచ్చు" అన్నాడు వెంకన్న.

"అయితే నేనతన్ని ఈ యాభై లక్షల నష్టంతోనూ వదిలిపెట్టబోవడంలేదు" అన్నాడు తిరిగి వెంకన్న.

"పాపం ఇంకా ఏం చేస్తారండీ"_ అంది పద్మావతీదేవి జాలిగా.

ముఖచిత్ర వ్యాఖ్యల పోటీ

ఈ నెల "అపరాధ పరిశోధన" ముఖచిత్రాలను పరిశీలించండి. రెండు ముఖచిత్రాలకు (1. అట్టమీది బొమ్మ, 2. అట్ట చివరి బొమ్మ) సంబంధం వుండేట్లుగా చక్కని వ్యాఖ్యలను ఒక్క మాటలోగాని, చిన్న వాక్యంలోగాని వ్రాసి పంపండి.

ఒక్కొక్కరు ఎన్ని వ్యాఖ్యలైనా పంపవచ్చును. మీ వ్యాఖ్యలు పోస్టు కార్డుపైన మాత్రమే వ్రాయాలి. సప్లిమెంట్‌కు వ్యాఖ్యలను పంపేవారు విడిగా వేరొక కార్డుపై వ్రాసి పంపాలి. 'హోమ్ డెలివరీ' సభ్యులు అయితే తమ నెంబరును విధిగా వ్రాయాలి. మీ నెంబరు ప్రతి నెలా వి. పి. ప్యాకెట్టు మీద వుంటుంది.

అత్యుత్తమమైన వ్యాఖ్యలు పంపిన ఇద్దరు పాఠకులకు ఏడాదిపాటు పత్రికను (లేదా 6 నెలలపాటు పత్రిక మరియు సప్లిమెంట్‌ను) బహుమతిగా పంపుతాము. మీ వ్యాఖ్యలు 5-4-'84 తేదీ లోపల మాకు చేరాలి. ఫలితాలు జూన్' 84 నెల సంచికలో ప్రకటిస్తాము.

ఫిబ్రవరి '84 పోటీ ఫలితాలు

(1) ఫిబ్రవరి '84 నెల "అపరాధ పరిశోధన" ముఖచిత్రాలకు బహుమతి పొందిన వ్యాఖ్య:

వేటాడే వేట కుక్కలు !
వెంటపడే ఊర కుక్కలు !!

పంపినవారు : శ్రీ వి. కళ్యాణకుమార్, 1-1-238/1, చిక్కడపల్లి, హైద్రాబాదు - 500 020.

(2) "సప్లిమెంట్"కు బహుమతి పొందిన వ్యాఖ్య:

దుష్టుల్ని కాల్చే క్రౌర్యం !
పిట్టల్ని కూల్చే శౌర్యం !!

పంపినవారు : శ్రీ ఆర్. పట్టాభి రామరాజు, అడ్వొకేట్, 7, ఎన్.జి.ఆర్. బిల్డింగ్స్, గిరిపురం, తిరుపతి - 517 501.

"ఇదుగో....పాపాత్ములమీద అలా జాలిపడడం నాకు నచ్చదు."

"పాపాత్ములమీద జాలిపడేవాళ్ళు లేకపోతే యిది ఇండియా ఎందుకవుతుంది!" అని పద్మావతీదేవి నవ్వింది.

"ఇండియా గురించి వినాయకరావు యింకా చాలా తెలుసుకుంటాడు. మోహన్ స్మగ్లింగ్ ఆపరేషన్‌కి వెళతాడు కదా—యాభై లక్షలు విలువచేసే ఆ సరుకు కూడా పోలీసుల స్వాధీనం అవుతుంది" అన్నాడు వెంకన్న.

40

వినాయకరావు దొంక గుడ్డి దర్బారు. అతని కళ్ళముందు జరిగేదే గ్రహించలేకపోతున్నాడు.

వినాయకరావుకి బాబు ఇప్పుడు నమ్మిన బంటయ్యాడు. ఆయన గురించి యిప్పుడు బాబుకు తెలియని రహస్యాలు లేవు. అయితే ఈ రహస్యాలు ఎప్పటికప్పుడు వెంకన్నకు చేరుతున్నట్లు వినాయకరావుకు తెలియదు. అందువల్లనే ఆయనకు కష్టదశ ప్రారంభమైంది.

మోహన్ తను వెళ్ళిన మొదటి ఆపరేషన్లోనే మరణించాడు. ఈ చావు పోలీసుల సాయంతో వెంకన్న కల్పించాడు. స్మగ్లింగ్ గ్యాంగ్ లీడర్ దొరికినట్లూ, అతడు పోలీసుల కాల్పుల్లో మరణించినట్లూ, పత్రికల్లో వార్తగా వచ్చింది.

మోహన్ యెలా వచ్చాడో అలాగే పోయాడు.

ఆ తర్వాత రెండు రోజుల్లో సముద్రమంతా గాలించి పోలీసులు బంగారం, మత్తు పదార్థాలు స్వాధీనం చేసుకున్నారు.

వినాయకరావుకు యాభై లక్షల రూపాయలు నష్టం వచ్చింది.

శ్రీ మహాలక్ష్మి వారి వెరైటీ నవలలు
తప్పక చదవండి!

చంటబ్బాయ్

(ఆంధ్రజ్యోతి సీరియల్)

రచన: మల్లాది వెంకటకృష్ణమూర్తి

వెల : రూ. 20-00

సంఘర్షణ

రచన: 'మీరా' లక్ష్మి

వెల : రూ. 20-00

ట్రిక్...ట్రిక్...ట్రిక్

రచన: వసుంధర

వెల : రూ. 13-00

డాక్టర్ వనమాలి

(స్వాతి సీరియల్)

రచన: కళా ప్రపూర్ణ లత

వెల: రూ. 17-00

అడ్వాన్సు పంపని ఆర్డర్లు ఎంత మాత్రం అంగీకరించ బడవు. పుస్తకం ధరలో రూ. 1-00 తగ్గించి M.O. చేస్తే ఆ రూపాయికి V. P. P. లో పంపుతాము.

ఫోన్ నెం: 63322

శ్రీ మహాలక్ష్మి బుక్ ఎంటర్‌ప్రైజెస్

గవర్నరు పేట :: విజయవాడ-2

ఆయన తన బృందాన్ని సమావేశపరిచాడు.

"ఎక్కడో నమ్మకద్రోహం జరిగింది!" అన్నాడు వినాయకరావు. అది అనుమానం కాదు హెచ్చరిక!

టైగర్ ఆ హెచ్చరికను అర్థం చేసుకున్నాడు.

"నా మనుషు లందరిమీదా నాకు నమ్మకమే బాస్! నా అనుమానమంతా ఈ బాబు మీద వుంది. ఇక్కడ మన రహస్యాలన్నీ తెలిసిన కొత్త మనిషి యితనొక్కడే వున్నాడు" అన్నాడు టైగర్.

"బాబును నేను నమ్ముతున్నాను. అతడు అన్ని వేళలా నన్నే అంటిపెట్టుకుని వుంటున్నాడు" అన్నాడు వినాయక రావు.

"అయితే మనం అనుమానించడానికి మిగిలింది గోపాల కృష్ణ మాత్రమే!" అన్నాడు టైగర్.

"ఏమన్నావ్?" అన్నాడు వినాయకరావు ఆశ్చర్యంగా.

"అవును బాస్! ఏడు అతన్ని తరమడం ప్రారంభించి నప్పట్నించీ అతడిలో మార్పు వచ్చింది. మన కార్య కలాపాలపట్ల ఇదివరకటిలా ఆసక్తి చూపించడంలేదు. అంటీ ముట్టనట్లుగా వుంటున్నాడు. అదీకాక అతడి డ్రైక్లీనింగ్ వ్యవహార మొక్కటీ సక్రమంగా కొనసాగు తున్నది. ఫలితంగా మన కార్యకలాపాలన్నీ దెబ్బతింటు న్నాయి. ఇవన్నీ మీరు ఆలోచించి చూడండి" అన్నాడు టైగర్.

(ముగింపు వచ్చే సంచికలో)

Edited and Published by S. DAMODAR REDDY
3-4-554 Narayanaguda, Hyderabad-500 029,
and Printed at Kranti Press, Madras-600 001.